# జీవిద్దాం

ఆర్వీయస్. సుందరం

# జీవిద్దాం

ఆర్వీయస్. సుందరం

సౌశీల్య

**jiividdaam** (Let us live) - Thoughts on Philosophy of life by R.V.S. Sundaram, Professor of Telugu (Retd.), University of Mysore, Mysuru, India.

**జీవిద్దాం** – జీవితానికి సంబంధించిన తాత్త్వికచింతన – ఆర్వీయస్. సుందరం, విశ్రాంత తెలుగు ఆచార్యులు, మైసూరు విశ్వవిద్యాలయం, మైసూరు.

Pages : viii + 80
పుటలు : viii + 80

First Edition : April 2017
మొదటి ముద్రణ: ఏప్రిల్ 2017

© Author

Price : Rs.50/-
వెల : రూ. 50/–

***For Copies***
**Prof. R.V.S. Sundaram**
498, Chitrabhanu Road
Kuvempunagar
Mysuru - 570 023
Ph. +91 9844015759
rvssundaram@gmail.com

***Technical Assistance:***
**T. Venkataswamy**

*Printed at:*
**Keerthana Graphics, Mysuru**
keerthanagraphics@gmail.com



# నామాట

చిన్నతనం నుంచి ఆలోచన, అన్వేషణ అలవాటయ్యాయి. ఆలోచనలు అందరికీ వస్తాయి. కాని తాత్త్విక చింతన జీవన విధానం నుంచి పుట్టుకొస్తుంది. నా చిన్నతనం, విద్యార్థి జీవితం నాలో తాత్త్విక దృక్పథాన్ని అలవర్చాయి. మదరాసులో బి.ఎస్సీ. చదివేటప్పుడే ఆంగ్లభాషాధ్యయనంలో భాగంగా ప్రఖ్యాత తత్త్వవేత్త బెర్ట్రండ్ రస్సెల్ గురించి చదువుకున్నాను. దేన్నీ గుడ్డిగా నమ్మకుండా స్వతంత్రంగా ఆలోచించాలని నేర్పిన రస్సెల్ రచనలు నా మీద ప్రభావం చూపాయి. తెలుగు ఎం.ఏ. చదివేటప్పుడు సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారి భారతీయ తత్త్వశాస్త్రం తెలుగు అనువాదం మాకు గద్యభాగం కావటం అదృష్టమనే చెప్పాలి. ఎందుకంటే ఆ పుస్తకం ద్వారా భారతీయ తత్త్వశాస్త్ర చరిత్రను తెలుసుకొనే అవకాశం లభించింది. వేదమంత్రాలు, ఋషులు, దేవతలు, బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, ఉపనిషత్తులు, మొదలైన వాటి పరిచయం లభించింది. ఎం.ఏ. సంస్కృతం చదివేటప్పుడు తత్త్వశాస్త్రానికి సంబంధించిన అనేక విషయాల అవగాహన కలిగింది. వేదవాఙ్మయం ఒక పేపరు కావటం వల్ల ఎన్నో విషయాలు ఇంకా బాగా తెలుసుకోవటానికి వీలయింది. పాఠ్యాంశాలలో భాగంగా తైత్తిరీయోపనిషత్తు, న్యాయసూత్రాలు, మాధవాచార్యుల సర్వదర్శన సంగ్రహం, హరిభద్రసూరి షడ్దర్శన సముచ్చయం చదవటం వల్ల దర్శనాలకు సంబంధించిన ఎన్నెన్నో విషయాలు తెలిశాయి. చదివింది భాషాసాహిత్యాలయినా తత్త్వశాస్త్రానికి సంబంధించిన పుస్తకాలు పాఠ్యాంశాలుగా లభించటంవల్ల ఎంతో మేలు జరిగింది.

పదో ఏటినుంచే నాకు పుస్తకాలు చదవటం అలవాటు కావటంవల్ల తత్త్వశాస్త్రానికి సంబంధించిన పుస్తకాలుకూడా నా అభిరుచిలో భాగమయ్యాయి. పదిహేనేళ్ళ వయస్సు వచ్చేటప్పటికి గాంధీజీ పుస్తకాలు, వివేకానందుని సూక్తులు, గౌతమబుద్ధ చరిత్రము, మొదలైన అనేక పుస్తకాలను చదువుకున్నాను. తర్వాతి కాలంలో పాఠ్యాంశాలతోబాటు మ్యాక్డొనెల్ వేదమంత్రాల అనువాదం, వివరణ, సంస్కృత సాహిత్య చరిత్ర కాక ఉపనిషత్తుల మూలం, తెలుగు అనువాదాలు మొదలైనవన్నీ నా గ్రంథాలయంలో

ప్రవేశించాయి. భగవద్గీత, పురుషసూక్తం, శ్రీసూక్తం, వేంకటేశ్వర సుప్రభాతంలాంటివన్నీ నాకు పూర్తిగా నోటికివచ్చాయి. భిషగ్రత్న ఆచంట లక్ష్మీపతిగారి ఆయుర్వేద గ్రంథాలతోబాటు దర్శనములు, మతములను గూర్చి రాసిన రచనలు నాకు వాటిని గూర్చిన అవగాహనను పెంచాయి.

1966 ప్రాంతంలో జిడ్డు కృష్ణమూర్తిగారి రచనలు చదవటం ప్రారంభించాను. ఇంగ్లీషులో, తెలుగులో ఆయనను గురించి వచ్చిన పుస్తకాలు చదివేకొద్దీ నాకు ఆయన అభిప్రాయాలు చాలావరకు నచ్చసాగాయి. నా ఆలోచనల స్వాతంత్ర్యానికి, నేను నేనుగా రూపొందటానికి ఆ తత్త్వవేత్త ప్రేరణ కలిగించారు. 1982లో ఒకసారి, 1983లో ఒకసారి అమెరికాకు వెళ్ళినప్పుడు ఆయన నివాసానికి వెళ్ళి కలుద్దామనుకున్నాను. కాని వీలుకాలేదు. ఆయన చివరిసారిగా మదరాసుకు వచ్చి ఉపన్యాసం ఇచ్చినప్పుడు వెళ్ళాలనుకున్నాను కాని వెళ్ళలేకపోయాను. కాని ఆ ఉపన్యాసం భాగాలు రేడియోలో వస్తే రికార్డు చేసుకున్నాను. అయితే రాను రాను నా జీవన విధానాన్ని నేనే రూపొందించుకొనే అన్వేషణ సాగించాను. ఈ ఆలోచనల్లో కొన్నిటిని మీ ముందుంచుతున్నాను. నా ఆలోచనలు అందరికీ నచ్చాలని లేదు. కాని ఆలోచనను మాత్రం మానకూడదని మనవిచేయటం మాత్రమే నేను చెయ్యగలిగింది.

**ఆర్వీయస్. సుందరం**



# విషయ సూచిక


| | |
|---|---|
| నామాట | v |
| భూమిక | 1 |
| సృజనాత్మక తాత్త్విక చింతన | 3 |
| కవి హృదయం | 11 |
| దార్శనికుల దృక్పథాలు | 20 |
| సుభాషితాలు | 39 |
| కృష్ణుడు – కృష్ణమూర్తి | 49 |
| మనుషులుగా జీవిద్దాం | 68 |
| ఆర్వీయస్. సుందరం రచనలు | 75 |

విద్వత్త్వం చ నృపత్త్వం చ నైవ తుల్యం కదాచన
స్వదేశే పూజ్యతే రాజా విద్వాన్ సర్వత్ర పూజ్యతే

(పండితుడై ఉండటానికీ రాజుగా ఉండటానికీ పోలికే లేదు. రాజుకు తన దేశంలో మాత్రమే గౌరవం. పండితునికి అన్ని చోట్లా గౌరవం)

కాలోహ్యయం నిరవధిః విపులాచ పృథ్వీ
(కాలం అవధి లేనిది పృథ్వి విశాలమైనది)
– భవభూతి

వినదగు నెవ్వరు చెప్పిన
విని నంతనె వేగ పడక వివరింపదగున్
కని కల్లనిజము దెలిసిన
మనుజుడె పో నీతి పరుడు మహిలో సుమతీ!

# జీవిద్దాం

## భూమిక

పుట్టిన వాళ్ళందరూ చనిపోయేదాకా జీవించాల్సిందే. ఏడుస్తూ ఎందుకు పుడ్తామో, ఏడిపిస్తూ ఎందుకు పోతామో తెలుసుకోవటానికి ఒక జీవితకాలం చాలదు. నిశ్శబ్ద ప్రభాతాన్ని మృదువుగా మేల్కొల్పే పక్షుల కలకలారావాలు, అరుణకాంతుల మధ్య అందంగా తొంగిచూస్తున్న బాలభానుడు, నిర్మలాకాశంలో మినుకుమినుకుమనే కోటి కాంతుల మధ్య లోకాన్నంతటినీ చల్లని వెన్నెలతో ముంచెత్తే పున్నమి చందురుడు ఎప్పటికీ మన అనుభవంలో ఉండిపోతే జీవితం ఎలా ఉంటుందో ఊహించగలమా? సముద్ర మథనంలాంటి జీవిత ఘర్షణలో అమృతమూ విషమూ ఉదయించాల్సిందేనా? నదిని కన్నీటి ప్రవాహంగా భావించేవారికి నీటిని ముద్దాడి మెల్లగా వచ్చి తాకే చల్లని గోదావరి గాలి సంతోషం కలిగిస్తుందా?

అన్నీ ప్రశ్నలే. సమాధానాలు రావు.

సమాధానాలు రావు. వెతుక్కోవాలి.

ఏది ఏమైనా సరే జీవిద్దాం. మరణం మనల్ని వెతుక్కొని వచ్చేంతవరకు నిబ్బరంగా జీవిద్దాం. మనశ్శాంతితో జీవిద్దాం.

జీవించటమంటే బతకటమేనా? జీవితమన్నా బతుకన్నా ఒకటే. కాని జీవితంలో జీవం ఉంది. బతుకులో బతుకు మాత్రం ఉంది. జీవం ఉందని తెలుసుకొని జీవించటం ముఖ్యం. బతకటాన్ని, జీవించటాన్ని ఒక్కో సందర్భంలో ఒక్కోవిధంగా వాడుతుంటాం. 'బతికితే ఇలా బతకాలి' అని నిదర్శనం చూపిస్తాం. చాలా బాధల్లో ఉంటే 'బతుకు ఈడుస్తున్నాడు' అంటాం. 'బతికుంటే బలుసాకు తిని బతకవచ్చు' అని సామెతలు చెప్తాం. 'బతుకు తెరువు' గురించి మాట్లాడతాం. జీవించటమన్నదాన్ని 'బాగా బతకటం' అనే అర్థంలో వాడుతుంటాం. 'ఆ నటుడు కృష్ణుని పాత్రలో జీవించాడు' అంటాం కాని 'బతికాడు' అనం. అంటే 'జీవం ఉట్టిపడేలా నటించి చూపాడు' అని అర్థం.

జీవితం కూడా ఒక నటనే. 'నానాటి బతుకు నాటకము' అన్నాడు అన్నమయ్య. ఈ బతుకనే నాటకంలో పాత్రధారులమైన మనం మన పాత్రలకు జీవం పొయ్యాలి. మన పాత్రలో జీవించాలి. అందుకే జీవిద్దాం. ఫలప్రదమైన జీవితాన్ని గడపటానికి మార్గాలను అన్వేషిద్దాం. సృజనాత్మకమైన తాత్త్విక చింతనతో సార్థకమైన జీవితం గడపటానికి మార్గాలు లభిస్తాయేమో చూద్దాం. కొన్ని వేల సంవత్సరాలుగా మనిషిలో కల్గుతున్న మథన అతని జీవితానికి ఎంతవరకు ఉపయోగించిందో ఆలోచిద్దాం. భారతీయ తత్త్వవేత్తల ఆలోచనలు మనకేదైనా దారి చూపిస్తాయేమో పరిశీలిద్దాం.

వేదకాలం నుంచి నేటివరకు తత్త్వవేత్తలు మానవాతీతశక్తుల్ని గురించి గంభీరమైన చింతన జరిపారు. మానవుని మనుగడను గురించి, విధానాన్ని గురించి గౌతమబుద్ధుని లాంటివారు ఆలోచించారు. కాని తర్వాతి కాలంలో బుద్ధుణ్ణి కూడా దశావతారాలలో చేర్చటమో, జన్మాంతర కథలకు ప్రాధాన్యమివ్వటమో జరిగింది. మానవుణ్ణి గూర్చిన ఆలోచనలు వెనకబడ్డాయి.

జిడ్డు కృష్ణమూర్తిలాంటి తత్త్వవేత్తలు మానవకేంద్రితమైన ఆలోచనలనే మనముందుంచినా అవి సామాన్యులకు అందరాని స్థాయిలో ఉన్నాయి. వీటన్నిటికీ సంబంధించిన ఆలోచనల్ని సాధ్యమైనంత సరళంగా అర్థంచేసుకోవటం ఎలాగా అన్నదే ఈ రచనకు మూలం. ప్రతి ఒక్కరూ ఆలోచించటానికి మార్గాలున్నాయని ప్రతిపాదించటమే ఉద్దేశం.



# సృజనాత్మక తాత్త్విక చింతన

తాత్త్విక చింతన అనగానే వేదాలు, ఉపనిషత్తులు, దర్శనాలు, స్మృతులు జ్ఞాపకం వస్తాయి. వీటిని స్మరించకుండా తాత్త్విక చింతన సాగించిన భారతీయ తత్త్వవేత్తలు అరుదు. వీటి ఆధారం లేకుండా తాత్త్విక దృక్పథాన్ని అలవర్చుకోవటం అసాధ్యమా అనే ప్రశ్న తప్పక ఉదయిస్తుంది. అతి సామాన్యులయిన జానపదులు కూడా తాత్త్విక దృక్పథంతో గొప్ప మాటలు చెప్పవచ్చుననే విషయాన్ని విద్యావంతులైన తత్త్వవేత్తలు ఎప్పటికీ ఒప్పుకోరు. కాని తెలుగువారిలోనే వేమన, పోతులూరి వీరబ్రహ్మం, ఏగంటి మొదలైన వారు సామాన్యులకు కూడా బోధపడే ఎన్నో విషయాలను తెలియజెప్పారు. జానపదులలోనే తత్త్వాలు వేల సంఖ్యలో వెలువడ్డాయి. జానపదుల జీవితంలో గేయాలు, సామెతలు, ఆటలు మొదలైన వాటిలో కూడా గంభీరమైన తాత్త్విక చింతన దర్శనమిస్తుంది. అందువల్ల శ్రుతులు స్మృతులు తెలియకున్నా అతిసామాన్యులు కూడా సృజనాత్మక తాత్త్విక చింతన జరపవచ్చునని స్పష్టమవుతుంది. సాంప్రదాయికమైన జీవనానుభవం జానపదుల నోటివెంట సామెతల రూపంలో వెలువడుతుంది.

**కాలికి దూరమైతే కంటికి దూరమా**

ఈ సామెత దూరంగా ఉండే వస్తువును చూచే దృష్టి అవసరమనే విషయాన్ని సూచిస్తుంది. ఈ చూపు కేవలం మనం వస్తువులను చూచే చూపు కాదు. అలాంటి విశేష దృష్టి ఉన్నవారు ఏ వస్తువు ఎంత దూరంలో ఉన్నా అంతర్నేత్రంతో దర్శించగలరు.

అంతర్నేత్రంతో దర్శించగల్గిన సామాన్యులు కూడా సాంప్రదాయికమైన ఆలోచనలకు, కర్మకాండలకు అతీతంగా ఆలోచించగలరని కొన్ని సామెతలు నిరూపిస్తాయి. కనపడిన అన్ని రాళ్ళకు చెట్లకు మొక్కే జానపదులు ఆలోచనాత్మకంగా వ్యక్తీకరించే మాటలు పరిశీలించదగ్గవి.

**చిల్లర దేవుళ్లకు మొక్కి చిత్తం చెడగొట్టుకున్నట్లు**

సృజనాత్మక తాత్త్విక చింతన అనేది సామాన్యంగా మనం భావించే ఆధ్యాత్మిక

చింతనకు సంబంధించింది కాదు. ఇది ఏ మతానికిగాని మానవాతీత శక్తులమీద నమ్మకాలకుగాని సంబంధించింది కాదు. మనసులో నిలిచిపోయిన నమ్మకాలను జ్ఞాన భారాన్ని ఎప్పటికప్పుడు ఖాళీ చేసుకుంటూ వినూత్న విషయాలను నింపుకుంటూ మళ్లీ విరామం కల్పిస్తూ ఉండటమే సృజన.

మానవుని మనస్సు లక్షల సంవత్సరాల భారాన్ని మోస్తూ ఉంది. మతాచార్యులు, ఆలోచనాపరులు, తత్త్వవిదులు ఈ సమస్యనుంచి విముక్తి కలిగించటానికి ఎన్నో విధాల ప్రయత్నించారు. కాని మనస్సు మీద ఒత్తిడి తగ్గలేదు. అంతేకాదు, ఈ మతాచార్యులు, తత్త్వవిదులు మానవుని సృజనశీల వ్యక్తిత్వానికి అడ్డుకట్ట వేశారు. వైరాగ్యం, ఆలోచనా జ్ఞానం కేవలం విద్యావంతులకే సాధ్యమనుకునే వారు జానపదుల జ్ఞానాన్ని తక్కువ అంచనా వేస్తారు. జానపదులు విద్యలేని వారైనా విజ్ఞానం లేనివారు కాదని తెలుసుకోవాలి.

జ్ఞానమంటే కేవలం మెదడులోని అనుభవాల మొత్తమని భావించటం సరికాదు. తెలివి అనేది విచక్షణకు సంబంధించింది. తెలుగులో 'ఎరుక' అనే పదం ఉంది. ఎరుక అంటే తెలుసుకోవటం. తెలుసుకొనే శక్తి లేకుండా జ్ఞానాన్ని సంపాదించటం వల్ల వచ్చే లాభం ఏమీ లేదు. 'తెలివి ఒకడబ్బ సొమ్మా' అంటారు. అంటే తెలివి అన్నది తెచ్చుకొనేది కాదు. ఎవరికివాళ్ళు సంపాదించుకోవలసింది. పసిపాప మెదడులోని కణాలు ఎప్పుడయితే జీవశక్తితో కార్యప్రవృత్తమవుతాయో ఆ క్షణం నుంచే సృజన శక్తి జ్వలిస్తుంది. ఈ సృజన శక్తి ప్రాచీన మానవునిలో కూడా తాత్త్విక దృష్టిని కలిగించింది. పడవ నడిపేవాడు ఎంత నిపుణుడైనా సముద్రపుటలల్ని చూడగానే 'గట్టెక్కుతాదా నా తెప్ప కల్లోల జలధిలో' అంటాడు. ఇక్కడ సముద్రం ఒక సంకేతం మాత్రమే. అతని ఆలోచనలు జీవన జలధినిగురించే వెలువడినవన్నది స్పష్టం.

శూన్యం భారతీయ తత్త్వశాస్త్రంలో చాలా ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. శూన్యవాదం వివిధ దర్శనాలలో ప్రముఖ స్థానం ఆక్రమించుకుంది. శూన్యం నుంచే వచ్చిన సున్న భారతీయుల సృజన శక్తివల్ల వెలుగులోకి వచ్చిందే. బౌద్ధం, సాంఖ్యం, వేదాంతం లాంటి దర్శనాలలోనే కాక నేటి గణితశాస్త్రం, కంప్యూటర్ విజ్ఞానం లాంటి వాటిలోనూ శూన్యం ముఖ్యమైంది. భారతీయ మతగ్రంథాలలో, తాత్త్విక చర్చల్లో, శూన్యం. దానికి సంబంధం ఉండే మిథ్య, వైరాగ్యం, సమాధి, ముక్తి మొదలైన వాటిల్లోను ఈ పరికల్పన కనిపిస్తుంది.





మనిషి తన మనస్సు మీద ఉన్న ఒత్తిడిని తగ్గించుకోడానికి, అనుభవాలకు, జ్ఞానానికి సంబంధించిన బరువును దించుకోడానికి ప్రయత్నాలు సాగిస్తూనే ఉన్నాడు. ధ్యానం, మతాచారాలు కొంతవరకు ఈ భారాన్ని తగ్గించడానికి ఉపయోగపడుతున్నాయి. బౌద్ధంలోని క్షణికవాదం, అద్వైతానికి సంబంధించిన రజ్జుసర్ప భ్రాంతి లాంటివి ప్రత్యక్షంగానో పరోక్షంగానో మనిషి మనస్సును గతకాలపు అనుభవాలనుంచి విముక్తుణ్ణి చేయటానికి కొంతవరకు దోహదం చేస్తాయి.

వైరాగ్యాన్ని అలవర్చుకోవడానికి మనిషి దైవాంశ సంభూతుడో శాస్త్రవేత్తో మతాచార్యుడో కానక్కరలేదు. నిజానికి జానపదులు కూడా అనుబంధాలతోబాటు వైరాగ్యాన్ని జీవితంలో అలవర్చుకోవటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. దీన్నే సృజనాత్మక తాత్త్విక చింతనగా భావించవచ్చు. శూన్యాన్ని సాధించటం దీని లక్ష్యం కాదు. ఎప్పటికప్పుడు ఖాళీ చేస్తూ మళ్లీ నింపుతూ ద్వేషానికి, పగలకు, శత్రుత్వాలకు తావు లేకుండా చేయటం ముఖ్యం. జీవితం శాశ్వతం కాదనే విషయాన్ని జానపదులు సామెతల ద్వారా బలంగా వ్యక్తీకరిస్తారు.

**నూలు బట్ట నూరేళ్ళు కడతామా**

ఇలాంటి అభిప్రాయాన్ని బలపర్చుకున్నప్పుడు భార్యతో సహా ఎవరితోనూ పోట్లాటకు తావుండదు. అందుకే ఈ క్రింది సామెతలాంటివి ఏర్పడ్డాయి.

**ఆలుమగల కలహం అన్నం తినేదాక**

ఈ విధమైన గుణాత్మక చిత్తవృత్తి జానపదుల్లో కన్పిస్తుంది. భౌతిక అస్తిత్వానికి వైరాగ్యం అడ్డురాదు. అర్థవంతమైన జీవితం గడపాలంటే అనుబంధాలు, వైరాగ్యం రెండూ అవసరమే. జీవితం కేవలం మిథ్య అనటాన్ని జానపదులు అంగీకరించరు.

**తనువు తాను కాదనువాడు తపసు చేయనేల**

జానపదుల జీవితాన్ని నిశితంగా పరిశీలిస్తే ఐహిక జీవితానికి సంబంధించిన ఆలోచనలకు, అశాశ్వత జీవితానికి సంబంధించిన ఆలోచనలకు మధ్య వైరుధ్యం ఉన్నట్లు కనిపించదు. శాశ్వతం కాని జీవితాన్ని ప్రతీకల ద్వారా వ్యక్తీకరించటం జానపదుల కార్యకలాపాలలో గమనించవచ్చు. వామనగుంటల ఆటలో చింతగింజల్ని నింపుతూ, ఖాళీ చేస్తూ సూచించటం కేవలం ఒక ఆటగా కనిపించినా అది జీవన క్రీడకు ప్రతీక అనిపిస్తుంది. అలాగే మనం ఆహారంలో భాగంగా భుజించే చిత్రాన్నం.

పరమాన్నం ప్రాపంచిక జీవితంలోని వైవిధ్యాన్ని, అందుకోవాలనుకునే పరమార్థాన్ని సూచించేవిగానే కనిపిస్తాయి. 'చిత్రాన్నం' అనే పేరే వివిధ రుచులతో తయారయిన జీవితాన్ని గుర్తుచేస్తుంది. చిత్రాన్నాన్ని ఎక్కువగా తినటానికి ఇష్టపడతాము. 'పరమాన్నం' మధురంగా ఉంటుంది. స్వచ్ఛంగా ఉంటుంది. కాని దాన్ని మితిమీరి భుజించలేము. ఇలాంటి తాత్త్వికమైన ఆలోచనలతోనే ఆహారాలు ఏర్పడటం వింతగానే అనిపిస్తుంది.

శూన్యాన్ని గుర్తుచేసే మరో జీవన క్రియ ఉపవాసం. సాంప్రదాయికమైన జీవితంలో 'ఒక్కపొద్దు' (ఉపవాసం) ఉండటం ఒక ఆచారంగా కనిపించినా ఆరోగ్యపరంగా చూసినా అది అవసరమే అనిపిస్తుంది. 'లంఘనం పరమౌషధం' అనే మాట ఉండనే ఉంది. ఉపవాసం ఉండటం కూడా ఖాళీ చేసే ప్రక్రియే. ఖాళీ చెయ్యకుండా నింపుతూ పోతే అజీర్ణం చేస్తుంది. సాంప్రదాయిక భారతీయ వైద్య పద్ధతిలో చికిత్సకు ముందు దేహాన్ని మనస్సునీ నిర్మలం చేసుకోవాలి. ఇలా శూన్యాన్ని సాధించటం వర్తమానాన్ని, భవిష్యత్తును తీర్చిదిద్దుకోడానికే. వివేకానందుడు చెప్పినట్లు "ప్రపంచం మొత్తం మన మనస్సులోనే ఉంది. దేన్నయినా సరైన వెలుగులోనే చూడటం నేర్చుకో (Vivekananda - his call to the nation, p.37).

మనస్సును ఎప్పటికప్పుడు నిర్మలం చేసుకోవటంవల్ల సహజంగానే సామాజిక దృష్టి అలవడుతుంది. భారతదేశంలోనే కాక ప్రపంచంలోని అనేక ప్రదేశాలలో ఉన్న జానపదులు, ఆదివాసులు సామాజిక జీవనాన్ని గడుపుతారు. జానపద సాహిత్యాన్ని పరిశీలిస్తే సామాజిక స్పృహ సహజంగానే కనిపిస్తుంది. ఇది ఎవరో బోధించటం వల్లనో తర్ఫీదు ఇవ్వటం వల్లనో వచ్చింది కాదు.

ఆస్ట్రేలియాకు చెందిన ఒక ఆదివాసి స్త్రీ ఇలా పాడుతుంది.

Give to me, Give to her, baby
Give to him, baby, Give to one baby
Give to all baby
(C.M. Bowra, Primitive Song, p.169)

ఇదే అభిప్రాయాన్ని ఒక వంధ్యాస్త్రీ కన్నడ జానపదగేయంలో వ్యక్తం చేస్తోంది.

కూడలసంగ! దయచేసి బిడ్డలనివ్వు
నాకు కాదు, నా చెలికివ్వు
నీ ఆలయద్వారానికి బంగరు తొడుగు చేయిస్తాను.





నగర జీవితానికి అలవాటు పడినవారికి సంస్కృతికి సంబంధించిన విషయాలు అర్థం కావు. సాటి మనిషి పట్ల సహజ ప్రేమను మర్చిపోయిన వారికి సంస్కృతికి సంబంధించిన మూలగుణం గుర్తుండదు. నాగరిక సమాజం ఈ వాస్తవాన్ని అంగీకరించక సాంకేతిక సౌకర్యాలతో కప్పిపుచ్చాలని చూస్తుంది. జన సంపర్కమన్నది స్థిరవాణి వల్లనో చరవాణివల్లనో వచ్చేది కాదు. సామాజిక జీవనం వల్ల వస్తుంది. జనసంపర్కాన్ని కోరే మనస్సు జానపదుల్లో సహజంగానే ఉంటుంది. మనలో ఆడపిల్లని అత్తవారింటికి పంపేటప్పుడు పాడే అప్పగింతల పాటలకు అచ్చుగుద్దినట్లు ఉండే పిగ్మి ఆదివాసి స్త్రీల పాటని చూస్తే ప్రపంచంలో ఏ మూలలోనైనా జానపదుల మనస్సు ఒకే విధంగా ఉంటుందని తెలుస్తుంది. ప్రేమ మానవత్వాన్ని కూడా దాటి ప్రకృతితత్త్వం వైపు ప్రవహిస్తుంది.

Slowly, slowly,
Child, counting your steps
Go away, go away with tears,
With a large heart, with a weary heart,
Without turning your face,
From the house, from the village,
Where your eyes so gaily
Laughed at every comer,
Keep on your heart
And guard well the flower
Of your mother's garden,
The flower which will say to you:
"I am still loved below"
Keep on your heart
And guard well the flower
In memory for ever.

భారతదేశంలో ఇంకా ఉమ్మడి కుటుంబం పూర్తిగా అంతరించి పోలేదు. ఉమ్మడి కుటుంబం అన్నది కేవలం కలిసి ఉండే కుటుంబం కాదు. కలిసిపోయిన

కుటుంబం. 'కలిసి ఉంటే కలదు సుఖం' అనే మాట భారతీయుల మనస్సును తెలియపరుస్తుంది.

ఉమ్మడి కుటుంబమనే పరికల్పన భారతీయుల కుటుంబ వ్యవస్థకు సారభూతమైంది. ఆధునికత, పారిశ్రామికీకరణం, నగరీకరణలాంటివి భారతీయుల సాంప్రదాయిక కుటుంబ వ్యవస్థమీద ప్రభావం చూపాయి. కాని ఈ ప్రభావం పరిమితమే. భారతదేశంలోని నగరాల చుట్టూ పల్లెటూళ్ళే ఉన్నాయి. అవి నగర సంస్కృతి మీద ప్రభావం చూపుతాయి. భారతదేశంలోని నగరీకరణను బలంగా సమర్థించేవారు కూడా భారతీయ కుటుంబ వ్యవస్థ సామాజిక సహజీవనానికి దోహదం చేస్తుందని ఒప్పుకుంటారు. భారతదేశంలో వాడుకలో ఉండే గేయాలు, వీరగాథలు, కథలు, సామెతలు, పొడుపు కథలు, నమ్మకాలు మొదలైనవి భారతీయ కుటుంబ వ్యవస్థకు పోషకంగా ఉన్నాయి. ఆధునిక మనస్సుకు ఉమ్మడి కుటుంబంలోని లోపాలే ప్రధానంగా కనిపిస్తాయి. కాని కలిసి ఉంటంవల్ల ఎప్పటికప్పుడు మనసులోని విషయాలను ఖాళీచేసుకొని మళ్ళీ మళ్ళీ జీవన విధానాన్ని రూపొందించుకొనే ప్రయత్నం సాగుతూనే ఉంటుందనిపిస్తుంది.

అద్వైతం లాంటి తాత్త్విక దర్శనాలలో ఉండే విషయాలను జానపదులు పుస్తకాలను చదవటంవల్లనో, మతబోధనలు వినటంవల్లనో కాక జీవనానుభవం వల్లనే తెలుసుకుంటారు. ఎప్పటికప్పుడు సృజన శక్తితో జీవన విధానాన్ని రూపొందించుకో గలిగిన వాడే 'తెలివి'గలవాడు. భారతీయులకు ఇలాంటి మూలభూత ఐక్యదృష్టి తాత్త్వికపరమైన ఊహ కాదని, వారి భావనలోనే ఇది జీవనాదర్శమని రవీంద్రుని లాంటివారు భావించారు. “The fundamental unity of creation was not simply a philosophical speculation for India, it was her life-object to realize great harmony in feeling and in action” (Rabindranath Tagore, Sadhana, p.7)

అద్వైతాన్ని కేవలం భౌతికాధ్యాత్మికాల అభేదాన్ని మాత్రమే సూచించే భావనగా అనుకోనవసరం లేదు. మనుషులకు ఉండాల్సింది విభజించే గుణం కాక కలిపే గుణం అన్నదే ఇక్కడి అర్థం. మనిషి చనిపోయాక నరకానికో, స్వర్గానికో వెళ్తాడని మరణానంతర విశ్వాసాలను బలంగా అలవరచుకున్న సామాన్య మానవుడు కూడా ఎవరైనా చనిపోతే 'మట్టిలో కలిసిపోయారు' అనటంలోని భావాన్ని అర్థం చేసుకోవాలి.





కలిసిపోవటం, లేక కలపటం అన్నదాన్ని జానపదులు నిత్య జీవితంలోని ఎన్నో ఉదాహరణల ద్వారా సూచిస్తారు. ఈ సందర్భాలు చూడటానికి అతి సామాన్యమైనవిగా కనిపిస్తాయి. అయితే సూక్ష్మంగా పరిశీలిస్తే వాటిలోని అంతరార్థం తెలుస్తుంది. ముగ్గు లేక రంగవల్లి కేవలం అలంకరణకోసం వేసేది కాదు. ఎన్నో చుక్కలు పెట్టి ఆ చుక్కలను కలుపుతూనో లేక ఆ చుక్కల చుట్టూ గీతలు గీయటం ద్వారానో ఒక విన్యాసం సృష్టించటం ఒక సృజనాత్మక కళ, కలపటమనే ప్రక్రియకు ఒక ప్రతీక.

ఉగాది పండగ కూడా ఇలాంటిదే. తెలుగువారి ఉగాది అన్ని పండగల్లాంటి ఏదో ఒక పండగ కాదు. ఉగాది పచ్చడిలో చేదుతో సహా అన్ని రుచుల్ని కలపటం ద్వారా జీవన వైవిధ్యాన్ని, మన అనుభవంలోకి వచ్చే రసమయ సన్నివేశాల్ని గుర్తుచేయటం జరుగుతుంది.

దాగుడు మూతల వంటి అతి సామాన్యంగా తోచే ఆటల వెనక సుఖదుఃఖాలు, వెలుగునీడలు ఎలా దోబూచులాడుతాయో సూచించటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. సత్యాన్వేషణలో ఎలా దాగుడుమూతలు ఆడాలో ఇలాంటి ఆటలు మనకు నేర్పుతాయి.

ఇవేవో కొన్ని తెచ్చిపెట్టుకొన్న ఉదాహరణలని ఇవేవో మనిషి తాత్త్విక చింతన మీద ప్రభావం చూపేంత బలమైనవి కావని అనిపించవచ్చు. మానవుని మనస్సు అనేక ప్రయోగాలకు తావిచ్చే ఒక ప్రయోగశాల లాంటిది. అదొక సంకీర్ణమైన అనుభవం. చివర్లో కాని మొదట్లో కాని ఏదీ లేదు. కాని ఈ రెండిటి మధ్య మొత్తం ప్రపంచం నిలిచి ఉంది. చివరిని మొదటిని కలపటానికి అన్వేషణ సాగుతూనే ఉంది. దీనికోసం ఆదిమ మానవుడి కాలం నుంచి ఇప్పటివరకు ఎన్నో విధాలుగా మనిషి ప్రయత్నిస్తూనే ఉన్నాడు. హ్యాడన్ ఇలా అంటాడు: “There is nothing in the end which is not in the beginning and the unbroken continuity can be traced between most of our customs and those of our barbarian forefathers, who in their turn, received them from their savage ancestors” (A.C. Haddon, Introduction to *Customs of the World)*.

నిరంతరాన్వేషణ మానవుని సహజ క్రియ అనటానికి, జానపదులు, నాగరికులు అనే భేదం లేదని చెప్పటమే ఈ అధ్యాయం ఉద్దేశం. మనిషి చదువుకున్నవాడైనా, చదువులేని వాడైనా సృజనాత్మక తాత్త్విక చింతన అవసరం. గతకాలపు అనుభవాల నన్నిటినీ తుడిచివేసే శూన్యాన్ని సాధించటం సాధ్యమేనా? కొత్తకొత్త లోకాల్ని ఎప్పటి

కప్పుడు నిర్మించుకుంటూ ఉండాలా? లేక, నిరంతరం ఎగిసిపడే అలలన్నీ ఒడ్డుకు చేర్చే ప్రయత్నాలే కాని మనస్సనే సాగరానికి శాశ్వత బంధాలు కావని భావించాలా? ఇలాంటి భావ సంఘర్షణ ఏ మనిషికైనా సహజమే. ఏది ఏమైనా సృజనాత్మక దృష్టి మాత్రం ఎప్పటికీ అవసరమని మాత్రం గుర్తుంచుకోవాలి.



# కవి హృదయం

తాత్త్వికమైన ఆలోచనలకు విద్యావంతులని, నాగరికులని, జానపదులని భేదాలు లేవని, సృజనాత్మక తాత్త్విక దృక్పథం ఎవరిలోనైనా ఉండవచ్చని వెనకటి అధ్యాయంలో చూశాం. జీవితాన్ని గురించిన ఊహలు కవి హృదయం నుంచి వెలువడితే ఎలా ఉంటాయి అన్నది కుతూహలం కలిగించే విషయమే. సామాన్యంగా ఎవరికైనా కలిగే ఊహల్నే కవి అందంగా, ఆకట్టుకొనేలా చెప్పగలడు. తల్లి గర్భంలో ఉన్నప్పటి నుంచి మరణించేవరకు మనిషిని గురించి కవి హృదయం ఎన్నో విధాలుగా స్పందిస్తుంది.

లూయి మక్నీస్ అనే కవి ఇంకా పుట్టని శిశువు వ్యక్తీకరణ ఎలా ఉంటుందో ఊహించాడు:

“ఇంకా పుట్టలేదు; అయినా నా పాలికి లభించనీ
ఓలలాడించే నీళ్ళు, నవ్వుతూ ఉండే పచ్చిక పచ్చదనం,
మాట్లాడించే చెట్టు చేమ, పాడే నీలి ఎదలోపల
పక్షితో బాటు తెల్లని వెలుగు చేయిపట్టుకొని నడిపించనీ”

పసిపాప మన జీవితంలో ముగ్ధత్వానికి ప్రతీక. వయస్సు, జ్ఞానమూ భారమై, క్రుంగదీస్తున్న తరుణంలో పసిపాపలా మారిపోగలగడమే జీవన సాఫల్యం. పసిపాపను గురించిన భావనలు విశ్వకవి రవీంద్రునిలో అపూర్వంగా వెల్లివిరిశాయి:

“పసిపాప నిద్రించేటప్పుడు ఆ పాప పెదవులపై తొంగిచూచే లేత చిరునవ్వు ఎలా వచ్చిందో ఎవరికైనా తెలుసా? అవును, బాలచంద్రుని లేత కిరణం శరత్కాల మేఘాన్ని తాకింది. ఆ మందహాసం మంచు బిందువులు రాలిన ప్రాతఃకాలపు కలల్లో పుట్టింది. పసిపాప అంగాంగాల్లో వికసిస్తున్న ఆ మృదుమధురమైన కొంగ్రొత్త సొగసులు ఎక్కడివో ఎవరైనా చెప్పగలరా? అవును, ఆ తల్లి చిన్న ఆడపిల్లగా ఉన్నప్పుడు ఆ సొగసులు ప్రేమగా కోమలంగా గూఢంగా ఆమె హృదయంలో దూరి ఇప్పుడు ఆ పసిపాప అంగాంగాలలో మృదుమధురంగా వ్యాపించాయి.”

శిశువును గురించిన అద్భుత పదచిత్రాన్ని అందించిన మహాకవి జాషువ. ఆ చిత్రాన్ని అనుభవించి పరవశించే ఏ హృదయమైనా పసితనానికి బానిసైపోతుంది:

“బొటవ్రేల ముల్లోకములు జూచి లోలోన
నానందపడు నోరులేని యోగి
తల్లిదండ్రుల తనూ వల్లరీద్వయికి వ
న్నియ బెట్టు తొమ్మిది నెలల పంట
అమృతంబు విషమను వ్యత్యాసమెఱుగకా
స్వాదింప జను వెఱ్ఱి బాగులాడు
అనుభవించుకొలంది, నినుమడించుచు మ
రందము జాలువాఱు చైతన్య ఫలము
భాషరాదు, వట్టి పాలు మాత్రమె త్రాగు
నిద్రవోవు, లేచి నిలువలేడు
యెవరెఱుంగరితని దేదేశమో కాని
మొన్న మొన్న నిలకు మొలచినాడు.”

శిశువు అమాయకత్వాన్ని అత్యంత సహజంగా ప్రతిబింబించటంతోబాటు శిశువు జీవితం ఎలా ఉండాలో నిర్దేశించిన ప్రజాకవి శ్రీశ్రీ. చిన్న పిల్లలను గురించిన గీతాలకు “శైశవగీతి” మకుటాయమానంగా ఉంది:

“మీదే మీదే సమస్త విశ్వం!
మీరే లోకపు భాగ్యవిధాతలు!
మీ హాసంలో మెరుగులు తీరును
వచ్చే నాళ్ల విభాప్రభాతములు”

అన్నప్పుడు చిన్న పిల్లల జీవితం ఎలా రూపుదిద్దుకోవాలో తన మహదాశయం ద్వారా వ్యక్తం చేశాడు కవి.

జీవితం పూలబాట కాదు. జీవించే కాలంలో నైరాశ్యం, ఆవేదన, దుఃఖం, అపజయాలు అధైర్యం కలగజేస్తాయి. ఈ జీవన సమరంలోని దుర్భర క్షణాలను కవులు నానా విధాలుగా చిత్రించి చూపారు. “దుఃఖానికీ దుఃఖానికీ మధ్య ఆనందం ఉందేమో” అనుకొనే కవి (ఆర్వీయస్. సుందరం) “జీవించాలి కదా, జీవించటం కోసమైనా జీవించాలి కదా” అనుకుంటాడు. “రైల్లో నుంచి ఎంతమంది దిగిపోతున్నా ప్రయాణం





కొనసాగించాలి కదా, సుఖానికీ దుఃఖానికీ మధ్య దూరం అంతంత మాత్రమేనా” అని ప్రశ్నిస్తాడు. “జీవించటం ఎలాగూ తప్పదు, జీవించినంత కాలం దుఃఖానందం అనుభవిద్దాం” అనుకోవటం వల్ల జీవించటం సుగమమవుతుందేమో!

‘చేదుపాట’ పాడిన శ్రీశ్రీ ఇలా అంటాడు:

“లేదు సుఖం, లేదు సుఖం,
లేదు సుఖం జగత్తులో!
బ్రదుకు వృథా! చదువు వృథా!
కవిత వృథా! వృథా! వృథా!”

బోదిలేర్ మనిషి తన జీవితంలో చవిచూచే వేదనని అనేక కవితల్లో ప్రతిధ్వనించాడు. కొందరు ఈ లోకంలో తప్ప ఎక్కడైనా సుఖం ఉంటుందనుకుంటారు. “ఈ జగత్తు ఒక ఆస్పత్రి. ఇక్కడి రోగులందరూ తమ పడకల్ని మార్చాలని ఆశపడ్తారు. ఒక రోగి కుంపటి దగ్గరికి వెళ్తే మంచిదనుకుంటాడు. మరొకడు కిటికీ దగ్గరికి వెళ్తే రోగం నయమవుతుందనుకుంటాడు. నేను ఎక్కడ ఉండనో ఆ చోటు సుఖప్రదమని నాకు అనిపిస్తుంది.”

బోదిలేర్ కొన్ని కవితల్లో జీవితం దుఃఖమయమని ఆక్రోశిస్తాడు. నిరాశావాదాన్ని నూరిపోస్తాడు. “అంతా దుఃఖమయం. కాలం ప్రాణాన్ని తోడేస్తుంది. కళ్ళకు కనిపించని ఆ శత్రువు మన బ్రదుకులోని మైనాన్ని కరిగించి రక్తమంతా ఇంకి పోయేట్లు చేస్తుంది”అని కాలం మనిషితో ఎలా ఆడుకుంటుందో వివరిస్తాడు.

ఈ కవులకు జీవితంలో దుఃఖం తప్ప మరేమీ కనిపించదా అనిపిస్తుంది. సందర్భాన్ని బట్టి దుఃఖం మనిషి జీవితాన్ని ఆవరిస్తుందన్నది నిజం. కాని జీవితమంతా దుఃఖమయమేనా? రెండు సుఖాల మధ్య దుఃఖం ఉంటుందా, రెండు దుఃఖాల మధ్య సుఖం ఉంటుందా? దీన్ని అర్థం చేసుకోవటం కోసమే కవులు, తత్త్వవేత్తలు తమ ఊహల్ని ఆలోచనల్ని ధారపోశారు.

శోక సముద్రంలో ప్రేయసి మునిగి ఉన్నప్పుడే తన ప్రేమ పొంగి పొర్లుతుందని చెప్తాడు బోదిలేర్. “నువ్వు అచ్చమైన బంగారంలా ఉంటే నాకేమిటి? అందచందాలతో ఉండు, అయితే దుఃఖిస్తూ ఉండు. బయలు ప్రదేశంలో నది అందంగా ఉన్నట్లు, నీ ముఖంలో కన్నీరు; జోరువాన పూలకు అందాన్నిస్తుంది. నీ ముఖం నుంచి సుఖం మాయమైనప్పుడు నా ప్రేమ పొంగి పొర్లుతుంది. నీ హృదయానికి దిక్కు తెలీనప్పుడు,

నీ వర్తమానానికి భూతమనే మబ్బు కమ్మినప్పుడు, నీ విశాలమైన కళ్ళు రక్తం లాంటి వెచ్చని కన్నీరుతో నిండినప్పుడు.

చనిపోయేటప్పుడు గురకలాగా నీ శోకం వెలువడినప్పుడు నా కనిపిస్తుంది – ఆహా ఎంత సమ్మోహనపరిచే ఆడది అని. ఆహా, ఎలాంటి ప్రేమగీతం నీది! నీ హృదయంలో వెక్కిళ్ళు, కన్నీటి ముత్యాల ద్వారా నీ హృదయం ప్రజ్వలిస్తుంది.”

జీవితాన్ని గురించి, భవిష్యత్తును గురించి ఎంతో ఆశావాదంతో ముందుకు నడిపించబూనుకున్న శ్రీశ్రీలాంటి కవులు కూడా సమయం వచ్చినప్పుడు ఈ జీవితం ఎందుకూ పనికిరానిదని నిరాశ వ్యక్తం చేస్తారు:

“మనమంతా బానిసలం,
గానుగలం, పీనుగలం!
వెనుక దగా, ముందు దగా,
కుడి యెడమల దగా, దగా!

మనదీ ఒక బ్రదుకేనా?
కుక్కల వలె నక్కలవలె!
మనదీ ఒక బ్రదుకేనా?
సందులలో పందులవలె.”

అయితే అంతలోనే ఈ ప్రపంచంలో మనిషి కర్తవ్యం జ్ఞాపకం వస్తుంది కవికి. అందులోనూ శ్రీశ్రీ లాంటి అభ్యుదయ కవి నిరాశనే ధ్యేయంగా చేసుకోలేడు.

శోకంతో నిండి ఉన్న జీవితంలో కూడా ఎక్కడో ఆశారేఖ తొంగి చూస్తుందనే భావన లేకుంటే జీవితం నిస్సారమవుతుంది. పద్యాలు రాసే కాలంలో కూడా శ్రీశ్రీ జీవితంలో భవిష్యత్తుపై ఆశ కలిగి ఉండాలనే విషయాన్ని ప్రతిపాదిస్తూనే వచ్చాడు. ‘శోకదేవి’ని వర్ణించే తరుణంలో కవి ఇలా అంటాడు:

“తొలగు నన్నియు ఒక్కతుది అరపులోన
నీరమ్ము, హరిణమ్ము, నీవు నేనును కూడ,
అలసముల్ ప్రాకు నీడలు మన మీద!
కలలెరుంగని, అమోఘ మగాధమైన
ఒంటరి నిద్రలో నురలును బ్రదుకు.





నిష్ఠురాహత హృదీ! నీకేడ్వ నికనేల?
బేల కనులార! మీకేల అశ్రువులు మీ
బాధా రహస్య గహ్వరము లందుండి
ఆనంద మిక మీద!! వాన విధాన
గతియించి మగిడి రాగలుగరు మీరు.”

ఏది ఏమైనా శ్రీశ్రీ ప్రయోగించదలచుకుంది “జయభేరి”ని. ప్రపంచం మనకే మిచ్చిందన్న విషయాన్ని తెలుసుకొని ప్రపంచానికి మనమేం ఇవ్వాలన్న దాన్ని గురించి ఆలోచించాలని కవి ప్రబోధిస్తున్నాడు:

“నేను సైతం
ప్రపంచాగ్నికి
సమిధ నొక్కటి ఆహుతిచ్చాను!
నేను సైతం
విశ్వ వృష్టికి
అశ్రు వొక్కటి ధార పోశాను!”

అంటూ చివరికి –

“నేను సైతం
భువన భవనపు
బావుటానై పైకి లేస్తాను!”

అనటంలో కవి ఆశావాదం తేటతెల్లమవుతోంది.

‘నూతిలో గొంతుకలు’ ఎంత విషాదంగా ధ్వనిస్తాయో కావ్యాత్మతో దర్శించిన కవి బైరాగి. నిరాశను, నిస్సహాయకతను కావ్యాత్మకంగా ప్రదర్శించటంలో దిట్ట అనిపించుకున్న బైరాగి ‘ఆగమగీతి’ని కూడా పాఠకుల ముందుంచారు.

“ఒంటరిగా సాగిపోవాలి ముందుకు
ఇప్పుడు కాదు, ఎప్పుడైనా
ఇక్కడ కాదు, ఎక్కడైనా
ఒకటి మాత్రం జ్ఞాపకముంచుకో నీవు
ఒంటరిగా సాగిపోవాలి ముందుకు.
ఈ నీడలు నీకు తోడు రావు.

ఒంటరిగా సాగిపోవాలి ముందుకు"

ఆధునికానంతర కవిత్వంలో మాత్రమే ఒంటరితనాన్ని గురించి, పరాయితనం గురించి ఉందనుకోవటం పొరబాటే. బైరాగి జీవితంలోని ఎన్నెన్నో కోణాలను అత్యంత గాఢంగా ప్రతిబింబింపజేశారు.

"నింగికి నేలకు నడుమ మోయరాని జీవిత భారముంది" అని భావించిన బైరాగి జీవితానికి మన మీద జాలి లేదని పలవిస్తారు:

"జీవితానికి జాలి లేదు
అవును, మరణం కన్న కూడ జాలి లేదు.
ఒంటరి నరుని మేధ ఇరవొంది చీకటి చెరలోన
గాలి లేదు జీవితానికి జాలిలేదు."

కవిత్వం ఎంత గొప్పగా మనిషి జీవితాన్ని విశ్లేషించాలని, వివరించాలని ప్రయత్నించినా అది విఫలం చెందుతుందనే చెప్పాలి. ఎందుకంటే జీవితంలోని వైవిధ్యాన్ని, వైరుధ్యాల్ని కవిత్వం పూర్తిగా ప్రతిబింబిస్తుందని చెప్పటానికి వీలుకాదు. బైరాగి చెప్పినట్లు–

"కవితలోన లేదు ఘనత
విశ్వమహాకావ్యాలన్ని వేదనతో విలపించే
పసివాని అశ్రుబిందువు పాటి చేయవు."

అయితే కవుల ఊహల వైశాల్యాన్ని తక్కువ అంచనా వెయ్యలేం. ఏ కవి అయినా ఏదో ఒక సమయంలో జీవన యాత్రను గురించి ఆలోచించక తప్పదు. ప్రాచీన కాలం నుంచి నేటి వరకు కవులు జీవన దర్శనాన్ని అక్షర బద్ధం చేశారు. జీవితాన్ని నిర్వచించటానికి కవులు ఎన్నో రకాలుగా ప్రయత్నించారు. పోలికల్ని వాడుకున్నారు.

"జీవితం ఒక మహాసముద్రం కావచ్చు
కానీ ఆశ అనే నావతో దాన్ని
ఈదెయ్యొచ్చు"

అన్న శేషేంద్ర శర్మగారి మాట ఏ మనిషిలోనైనా ఆశను రేకెత్తిస్తుంది, ఉత్తేజాన్నిస్తుంది.

కాని మనిషి ఆశ ఏ విధంగా ఉండాలో ఎలా ఉండాలో ఎవరికి వారే నిర్ణయించుకోవాలి. లేదంటే ఆ ప్రయాణం దుఃఖమయమవుతుంది. ఆశ అనేది ఒక





నావ కావచ్చు, కాని ఆ నావకు చిల్లులుండకూడదు కదా?

ప్రముఖ కన్నడ కవి గోపాలకృష్ణ అడిగ 'ఇదు బాళు' (ఇది బ్రదుకు) అనే కవితలో ఇలా అంటారు:

"ఆశ అనే అడుగు భాగం చీలిన నావలో
దూర తీరయానం!
ఎవరి లీలకోసమో ఎవరో ఎందుకో గురి
లేకుండా వదిలిన బాణం!
ఇది బ్రదుకురా బాబూ, ఇది తెలుసనుకున్నవాడు
తెలిసిన వాడు అయిన ధీరుడే లేదు.....
సగం వెలుతురులో ఈ బ్రదుకంతా దిమ్మ తిరిగి
ఎందుకో ఒక్క వెలుగు వెలిగి
చివరికి కరిగిపోతాం మరణతీరాన
ఘనతిమిరంతో కలిసి."

ఎవరికి వారు అభ్యుదయాన్ని సాధించాలి కాని ఎవరో వస్తారని, తోడుంటారని ఆశించకూడదు. గోపాలకృష్ణ అడిగ 'నినగె నీనే' (నీకు నువ్వే) అనే కవితలో ఇలా అంటారు:

"నీకు నువ్వే, మిత్రమా, నీకు నువ్వే!
వాళ్ళ వీళ్ళ నమ్మకాల ఇసుక దిబ్బల మీద
జీవన గృహాన్ని మబ్బుల ఎత్తుకు లేపుతావా?
నీకు నువ్వే, మిత్రమా, నీకు నువ్వే!"

ఎవర్నో నమ్ముకొని మనం జీవితం సాగించటం కుదరదు. లోకం మనల్ని హర్షిస్తుందనుకోవటం పొరబాటు. మనం అభ్యున్నతిని సాధించినప్పుడు లోకం మౌనంగా ఉంటుంది లేదా ఆశ్చర్యం వ్యక్తం చేస్తుంది. కాని మనం పతనం అవుతున్నా అదే మౌనం, అదే నిర్దాక్షిణ్య చిత్తవృత్తి దీన్ని నాలుగు పంక్తుల్లో శ్రీశ్రీ అద్భుతంగా వ్యక్తం చేశాడు:

"నిప్పులు చిమ్ముకుంటూ
నింగికి నేనెగిసి పోతే
నిబిడాశ్చర్యంతో వీరు

నెత్తురు కక్కుకుంటూ నేలకు నే రాలిపోతే
నిర్దాక్షిణ్యంగా వీరే."

మనిషిగా పుట్టిన ప్రతివాడూ మనిషిలాగే మెలగాలి. అలా చేసినప్పుడే ఈ జీవితాలు సుఖమయంగా సాగుతాయి. నిస్సహాయుడైన మానవుడు దీనికోసం ఏ దేవుడో కనికరించాలని ఆశిస్తాడు. బాలగంగాధర తిలక్ చేసిన 'ప్రార్థన' తెలుగు కవితా ప్రియులందరికీ సుపరిచితమే:

"మమ్మల్ని కనికరించు
చావు పుట్టుకల మధ్య సందేహం లాంటి
జీవితంలో నలువైపులా అంధకారం
మంచి గంధంలాగా పరిమళించే మానవత్వం
మాకున్న ఒకే ఒక అలంకారం
మజిలీ మజిలీకి అలసిపోతున్నాం
మలుపు మలుపుకీ రాలిపోతున్నాం
ఆశల వెచ్చని పాన్పుమీద స్వప్నాల పుష్పాలు జల్లుకొని
ఆదమరచి కాసేపు విశ్రమించటాని కనుమతించు తండ్రీ!"

నలువైపులా అంధకారం అలముకొని ఉన్నా మానవత్వమనే అలంకారం మాత్రం మంచిగంధంలా పరిమళించాలి. ఆశల వెచ్చని పాన్పుమీద విశ్రమించటం కంటె బయటి ప్రపంచంలోని వాస్తవాన్ని పరికించటం ఉత్తమం. డేవీస్ అనే ఇంగ్లీషు కవి రచనని 'చెరువు' అనే పేరుతో శ్రీశ్రీ అనువదించాడు. అందులో ఇలా ఉంది:

"ముకురమున నన్ను నేను చూచుకొనునపుడు
నా ప్రసక్తిగా కన్యము నాకు లేదు
చెరువులో మాత్రమేను చూచితినయేని
వింతలెన్నెన్ని కాని కన్పించు నాకు
ముకురమున కానబడు నాకు మూర్ఖుడొకడు
చెరువులో జ్ఞాని కానిపించెడిని నాకు."

దీన్నే మరో విధంగా చెప్పారు శేషేంద్ర:

"అద్దంలో చూస్తే నువ్వు కనిపిస్తావు
కిటికీలో చూస్తే ప్రజలు కనిపిస్తారు."





కిటికీ లోంచి చూస్తే బయటి ప్రపంచం ఎలా కనిపిస్తుందో కవులు ఎన్నో రకాలుగా ఊహిస్తారు. కిటికీ బయటి ప్రపంచాన్ని మనకు పరిచయం చేసే అమూల్య అవకాశం. తిలక్ దీన్ని ఎంతో గంభీరంగా ఉపయోగించుకున్నారు.

"కిటికీ తెరిస్తే
గాలీ వెలుతురుతో పాటు
జాలి జీవితపు ధూళీ జ్ఞానమధూళీ కూడా వస్తాయి
తెరిచే కిటికీని బట్టి
పరతెంచే పుష్పరాగం వుంటుంది
గదికీ మదికీ కూడా గవాక్షాలుంటాయి."

అయితే దీన్ని విషాదంతో ముగించిన తిలక్ కిటికీలోంచి చూచి "జనం ఆశా నిరాశల వంతెనల మీద నుంచి దిగుతున్న" విషయాన్ని గమనించారు. చివరికి ఆ కవి ఇలా అంటారు:

"కిటికీ తెరిస్తే
ఏపుగా పెరిగిన చెట్టు మీద ఎర్రని పువ్వొకటి విరిసి
ఎండలో మెరుస్తూ ఇదే నిజం ఇదే నిజం అని నవ్వుతూ
అంతలో రాలిపోయింది
వింతగా స్మృతిలో మాత్రం మిగిలింది."

ఎవరెన్ని రకాలుగా ఊహించినా దుఃఖాన్ని పారద్రోలాలంటే చిరుదరహాసమైనా ముఖంలో వెలగాల్సిందే. మనిషిని జంతువులనుంచి వేరు చేసేది నవ్వే. నవ్వుల్లో కొన్ని వందల రకాలున్నాయి. అయితే స్వచ్ఛమైన, అమాయకమైన నవ్వు ఎప్పటికీ అభిలషణీయమే. జాషువ అభిప్రాయం ఎవరికైనా ఆమోదయోగ్యమే:

"నవ్వవు జంతువుల్, నరుడు నవ్వును, నవ్వులు చిత్తవృత్తికిన్
దివ్వెలు, కొన్ని నవ్వులెటు తేలవు, కొన్ని విషప్రయుక్తముల్,
పువ్వులువోలె ప్రేమరసమున్ వెలిగ్రక్కు విశుద్ధమైనవే
నవ్వులు, సర్వదుఃఖ శమనంబులు, వ్యాధులకున్ మహౌషధుల్!"

# దార్శనికుల దృక్పథాలు

భారతదేశంలో ప్రజల మనస్తత్వాన్ని లోతైన ఆలోచనలకు గురిచేయటంలో దార్శనికుల దృక్పథాలు వహించిన పాత్ర గొప్పది. షడ్దర్శనాలనే పేరుతో ముఖ్యమైన దర్శనాలను కొందరు పట్టీ చేసినా అవి ఏవి అనే విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. నిజానికి భారతీయ దర్శనాలు 'ఆరు' సంఖ్యకే పరిమితం కావు. ప్రపంచంలో తాత్త్విక చింతన అత్యంత గంభీరంగా కొనసాగిన దేశాలలో భారతదేశం అగ్రస్థానంలో ఉంది. మానవుడు, సమాజం, ప్రకృతి, మానవాతీత శక్తులు, మానవత్వం, శాంతి, సహనం, శీలం, జీవన విధానం మొదలైన అసంఖ్యాక విషయాలను గురించి దార్శనికులు తమ దృక్పథాన్ని వెలిబుచ్చారు. వీటిలోంచి మనకు, మన సమాజానికి, నేటి ప్రపంచానికి ఉపయోగపడే ఆలోచనల్ని స్వీకరించటంలోనే మన విజ్ఞత ఇమిడి ఉంటుంది.

## చార్వాకదర్శనం

భారతీయ దర్శనాలలో భౌతిక ప్రపంచాన్ని గూర్చిన ఆలోచనలు చోటు చేసుకోవటం విశేషం. వేదకాలం తర్వాత మొదట పరిశీలించదగింది చార్వాక దర్శనమే. ఇది ఎప్పుడు ప్రారంభమయిందో చెప్పటానికి ఆధారాలు లేవు. మహాభారతంలోనే చార్వాకుని ప్రసక్తి ఉండటం వల్ల మిగిలిన అన్ని దర్శనాలకంటె ఇదే మొదటిదనిపిస్తుంది. దీన్ని బృహస్పతి ప్రతిపాదించాడని, దీనికి లోకాయతమనేది మరో పేరని ప్రతీతి. ఇంద్రుడి స్నేహితుడయిన బృహస్పతి నాస్తికులను జయించటానికి సహాయపడ్డాడని ఋగ్వేదంలోనే ఉంది (8-96-15). అంటే ఋగ్వేదకాలానికే నాస్తికవాదం ఉందని అర్థమవుతుంది. బుద్ధుడు చదివిన శాస్త్రాలలో బార్హస్పత్యం కూడా ఉందని లలిత విస్తరంలో ఉంది. వీటి వల్ల భారతదేశంలో భౌతికవాదం ఎంత ప్రాచీనమైందో తెలుస్తుంది.

చార్వాకుడనే పేరు ఎలా వచ్చిందో స్పష్టంగా తెలియటం లేదు. ఈ సిద్ధాంతాన్ని తన గురువుద్వారా విన్న మొదటి శిష్యుడి పేరని కొందరంటారు (సర్వ దర్శన సంగ్రహం,





పు.99). 'చక్కగా మాట్లాడేవాడు' అనే అర్థం ఒప్పుకోదగిందిగా ఉంది. కార్యకారణ సంబంధాన్ని పట్టించుకోకుండా, ఈ జగత్తులో జరిగే అన్ని సంఘటనలూ ఆకస్మికమని భావించటమే చార్వాకమని సామాన్యంగా భావించటం జరుగుతోంది. జరిగే అన్ని సంఘటనలకూ మానవాతీత శక్తులే కారణమనటం ఎంత తర్కరహితమో, అన్ని సంఘటనలూ ఆకస్మికమే అనటమూ అనాలోచితమనాలి.

ఒక విషయం మనం గమనించాలి. ఆస్తిక మతాలు కాని, నాస్తిక మతాలు కాని మనిషికి, మానవత్వానికి సంబంధించిన ఏదైనా ఉంటే దాన్ని స్వీకరించేట్లు ఉండాలి. ఎప్పుడూ మన మనసును స్వచ్ఛంగా, సావకాశంగా ఉంచుకోవాలి. కాని మన తాత్త్విక దృక్పథాల చరిత్రను గమనిస్తే చార్వాకం, లోకాయతం అనే పదాలను హీనమైనవిగా భావించటం కనిపిస్తుంది. నాస్తికులంటేనే అంటరానివారు అనే అర్థాన్ని కల్పించటం జరుగుతోంది.

అయితే నాస్తిక దృక్పథాన్ని ప్రపంచించినవాడు బృహస్పతి అనే అభిప్రాయం వ్యక్తమవుతుండడంవల్ల చార్వాక దర్శనం తెలివితో కూడుకున్నదనే భావన కూడా ఉందనిపిస్తుంది. మైత్రీ ఉపనిషత్తులో బృహస్పతిని నాస్తిక గురువుగా పేర్కొనటం గమనించదగింది. చార్వాక దర్శనం గురించి మనకు తెలుస్తున్న విషయాలన్నీ ఇతర దర్శనాలలో ఉన్న ఖండనలే. ఇతరులు ఖండించిన దానిని బట్టి ఒక దర్శనంలోని గుణాత్మక అంశాలను పరిశీలించాలంటే కష్టమైన పనే. సర్వదర్శన సంగ్రహంలో ఈ దర్శనాన్ని గురించిన అధ్యాయం ఒకటుంది. కాని అది చాలా సంక్షిప్తంగా ఉండటం వల్ల నాస్తిక దర్శన స్వరూపం బోధపడదు. తర్కాన్ని ఒక ప్రమాణంగా చార్వాకులు అంగీకరించరనేది సామాన్యమైన అభిప్రాయం. కాని ఇది సమంజసంగా అనిపించటం లేదు. దేవుని అస్తిత్వానికి సంబంధించి ఆస్తిక దర్శనాలు చూపించే ప్రమాణాలు, తర్కం చాలవనే చార్వాకుల అభిప్రాయమై ఉంటుంది. సర్వదర్శన సంగ్రహంలో ఉన్న అభిప్రాయాలను చూస్తే చార్వాకులు వేద ప్రామాణ్యాన్ని, పురోహిత వృత్తిని ఖండించినట్లుగా తెలుస్తోంది.

చార్వాకుల మతంగా చెప్పుకొనే మాటలు ఈ క్రింది విధంగా ఉంటాయి:

"జీవితం నీది కాబట్టి సంతోషంగా జీవించు
అన్వేషించే మరణ నేత్రం నుంచి ఎవ్వరూ తప్పించుకోలేరు.
ఈ కట్టె ఎప్పుడైతే కాలిపోతుందో
అది మళ్ళీ వెనక్కి రావటం ఎక్కడుంది?"

ఇదే అభిప్రాయం ఎంతోమంది ఊహల్లో ఉన్నా దాన్ని వాళ్ళు ఒప్పుకోరు. ఒప్పుకోలేరు. "ఉన్నంతవరకు హాయిగా ఉండు" అనే మాటలు ఎవరికి మాత్రం రుచించవు?

చార్వాకుల మాటలుగా చలామణీ అవుతున్న వాటిని తర్వాత డార్విన్ లాంటి వికాసతత్త్వవేత్తలు నిరూపించటం ఆశ్చర్యం కలిగిస్తుంది. భూమిలాంటి భౌతిక పదార్థాలు దేహంగా మారి బుద్ధిశక్తిని సంపాదించుకొని జీవిగా మారుతుందని చార్వాకుల మతం. దీనికి బృహదారణ్యకోపనిషత్తు నుంచే చార్వాకులు వాక్యాలను ఉదాహరించి ఉపపత్తులుగా వాడుకుంటారు. "ఈ భౌతిక పదార్థాల నుంచి జ్ఞానం ఉద్భవిస్తుంది, ఆ పదార్థాలతో బాటే అదీ నశిస్తుంది. మరణం తర్వాత బుద్ధి శక్తి అనేది ఉండదు" అంటుంది బృహదారణ్యకోపనిషత్తు (2-4,12).

భవిష్యత్తులో సుఖమనే దాన్నే ఆశించక పోతే యజ్ఞయాగాదులను ఎందుకు చెయ్యాలని ప్రశ్నిస్తారు చార్వాకులు. ఎంతో ధనం వ్యయం చేసి, ప్రయాసతో అగ్ని కార్యాలను నిర్వర్తించే వారు ఏ ఆశా లేకుండానే వాటిని చేస్తారా అని ప్రశ్నిస్తారు వీళ్ళు. జ్ఞాన కాండను త్రోసి రాజని కర్మకాండను ప్రోత్సహించే వారిని నమ్మకూడదని చార్వాకుల వాదం.

"అగ్ని సూత్రం, మూడు వేదాలు, మూడు రకాల అగ్నులు
ఒంటికి బూది పులుముకోవటం
ఇవన్నీ బతకటానికి నేర్చిన మార్గాలని
మగతనం, బుద్ధిలేనివారి పనులని
బృహస్పతి వచిస్తాడు"
అని బృహస్పతి పరంగా చెప్పటం జరిగింది.

ఇలాంటివన్నీ చార్వాకుల అభిప్రాయాలే అని నిర్ధారణ చెయ్యటానికి ఆధారాలు లేవు. ఇవన్నీ చార్వాకులంటే గిట్టని వాళ్ళు వ్రాసినవే కాని చార్వాకులే రచించినవి కావు.

ఆధునిక విజ్ఞానం ప్రకారం ప్రత్యక్ష ప్రమాణమే వాస్తవం. అది సత్యమా కాదా అన్నది నిరంతర ప్రయోగాలవల్ల తెలిసివస్తుంది. కాని ఒక్కొక్కసారి అనుమాన ప్రమాణమూ అవసరమే అనిపిస్తుంది. అయితే అనుమాన ప్రమాణం వాస్తవం కాదు. అది వాస్తవమా కాదా అని తెలుసుకోవాలంటే మరొకొంత శోధన అవసరం. చార్వాకులు





ప్రత్యక్ష ప్రమాణాన్ని మాత్రమే అంగీకరిస్తారు. ఒక వేళ ఏదైనా విషయంలో సందేహం కలిగితే ప్రత్యక్ష అంశాల ఆధారంతో దాన్ని పరిహరించుకోవాలి కాని గుడ్డిగా నమ్మకూడదు. ఏదైనా విషయాన్ని తెలుసుకోవటంలో పరిమితులుంటాయి. ఆ పరిమితుల్ని అధిగమించి తర్క బద్ధంగా విశ్వంలో ఉండే క్రమబద్ధతను నిరూపించటానికి చార్వాకులు ప్రయత్నించారా లేదా అనే విషయం ఉన్న ఆధారాలను బట్టి తేలదు.

పంచభూతాలు పృథ్వి, అప్, తేజసు, వాయువు, ఆకాశం. వీటిలో మొదటి నాలుగు ఇంద్రియానుభవానికి అందుతాయి. చివరిదైన ఆకాశం అనుమాన ప్రమాణం వల్ల మాత్రమే తెలుస్తుంది. అందువల్ల చార్వాకుల మొదటి నాలుగు మాత్రం నిజమని చెప్తూ చివరిదైన ఆకాశాన్ని నిరాకరిస్తారు.

చార్వాకులు తాత్త్విక దృక్పథంలో ముఖ్యంగా గమనించదగింది ఆత్మను గురించిన అభిప్రాయం. ప్రజ్ఞ అనేది దేహంతోబాటే ఉంటూ దేహం నుంచి వేరుగా దాన్ని చూడటానికి వీలు కాదు. మనస్సు జడ వస్తువుకున్న ఒక విశేషంగా చార్వాకులు భావిస్తారు. ఆత్మ అస్తిత్వాన్ని నిరూపించటం అసాధ్యం. దేహం, ఆత్మ వేరు వేరని చూపించటం ఎవరివల్లా కాదు. అయితే తెలివిగా వాదించటానికి ఎన్నో మార్గాలున్నాయి. ప్రజ్ఞ అన్నది దేహ లక్షణమైతే మూర్ఛ వచ్చినప్పుడు, సుషుప్తిలో ప్రజ్ఞ లేకున్నా దేహం ఉంటుంది. అందువల్ల ప్రజ్ఞ అన్నది పూర్తిగా దేహానికి సంబంధించిందని చెప్పటానికి వీల్లేదని వాదిస్తారు. ప్రజ్ఞ దేహంతోనే ఉంటుందని భావించినా దేహం లేనప్పుడు ప్రజ్ఞ ఉంటుందా లేదా అన్న దాన్ని నిర్ధారణ చేసి చెప్పటానికి వీలులేదు. వీటిని గురించి వాదిస్తూపోతే దానికి అంతూ పొంతూ ఉండదు.

మొత్తానికి చార్వాక వాదం మానవాతీత వస్తువుల్లో నమ్మకం లేదనే విషయాన్ని స్పష్టం చేస్తుంది. మరణం తర్వాత అస్తిత్వాన్ని ఈ వాదం అంగీకరించదు. మరణానంతర జీవితాన్ని గురించిన నమ్మకమే మానవ మానస వికాసంలో ముఖ్యమైందగా కనిపిస్తుంది. కాని చార్వాక వాదం దీన్ని ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోదు. మానవుని మనస్సును ఇంద్రియ సంబంధమైన జీవితం వైపుకు మళ్ళించటమే ఈ వాదం ముఖ్యోద్దేశం. అంతుపట్టని ఆత్మశోధన వల్ల ఏమీ ప్రయోజనం లేదని చార్వాకుల అభిప్రాయం. చతుర్విధ పురుషార్థాలలో అర్థకామాలు మాత్రమే సత్యమని చార్వాకులు నమ్ముతారు. సద్గుణాలు లౌకికమైన సాధన వల్ల లభిస్తాయి కాని మానవాతీత శక్తుల సహకారం వల్ల కాదని వీరి అభిప్రాయం. సుఖ దుఃఖాలన్నవి మన జీవితంలో సహజలక్షణాలు.

అవి మన జీవితంలో అనివార్య భాగాలే కాని ఏదో కర్మవల్ల సిద్ధించినవి కావు. "పొట్టు ఉందని గింజను ఎవ్వరూ పారెయ్యరు" (సర్వ దర్శన సంగ్రహం). జీవితం ఉన్నంతవరకు సుఖంగా ఉండాలన్నది చార్వాకుల అభిమతం (యావజ్జీవేత్ సుఖం జీవేత్). చార్వాక సిద్ధాంతం భారతీయ తాత్త్విక దృక్పథాలను చాలావరకు నిరాకరిస్తుంది. భారతీయ తాత్త్విక ఆలోచనలు కూడా పనికట్టుకొని చార్వాక సిద్ధాంతాన్ని విరోధించటానికి పూనుకున్నాయి. ఈ వైరుధ్యం ఆనాటి నుంచి ఈనాటి వరకు సాగుతూనే ఉంది.

## బౌద్ధ దర్శనం

బౌద్ధిక వికాసంతో కాలదేశాలమీద సమాజంమీద ఒక వ్యక్తి ఎంత ప్రభావం చూపించగలడనే విషయానికి నిదర్శనం బుద్ధుడు. ఈ మహనీయుడు ఏ గ్రంథాన్నీ రచించిన దాఖలాలు లేవు. ఆయన ఉపదేశాల ద్వారానే బౌద్ధ దర్శన స్వరూపం కొంతవరకు బోధపడుతుంది. ఆ ఉపదేశాలు కూడా బుద్ధుని నిర్వాణం తర్వాత ఎంతో కాలానికి వెలుగుచూశాయి. వెలుగు చూచిన ఆ కథల్లో కూడా నిజమెంత అనేది సందేహాస్పదమే. బుద్ధుని మరణానంతరం పురాణుడనే శిష్యుడు రాజ గృహానికి వచ్చాడట. అప్పటికే బుద్ధుని ఇతర శిష్యులు సూత్ర సంచయాన్ని సిద్ధం చేసి ఉంచారు. కాని పురాణుడు వాటిని ఒప్పుకోకుండా బుద్ధుని ద్వారా నేరుగా తాను విన్న వాటినే ఆచరిస్తానని చెప్పాడట. ఈ కథవల్ల బుద్ధుని మరణానంతరం అతని శిష్యులలో కలిగిన భేదాభిప్రాయాలు తెలిసి వస్తున్నాయి. ఏ మహనీయుడు ప్రపంచానికి అందించిన సందేశమైనా ఇలాగే అభిప్రాయ భేదాలకు ఆస్పదమవుతుందని చెప్పక తప్పదు.

ప్రాచీన కాలానికి చెందిన బౌద్ధ దర్శనాన్ని సూత్రబద్ధ బౌద్ధమని, పాలీ బౌద్ధమని, థేరవాదమని పిలుస్తుంటారు. దీన్ని స్థాపించిన వాడు గోతమ లేక గౌతమ వంశానికి చెందిన సిద్ధార్థుడు. జాగృతిని పొందిన గౌతముడు బుద్ధుడై జీవన వాస్తవాలను ప్రపంచానికి తెలియజేశాడు. మానవ సముదాయాన్ని పట్టి పీడించే వేదనను ఎలా పోగొట్టాలనే చింత గౌతముణ్ణి బుద్ధుడిగా మార్చింది.

కపిలవస్తులోగాని అక్కడికి సమీపంలోగాని జన్మించిన గౌతముడు భౌతిక సుఖాలను త్యజించి, రాచరికాన్ని నిరాకరించి తపోధనుడు కావటం భారతీయ తాత్త్విక వికాస పథంలో గొప్ప మలుపు. ఉగ్రమైన తపస్సువల్ల ప్రయోజనం లేక పోగా ఆత్మజ్ఞాన బోధకమైన మార్గాన్ని అవలంబించి చివరికి దుఃఖ స్వరూపం, దాన్ని నివారించే మార్గాలు,





మానవాళి అభ్యుదయానికి కావలసిన ఆలోచనా విధానం తెలుసుకున్నాడు. మానవత్వమే పరమావధిగా ఆ మహనీయుడు చేసిన ఆలోచనలు ఫలించటంవల్ల గౌతమ బుద్ధుడు అవతరించాడు.

ప్రాచీన బౌద్ధ దర్శనాన్ని గురించి తెలిపే విషయాలు పాలీ భాషలో ఉన్నాయి. చాలావరకు సంభాషణల రూపంలో ఉండే ఈ రచనలన్నీ క్రమబద్ధంగా ఉన్నాయని చెప్పటానికి వీలులేదు. వీటిలో ముఖ్యమైంది త్రిపిటకం. దీనిలో మూడురకాల సూత్రాలున్నాయి: సుత్త పిటకం (బుద్ధుని ఉపదేశాలు), వినయ పిటకం (నీతి సంహితలు), అభిదమ్మ పిటకం (తాత్త్విక చర్చలు). వీటివల్ల బౌద్ధ దర్శనం గురించిన అనేక విషయాలను అర్థం చేసుకోవటానికి వీలవుతోంది.

బుద్ధుని ఉపదేశాలను, తాత్త్విక చింతన సారాంశాన్ని పరిశీలిస్తే కొన్ని విషయాలు స్పష్టమవుతాయి. 'సర్వం దుఃఖమయం జగత్' అన్నదాన్ని గుర్తించటం ఇందులో చాలా ముఖ్యం. సంసారం వల్ల కలిగే దుఃఖం వాస్తవం. దాని నుంచి తప్పించుకోవటమే మన ధ్యేయం కావాలి. అంతా దుఃఖమయమని చెప్పటం వల్ల బౌద్ధం కేవలం నిరాశావాదమని కొట్టిపారెయ్యాలా అనే ప్రశ్న ఉదయిస్తుంది. ఇహలోకంలోనో పరలోకంలోనో సుఖం దొరుకుతుందనే ఆశను కలిగించకుండా బ్రతుకులోని చీకటి కోణాన్నే చెప్తున్న బౌద్ధం నిరాశావాదమే కదా అని వాదించవచ్చు. కాని బుద్ధుని ఆలోచనలు కేవలం దుఃఖాన్ని ఎత్తి చూపేవి కాకుండా ఆ దుఃఖ నివారణకు సూచనలు కూడా చూపేవిగా ఉంటాయి.

బౌద్ధం ఊహలమీద ఆధారపడింది కాదు. కర్మకాండలకు ఈ దర్శనం పూర్తిగా విరుద్ధం. ప్రత్యక్ష ప్రమాణాన్ని తర్కాన్ని బుద్ధుడు గౌరవించాడు. బుద్ధుని ఆలోచనలు హేతువాదానికి మార్గదర్శకాలయ్యాయని చెప్పవచ్చు.

బుద్ధుడు తనకు తెలిసిందంతా చెప్పాలని కోరుకోలేదు. ప్రయోజనం లేని విషయాలను విస్తరించటం వల్ల లాభం లేదని బుద్ధుని నమ్మకం. దుఃఖాన్ని దుర్మార్గాన్ని నివారించటానికి మార్గాలను తెలియజెప్పటం తప్పితే అనవసరమైన వాద ప్రతివాదనలతో ప్రయోజనం లేదని బుద్ధుడు భావించాడు.

బుద్ధుని అభిప్రాయాలను గమనిస్తే 'ఆత్మ' అన్నది అనవసరమైన ఊహ అనిపిస్తుంది. ప్రజ్ఞాగోచరమైన స్థితిని అంగీకరించగలం కాని మనస్సును కాదని బుద్ధుడు భావించినట్లుంది. ఉపనిషత్తులు దేనినైతే అంతిమం కాదని భావించాయో అదే

వాస్తవమని బుద్ధుడు ప్రతిపాదించాడు. కన్ను మొదలైన ఇంద్రియాల లక్షణాలను తెలుసుకోవటానికి సాధనాలున్నాయి. కాని ఇంద్రియాతీతమైన వస్తువును తెలుసుకోవటానికికాని, నిరూపించటానికి కాని సాధనాలు లేవు.

బౌద్ధ దర్శనం ద్వారా తెలుసుకోవలసిన నైరాత్మ్య వాదాన్ని వివరించే కథలు ఉన్నాయి. బౌద్ధ సాధువు నాగసేనుల మధ్య జరిగిన సంభాషణే ఈ కథ. మిలిందుడు (మీనాండర్) నాగసేనుడి దగ్గరికి వస్తాడు. ఆ సమయానికి నాగసేనుడు నైరాత్మ్యవాదం గురించి చెప్తుంటాడు. మిలిందుడు దాన్ని అంగీకరించడు.

"మహారాజా నీవు ఎలా వచ్చావు? నడిచి వచ్చావా?

రథంలోనా" అన్నాడు నాగసేనుడు.

"నేను రథంలో వచ్చాను"

"రథంలో వస్తే దాన్ని వర్ణించు. దాని స్తంభాలు రథమా? చక్రాలు రథమా?"

రథంలో ఏ భాగమూ రథం కాదని మిలిందునికి అర్థమయింది. ఒకానొక రీతిలో అన్ని భాగాలను కలిపితే రథం వస్తుందని అది ఒక సంకేతం మాత్రమే అని తెలిసింది. నాగసేనుడన్నాడు: "అలాగే కొన్ని భౌతికాంశాలూ మానసికాంశాలూ కలిసిన దాన్ని 'ఆత్మ' అంటున్నాం. ఏ వస్తువూ దాని భాగాలకంటె వేరుగా ఉండదు."

కాలాన్ని గురించి బౌద్ధం ప్రతిపాదించిన విషయాలు మన జీవితాన్ని రూపొందించుకోవటానికి చాలా ఉపయోగపడతాయి. జీవితంలోని ముఖ్య సమస్య అయిన దుఃఖాన్ని నివారించుకోవటానికి మార్గాన్ని తెలుసుకోవటమే గౌతముణ్ణి బుద్ధుడిగా మార్చింది. "అది ఉండటం వల్ల ఇది అవుతుంది. అది ఉద్భవించటం వల్ల ఇది ఉద్భవిస్తుంది." అంటే పరస్పర సంబంధం వల్లనే ఏదైనా ఉత్పన్నమవుతుంది. కొన్ని పరిస్థితుల వల్లనే ఫలితం లభిస్తుంది. అంతర్గతమైన ఆగంతుక కారణ నియమాలు సిద్ధార్థుని ఆలోచనల్లో రూపుదాల్చటమే బుద్ధుడు అవతరించటానికి కారణం. అంటే దుఃఖం సహజమైన, నిర్ణయించదగిన నియమం ప్రకారమే కలుగుతుందని భావం.

క్షణ క్షణమూ మారిపోతుంటుందన్నది వాస్తవం. బౌద్ధ దర్శనాన్ని ఇతర తాత్త్విక రచనలు క్షణికవాదమని పిలుస్తుంటాయి. వస్తువులు అశాశ్వతమని మారుతుంటాయని బుద్ధుడు అభిప్రాయ పడ్డాడు. అయితే ఇలా మారిపోతూ ఉంటే వస్తువుల్ని గుర్తించటం ఎలాగ? ఒక్కొక్క క్షణమూ గడుస్తుంటే మార్పు సంభవిస్తుందని భావించేట్లయితే ఆ వస్తువులలో పోలికల్ని ఏ విధంగా వివరించాలన్నది ప్రశ్న. అయితే ఇలా పోలికలున్నాయని





భావించటం తప్పని బౌద్ధం వల్ల తెలుస్తోంది. మరో రకమైన విమర్శ ఉంది. ప్రతి క్షణం మార్పు సంభవిస్తూ ఉంటే స్మృతి అనే వాస్తవాంశాన్ని వివరించటం ఎలా అనే ప్రశ్న ఉదయిస్తుంది. అయితే దీనికి కూడా బౌద్ధంలో ప్రత్యుత్తరం ఉంది. అనుభవంలోని ప్రతి క్షణమూ ఉదయించి లయమవుతూ తర్వాతి అనుభవంలో కలిసిపోతుంది. అందువల్ల ప్రతి క్షణంలోనూ దాని వెనకటి క్షణాల సమస్త అంతశ్శక్తులూ దాగి ఉంటాయి. వీటినే జాతక కథలు చాలా వరకు నిరూపిస్తాయి. దేవదత్త సుత్తలో యముడు ఇలా అంటాడు: "ఈ పాపకర్మల్ని చేసింది మరెవరో కాదు. నీవే వాటిల్ని చేశావు. వాటి ఫలాన్ని అనుభవించేదీ నీవే." మొత్తం మీద బౌద్ధం వస్తువు ఒకటే అనే అర్థంలో ఏకత్వాన్ని నిరాకరిస్తుంది. అయితే దానికి బదులుగా నిరంతరత్వాన్ని అంగీకరిస్తుంది.

ప్రాచీన బౌద్ధంలో ఉండే అస్పష్టత కారణంగా అనంతరకాలంలో దాన్ని అనుసరించిన వారిలో విభేదాలు తలెత్తాయి. బౌద్ధ దర్శనం భారతదేశంలోనే కాక ఇతర దేశాలలోనూ వ్యాప్తి చెందింది. భారతదేశంలోనే పద్దెనిమిది శాఖలు ఏర్పడ్డాయి. వీటిని సామాన్యంగా హీనయానం, సర్వాస్తిత్వ వాద మంటారు. వ్యక్తి సంసార బంధం నుండి విముక్తి చెందటానికి హీనయానం మార్గాలను సూచిస్తుంది. జాగృతి పొందిన వ్యక్తి విశ్రాంతి చెందకుండా జగత్తులో ఆధ్యాత్మిక యోగ క్షేమం కోసం శ్రమిస్తూనే ఉండాలంటుంది మహాయానం. బుద్ధుని బోధనల సమగ్ర సత్యాన్ని తమ పంథా నిరూపిస్తుందని మహాయానానికి చెందినవారు భావిస్తారు.

చార్వాకులు అనుమాన ప్రమాణాన్ని అంగీకరించరు. అయితే ఎందుకు అంగీకరించలేదో తెలుసుకోవటానికి ఆధారాలు లేవు. అయితే బౌద్ధ దర్శనం అనుమాన ప్రమాణాన్ని అంగీకరించక పోవటానికి కారణాలను చెప్తుంది. తార్కికుల వాదాలన్నిటినీ బౌద్ధులు అంగీకరించకపోయినా చార్వాకులలాగా అనుమాన ప్రమాణాన్ని పూర్తిగా త్రోసి రాజనాలని కూడా చెప్పరు. మనం ఎప్పటికీ సందేహిస్తూనే ఉండటానికి వీలులేదు. ఒక వేళ సందేహం వల్ల మన ఆలోచనల్లో వైరుధ్యం కనిపించినా, వ్యావహారికంగా అది అసంబద్ధమైనా సందేహాన్ని వదిలెయ్యాలి.

బౌద్ధానికి సంబంధించిన అన్ని శాఖలను గూర్చి ఇక్కడ చర్చించటం సాధ్యపడదు. బౌద్ధ దర్శనంలోని ముఖ్యమైన భాగం మాధ్యమిక శాఖ. ఇది బుద్ధుని ఉపదేశాలలో ముఖ్యమైన ఫలమంటారు. జ్ఞానాన్ని గురించి నవీనమైన చర్చలు ఈ శాఖలో కనిపిస్తాయి. విప్లవాత్మకమైన అభిప్రాయాలు మాధ్యమికులలో కనిపిస్తాయి. జ్ఞానం ప్రామాణికమైనదనే

అభిప్రాయాన్ని వీరు ప్రశ్నిస్తారు. జ్ఞానం వల్లనే మనం సత్యాన్ని సమీపిస్తామని సామాన్యంగా మనం భావిస్తాం. అయితే ఇలా అన్వేషణ సాగిస్తూ పోతే ఎన్నో వైరుధ్యాలు ఎదురవుతాయి. "వస్తువుల్ని గురించి ఆలోచించిన వెంటనే అవి కరిగిపోతాయి" (యథాయథార్థ శ్చింత్యంతే విశీర్యంతే తథాతథా – సర్వదర్శన సంగ్రహం). ఏదో ఒక వస్తువు ఉందనుకుందాం. ఆ వస్తువు స్వరూపం ఏమిటి? ఆ వస్తువులోని అణువణువూ ఆ వస్తువా లేక అవన్నీ కలిసినది వస్తువా? అణువులే వస్తువయితే వాటికి ఆ వస్తువు స్వరూపం లేదు. ఆ వస్తువు అణువులకు అతీతమైనదైతే దాన్ని తయారు చెయ్యాల్సిన అవసరం లేదు. లౌకిక జీవనంలో జ్ఞానం అవసరమయినా అంతవరకే అది ప్రామాణికమైంది కావచ్చు లేక కాకపోనూ వచ్చు. కాని దానికి ఆధ్యాత్మిక మహిమను ఆపాదించటం సాధ్యంకాదు.

ఇలా ఏ వాస్తవాన్నీ నమ్మక పోవటం వల్లనే మాధ్యమిక వాదాన్ని శూన్యవాదమని కూడా పిలుస్తారు. "వస్తువును స్వయంభువు అని కాని, ఇతర వస్తువుల నుంచి పుట్టిందని కాని, రెండిటి వల్ల కలిగిందని కాని చెప్పటానికి వీలు లేదు" అంటాడు నాగార్జునుడు. కారణత్వ కల్పనే భ్రమ అని దీన్ని అర్థం చేసుకోవచ్చు. కారణరహితమైన దేనినీ బుద్ధుని సిద్ధాంతం అంగీకరించదు కాబట్టి విశ్వమే భ్రమతోకూడినదనవచ్చు. అనుభవమంతా భ్రమ ('అనుభవ ఏషమృషాః' అంటాడు నాగార్జునుడు).

ఈ తాత్త్విక చర్చల మాట ఎలా ఉన్నా బౌద్ధాన్ని గురించి ఆలోచించే వారికి మొదట అర్థమయేది "ఆత్మోద్ధారమే జీవిత ధ్యేయం" అన్న ఆశయం. బుద్ధుడు తనకు బుద్ధత్వం ప్రాప్తించినందుకు తృప్తి పడలేదు. దుఃఖితులైన వారందరికి ఎలా సహాయ పడాలా అని తపన చెందాడు. ఆత్మార్పణకు సిద్ధమయే ప్రేమ, అనాసక్త కర్మ మహాయానంలో ముఖ్య విషయాలు. నాగార్జునుడిని గురించి చెప్పేటప్పుడు ఆయన ముందు ఆనందమయ లోకంలో పుట్టి తర్వాత బుద్ధుని బోధనల్ని ప్రచారం చెయ్యటానికే అవతరించినట్లు నమ్ముతారు. దయ, త్యాగం, మానవసేవ మొదలైన సద్గుణాలను ప్రతిబింబిస్తూ నాగానందం లాంటి నాటకాలు వెలువడ్డాయి, బుద్ధ చరిత్రలాంటి కావ్యాలు రచితమయ్యాయి. ఉదాత్తునిగా, దయామయునిగా, మనుషుల దుఃఖనివారణ కోసం తపించిన మానవతావాదిగా బుద్ధుడు చిరస్మరణీయుడయ్యాడు. ఒక ఆదర్శమూర్తిగా భారత దేశంలోనే కాక ఇంకా అనేక దేశాలలో అసంఖ్యాక జనులకు స్ఫూర్తి దాయకుడయాడు.





# జైనం

ఇంచుమించుగా బౌద్ధ దర్శనంతో బాటే మొదలై ఈనాటికీ భారతదేశంలో కొన్ని ప్రాంతాలలో లక్షలాది ప్రజలు అనుసరిస్తున్న మతమిది. వైదిక మతాన్ని ప్రశ్నించిన చార్వాకులు, బౌద్ధులు, జైనులు ఈ దేశంలో ఎన్నో అవమానాలకు, హింసకు గురి అయ్యారు. అయినా సంఖ్యాబలం లేకున్నా ఈ దర్శనాలు తమ అస్తిత్వాన్ని కాపాడుకున్నాయి. భౌతికవాదం హేతువాదుల రూపంలో ఇంకా కొనసాగుతూనే ఉంది. బౌద్ధం డా. బాబాసాహెబ్ అంబేద్కర్ సూచనల వల్ల, దలైలామా వంటి బౌద్ధ గురువుల ప్రాబల్యం వల్ల అక్కడక్కడ తొంగిచూస్తూనే ఉంది. జైనం ఇప్పటికీ గుజరాత్, రాజస్థాన్, కర్నాటక లాంటి చోట్ల అనుయాయులతో కళకళలాడుతూ ఉంది.

'జిన' అంటే 'జయించినవాడు' అని అర్థం. జయించటమంటే రాజ్యాలను జయించటం కాదు, రాగద్వేషాలను జయించటం. నిజానికి జైనం బౌద్ధం కంటె ప్రాచీనమైంది. జైన తీర్థంకరులలో 24వ వాడు, చివరివాడు అయిన వర్ధమాన మహావీరుడు క్రీ.పూ. 540లో జన్మించాడంటారు. వర్ధమానుడికి పూర్వుడైన పార్శ్వనాథుడు క్రీ.పూ. 8వ శతాబ్దికి చెందినవాడని ప్రతీతి.

వేద ప్రామాణ్యాన్ని అంగీకరించకపోవటంలో జైనమతం బౌద్ధాన్ని పోలుతుంది. మానవుని దుఃఖాన్ని గురించి, పరమాత్మ అస్తిత్వాన్ని గురించి వ్యక్తం చేసిన అభిప్రాయాలూ బౌద్ధమతాన్ని పోలి ఉన్నాయి. అయితే ఆత్మ, భౌతిక వస్తువులు శాశ్వతమని భావించటంలో జైనం వైదిక మతాన్ని కూడా పోలుతుంది. అందువల్ల ఇది బౌద్ధానికి వైదిక మతానికి మధ్యమవర్గానికి చెందుతుందనే అభిప్రాయముంది.

వర్ధమాన మహావీరుడు అవతరించే కాలానికే జైనం బాగా వేళ్ళు పాతుకుంది. కాని అందులో ఎన్నో దోషాలు తలచూపాయి. మహావీరుడు ఎన్నో మార్పులు తీసుకువచ్చి జైనమతం సుదీర్ఘ కాలం నిలబడటానికి కారణమయ్యాడు.

24 మంది తీర్థంకరులవల్ల అందులోనూ తపోధనుడు, ఆధ్యాత్మిక వీరుడు అయిన వర్ధమాన మహావీరుని వల్ల ప్రచారం పొందిన జైనమతం భారతీయ ధార్మిక జీవనం, సాహిత్యం, సంస్కృతి, ఆచార సంప్రదాయాలు మొదలైన వాటిమీద చూపిన ప్రభావం అపారమైంది.

విశ్వమంతటినీ జైనులు జీవం, అజీవం అనే రెండు పదార్థాలుగా భావిస్తారు. వీటిని మనం చేతనాచేతనాలని అంటుంటాం. అచేతనాలలో భౌతిక వస్తువులతోబాటు

కాలదేశాలు కూడా చేరుతాయి. జీవం అన్నది భారతీయ తాత్త్విక చింతనలో భాగమైన ఆత్మ లేక పురుషునితో సమానమని సందేహం కలుగుతుంది. అయితే జైనుల జీవం ప్రాణ తత్త్వాన్ని సూచిస్తుంది కాని ఆత్మను సూచించదు. జీవం క్రియాశీలమైందని, ప్రతి స్పందన కలదని పరిపూర్ణత దాని ఆంతరిక స్వభావమని జైనుల అభిప్రాయం. జీవానికి ఉండే గ్రహణశక్తికి మధ్య కర్మ అడ్డు తగులుతుంది. విఘ్నాలన్నీ నాశమయినప్పుడు జ్ఞానం పరాకాష్ఠనందుకుంటుంది. సుదీర్ఘ తపస్సు ఫలితంగా మహావీరుడు ఇలాంటి జ్ఞానాన్నే పొందాడు.

తత్త్వ చింతనకు సంబంధించినంతవరకు జైన మతంలోని వాదాల లోతుల్లోకి పోకుండా దాని విశేష లక్షణాలను మాత్రం మనం గమనించవచ్చు. జైన మతం మునులకు మాత్రమే కాక సామాన్యులకు కూడా తీవ్రమైన సాధన మార్గాలను విధిస్తోంది. నీతి నియమాలను పాటించటంతోబాటు సరైన శ్రద్ధ కలిగి ఉండాలని (సమ్యక్ దర్శనం), సరైన జ్ఞానం కలిగి ఉండాలని (సమ్యక్ జ్ఞానం), సరైన నడవడిక కలిగి ఉండాలని (సమ్యక్ చారిత్ర్యం) ఈ మతం చెప్తూ వీటినే త్రిరత్నం (మూడు రత్నాలు) అంటోంది. శ్రద్ధ కలిగి శాస్త్రాలను అధ్యయనం చేసి, సంశయ స్వభావం వీడి, జ్ఞానం సంపాదించి, సత్యమని నమ్మినదాన్ని ఆచరించాలని జైన దర్శనం బోధిస్తుంది. ఈ సాధనలో పంచ వ్రతాలున్నాయి. అవి: 1. ఏ జీవినీ హింసించకుండా ఉండడం (అహింస), 2. అబద్ధాలు చెప్పకపోవడం (సత్యం), 3. దొంగతనం చేయకపోవడం (అస్తేయం), 4. బ్రహ్మ చర్యం, 5. త్యాగబుద్ధి కలిగి ఉండడం (అపరిగ్రహం).

అహింస పరమ ధర్మమని బౌద్ధం కూడా చెప్తుంది. కాని బౌద్ధులలో మాంసాహారులు కూడా ఉన్నారు. కాని జైనం మాంసాహారాన్ని కూడా పూర్తిగా నిషేధించింది. హింస అనేది కేవలం ప్రాణి హింసకు మాత్రమే వర్తించేది కాదు. మనస్సు, మాట, క్రియ ఈ మూడిట్లోనూ హింసను వదిలెయ్యటం. కేవలం హింసను వదిలెయ్యటం మాత్రమే జైన దర్శన బోధన సారాంశం కాదు. వ్యక్తి గతమైన శీల సంపాదనతోబాటు సామాజిక లక్ష్యాలను సాధించటం కూడా జైన దర్శనం కోరుకున్న వాటిలో ఉంది. జైనుల ప్రార్థనలో విషయాలను చూస్తే ఇది స్పష్టమవుతుంది: "రాజుకు జయమగుగాక!, రాజు ధర్మాత్ముడగు గాక!, సకాలంలో వానలు కురవాలి, కరువు కాటకాలుండకూడదు, జైనానుశాసనం జగత్తులోని అన్ని జీవులకూ సర్వ సుఖాలను అనుగ్రహించుగాక!"





జైనం ప్రకారం జీవిత ధ్యేయం కర్మవిముక్తులు కావటం. భారతీయ దర్శనాలలో జీవికి జన్మాంతరాలుంటాయని ఎక్కువగా నమ్మేది జైనమే అయితే కర్మ విషయంలో జైన దర్శనం భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తుంది. కర్మ అనేది భౌతికమైనది. 'ఇనుములో వేడిమి, పాలలో నీళ్ళు కలిసినట్లు కర్మ జీవంతో కలిసిపోతుంది' అంటుంది జైనం. సాధన ద్వారా సకల కర్మల క్షయాన్ని పొందితే జీవానికి సర్వజ్ఞత్వం సిద్ధించి ముక్తి లభిస్తుంది.

జైన దర్శనం నాస్తిక పంథాకు చెందిందా కాదా అనేది చర్చనీయాంశం. నిజానికి నాస్తిక పదానికి అర్థం పరమాత్మ అస్తిత్వాన్ని అంగీకరించకపోవటం. అంటే శాశ్వతమైన ఆత్మ అనేది లేదని భావించటం ఆ విధంగా చూస్తే చార్వాక మతమొక్కటే నాస్తికవాదం. కాని కొందరు వేద ప్రామాణ్యాన్ని అంగీకరించని వారంతా నాస్తికులే అని అభిప్రాయ పడతారు. సామాన్యంగా దేవుణ్ణి నమ్మనివారంతా నాస్తికులని అంటుంటారు. దైవం అనే దాన్ని వైదిక మతంలాగా నమ్మకున్నా దైవత్వాన్ని జైన దర్శనం అంగీకరిస్తుంది. అందువల్ల జైనులను నాస్తికులనటం కంటె బౌద్ధులలాగానే అవైదిక మతానికి చెందిన వారనటం మేలు.

ముఖ్యంగా జైన దర్శనం స్వచ్ఛతకు, సదాచారానికి, అహింసకు ప్రాధాన్యాన్నిచ్చింది. మాటలలో, చేతలలో స్వచ్ఛతకు మొదటి స్థానం ఇచ్చింది. నీతి శాస్త్రం వంటి మానవీయ పద్ధతులకే కాక గణిత శాస్త్రం లాంటి లౌకిక శాస్త్రాల అభ్యున్నతికి కూడా జైనమునులు ఎంతో కృషి చేశారు.

జైన దార్శనికుడైన సుకౌశలస్వామి కథలో వచ్చే ఈ ప్రాకృత గాథలు జైన ధర్మం బోధించే శీలాన్ని తెలియజేస్తాయి:

ఖమ్మామి సత్వజీవాణం సవ్వే జీవా ఖమంతుమే
మెత్తీ మే నవ్య భూదేసు వేరం మ జ్ఝణ కేణచి ॥
మ జ్ఝసహావం ణాణం దంసణ చరణం న కింపి ఆ వరణం
జో సంవేయణ గాహి సోహం ణాదా హవే ఆదా
భిజ్జ ఉ భిజ్జ ఉ జాఉ ఖఉ జో ఇయ ఏహు సరీరం
అప్పా భావహిణిమ్మల ఉ జేం పావహి భవతీరు ॥

అన్ని జీవులను నేను క్షమిస్తాను. అన్ని జీవులు నన్ను క్షమించుగాక! ప్రాణులన్నిటినీ నేను ప్రేమిస్తాను. దేనితోనూ నాకు వైరం లేదు. నా స్వభావం సమ్యక్ జ్ఞానం, సమ్యక్

దర్శనం, సమ్యక్ చారిత్ర్యంతో కూడింది. నాకు ఏ కర్మ లేపమూ లేదు. సంవేదన కలిగిన వాడెవడో వాడినే నేను ఆత్మజ్ఞాతృ (తెలిసినవాడు). ఈ శరీరాన్ని కత్తిరించినా, ముక్కలు చేసినా, చీల్చినా, ఇది నాశమయినా, ఓ యోగీ, దేనివలన ఈ భవబంధాల ఆవలి తీరానికి చేరుతానో ఆ నిర్మలమైన ఆత్మను ధ్యానం చెయ్యి.

## న్యాయం – వైశేషికం

గౌతముని న్యాయ సూత్రాలు, కణాదుని వైశేషిక సూత్రాలు భారతీయ తాత్త్విక చింతన పథంలో విశేషమైన స్థానాన్ని ఆక్రమిస్తున్నాయి. ఈ రెండు దర్శనాలను కలిపి చెప్పటం అలవాటు. 'న్యాయం' అనే పదాన్ని 'వాదం' అని అర్థం చేసుకుంటాం. తర్కశాస్త్రానికి సంబంధించిన ప్రశ్నలకు దీనిలో సమాధానం చెప్పటానికి ప్రయత్నించడం కనిపిస్తుంది. బౌద్ధికమైన, విశ్లేషణాత్మకమైన విధానంగా దీన్ని గుర్తిస్తారు. దీన్ని హేతువిద్య అని, కారణశాస్త్రమని పిలవటం కూడా కనిపిస్తుంది. న్యాయం తర్కం ఒకటే అని భావించటం తప్పు.

వైశేషికమంటే విశేషమైంది. విశేషమంటే వ్యత్యాసం, విశ్వమూలం వైవిధ్యమేగాని ఏకత్వం కాదని ఈ దర్శనం చాటి చెప్తుంది. మొత్తానికి న్యాయ వైశేషికం అనేకాత్మక వాస్తవికతను తెలియజేస్తుంది. జ్ఞానం తనకంటె భిన్నమైన ఒక వస్తువును గురించి చెప్తుందని న్యాయ వైశేషికం ప్రతిపాదించింది. ఈ రెండు దర్శనాలు వివరించే ద్రవ్యాలన్నీ భౌతిక వస్తువులు కాదు. ఈ విషయంలో న్యాయ వైశేషికం చార్వాకానికి భిన్నంగా ఉంది. న్యాయ వైశేషికం ప్రకారం ద్రవ్యాలు తొమ్మిది: పృథ్వి, అప్, తేజస్, వాయువు, ఆకాశం, కాలం, దిక్, ఆత్మ, మనస్సు. శాశ్వతమైన ఆత్మను న్యాయ వైశేషికం అంగీకరిస్తుంది. జ్ఞానం ఆ ఆత్మ విశేషణాలలో ఒకటి. అది జీవితంలో అన్ని కార్యకలాపాలకూ మూలం. ఆత్మకు ఇంకా ఐదు విశేషణాలున్నాయి. అవి: రాగం, ద్వేషం, సుఖం, దుఃఖం, ప్రయత్నం. వీటిలో రాగద్వేషాలు మనసుఖ దుఃఖాలకు కారణమవుతాయి. ఒక వస్తువు మనకు కావాలనుకుంటే దాన్ని గురించి మనం తెలుసుకోవాలి. అది జ్ఞానం. తర్వాత అది కావాలనిపిస్తుంది. అది ఇచ్ఛ. దాన్ని తీర్చుకోవటానికి సంకల్పం అవసరం. ఇలా జ్ఞానానికి సంకల్పానికి మధ్య ఇచ్ఛ అనేది ఉంటుంది.





న్యాయ వైశేషికం ప్రకారం ఏదేది ఉందో దాన్నంతటినీ తెలుసుకోవటం సాధ్యమే. జ్ఞానానికి వెలుపల సత్యముంది అన్నదాన్ని ఒప్పుకుంటూనే దాన్ని తెలుసుకోవటం సాధ్యమే అంటుంది న్యాయ వైశేషికం. న్యాయవైశేషికాలను చాలావరకు కలిపే చెప్తున్నా కొన్ని విషయాలలో వాటి మధ్య వ్యత్యాసం కనిపిస్తుంది. శబ్ద ప్రమాణం విషయంలో ఈ భేదాన్ని గమనించవచ్చు. ఇతరులకు జ్ఞానాన్ని కలగజేయటంలో లేక మన అనుభవాన్ని వ్యక్తీకరించటంలో శబ్ద ప్రమాణం అమూల్య సాధనమని మనం సామాన్యంగా భావిస్తాం. బౌద్ధులు శబ్దం ప్రత్యేకమైన ప్రమాణం కాదంటారు. వాళ్ళు దాన్ని అనుమానంలో చేరుస్తారు. వైశేషికులకు భిన్నంగా న్యాయ దర్శనం శబ్దాన్ని ఒక స్వతంత్ర ప్రమాణమని అంగీకరిస్తుంది. అయితే మొత్తం మీద ఈ రెండు దర్శనాలు మనల్ని మనం ఉద్ధరించుకోవటానికి పొందాల్సిన జ్ఞానం ఎలా వస్తుందో సూచిస్తాయి. మనకు మంచి ఉపదేశం ఇవ్వగలిగిన సమర్థుడైన గురువు దగ్గర తత్త్వశాస్త్రాన్ని సాంప్రదాయిక పద్ధతిలో నేర్చుకోవాలి. దాన్ని గురించి ఆలోచన జరపాలి. దీనివల్ల మనకు శ్రుత జ్ఞానం లభిస్తుంది. తర్వాత ఆత్మనుగురించి ధ్యానించాలి. దీనివల్ల అజ్ఞానం నాశమవుతుంది. ఇలాంటి అనుభవం పొందినవాడు దేహత్యాగం తర్వాత జీవితంలో అంతిమ ధ్యేయాన్ని నెరవేర్చుకుంటాడు.

## సాంఖ్యం – యోగం

షడ్దర్శనాలలో ప్రాముఖ్యం సంతరించుకున్న మరో రెండు సాంఖ్య యోగాలు. భగవద్గీతను బట్టి చూస్తే ఒకానొక కాలంలో ఈ రెండు దర్శనాలు చాలా ప్రాచుర్యంలో ఉన్నట్లు కనిపిస్తుంది. ప్రస్తుతం సాంఖ్యం చాలావరకు మరుగున పడింది. యోగం మాత్రం యోగులనబడే వారి ప్రవచనాల దగ్గరినుంచి యోగమంటే వ్యాయామమనే భావన కలిగించేంత వరకు వివిధ రూపాలు ధరించి ఈనాటికీ ప్రచారంలో ఉంది.

సాంఖ్యం ఉపనిషత్తుల కాలం నుంచి ఉందని దాన్ని ప్రతిపాదించినవాడు కపిల మహర్షి అని చెప్తారు. పదహారో శతాబ్దిలో విజ్ఞాన భిక్షువు సాంఖ్య ప్రవచన భాష్యం రచించటంవల్ల ఆ కాలం వరకు కూడా సాంఖ్యం ప్రాచుర్యంలో ఉందని అర్థమవుతోంది. క్రీ.శ. ఐదవ శతాబ్దికి చెందిన సాంఖ్య కారికా ఆ దర్శనాన్ని గురించిన ప్రాచీన గ్రంథం అయినా సాంఖ్య యోగాలు ఉపనిషత్తుల కాలం నుంచి ఉన్నాయని, అవి రెండూ ఒకానొక కాలంలో ఒకటిగా ఉండి తర్వాత వేరుగా వికాసం చెందాయని అభిప్రాయాలున్నాయి.

సాంఖ్యంలో నిరీశ్వర సాంఖ్యం, సేశ్వర సాంఖ్యం అని రెండు భేదాలను గుర్తించటం జరిగింది. వాస్తవ దృష్టితో విశ్వం ప్రకృతి సిద్ధంగానే వికాసం చెందిందని భావించే సాంఖ్యం ఒక వర్గం తాత్త్వికుల ఆలోచనల నుంచి వెలువడింది. సాంఖ్యంలోని ఈ విశ్వ సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తూనే భగవంతుని అస్తిత్వాన్ని కూడా ప్రతిపాదించే ప్రయత్నం యోగంలో ఉంది.

సాంఖ్య కారికా 70 శ్లోకాల సంక్షిప్త రచన. దీన్ని సాంఖ్య సప్తతి అంటారు. ఇది భారతీయ శాస్త్ర సాహిత్యంలో నాయకమణి అని పేరు పొందింది. అద్వైత తత్త్వవేత్తలైన వాచస్పతి (9వ శతాబ్ది)లాంటి వారితో సహా చాలామంది సాంఖ్య కారికలకు వ్యాఖ్యానాలు రచించారు. పరమార్థడనే పండితుడు ఆరవ శతాబ్దిలో చైనాకు వెళ్ళి అక్కడే ఉండి సాంఖ్య కారికకు సువర్ణ సప్తతీ పేరుతో చీని అనువాదాన్ని వెలువరించాడు.

యోగ సూత్రాలను రచించిన పతంజలి మహర్షి క్రీ.శ. 5వ శతాబ్దికి చెందిన వాడంటారు. క్రీ.పూ. 2వ శతాబ్దిలో ఉండిన భాష్యకారుడు పతంజలి యోగ సూత్రాలను రచించాడనే అభిప్రాయం కూడా బలంగా ఉంది. యోగ సూత్రాలలో మనస్సు ఏకాగ్రత (సమాధి), దానికి మార్గం (సాధన), దానివల్ల లభించే శక్తులు (విభూతి), జీవన ధ్యేయమైన ఆత్మ సాక్షాత్కారం (కైవల్యం) అనే నాలుగు అధ్యాయాలున్నాయి.

న్యాయ వైశేషికం లాగానే సాంఖ్యయోగాలు కూడా పురుషుని అనేకత్వాన్ని అంగీకరిస్తున్నాయి. అయితే న్యాయ వైశేషికం భౌతిక జగత్తుకు మూలం అనేకమంటే సాంఖ్యయోగాలు ఆ మూలం ఒకటే అంటాయి.

బౌద్ధ దర్శనంలాగే సాంఖ్య యోగాలు కూడా మార్పు నిరంతరమని నమ్ముతాయి. ఎప్పుడైనా ప్రకృతి నిశ్చలమైతే దాని చలనానికి గల కారణాన్ని నిశ్చయించటం అసాధ్యం. చలన స్థితిలో గాని నిశ్చలంగాగాని ఉన్న వస్తువు వెలుపలి శక్తివల్ల ప్రభావితమవుతుందని లేదంటే ఉన్న స్థితిలోనే ఉంటుందని చెప్పిన న్యూటన్ సూత్రాన్ని పోలిన విషయాలు సాంఖ్యంలోనే ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. విశ్వ వికాసాన్ని గూర్చి సాంఖ్యంలో ఉండే కొన్ని విషయాలు ఈనాటి వైజ్ఞానిక దృక్పథానికి దగ్గరగా ఉంటాయి. శూన్యం నుంచి ఏ వస్తువూ పుట్టదు, ఏదేది ఇప్పుడు ఉందో అది ఎప్పుడూ ఉండనే ఉంది. అవ్యక్తరూపంలో మొదట ఉన్నదే వ్యక్తమయింది కాని కొత్తగా ఏదీ సృష్టికాలేదు. దేన్నీ సృష్టించటానికీ వీలుకాదు, నాశం చెయ్యటానికీ వీలుకాదు అనే వైజ్ఞానికుల దృష్టికి సాంఖ్యుల అభిప్రాయమూ దగ్గరగా ఉంది.





సాంఖ్యానికీ యోగానికీ ఒక విషయంలో భేదాన్ని గమనించవచ్చు. యోగం భగవంతుని అస్తిత్వాన్ని నమ్ముతుంది. సాంఖ్యంలో దేవుని ప్రసక్తి లేదు. అయితే భగవంతుని అస్తిత్వాన్ని తార్కికంగా స్థాపించటం అసాధ్యమని చెప్పటమే కపిలుని ఉద్దేశమని కొంతమంది భావిస్తుంటారు. అయితే సాంఖ్యాన్ని సేశ్వర వాదంగా మార్చటమన్నది తర్వాతి కాలంలో జరిగింది. సాంఖ్యంలో భగవంతునికి స్థానం కల్పించటానికి ప్రయత్నించిన వారిలో ముఖ్యుడు విజ్ఞాన భిక్షువు.

ఇప్పుడు మనకు లభిస్తున్న సాంఖ్య యోగాల స్వరూపాన్ని చూస్తే అవి అంగీకరించే ప్రమాణాలు ప్రత్యక్ష, అనుమాన, శబ్దాలని చెప్పవచ్చు. సాంఖ్యయోగాలు కర్మను, జన్మాంతరాలను నమ్ముతాయి. అయితే పునర్జన్మ పురుషునికి కాదు. ఎందుకంటే పురుషుడు సర్వవ్యాపి కావటంవల్ల పునర్జన్మకు అవకాశం లేదు. పన్నెండు ఇంద్రియాలు, బుద్ధి అహంకారం, పంచతన్మాత్రలతో కూడిన శరీరానికి మాత్రమే పునర్జన్మ, మోక్ష సమయంలో పురుషునికి ఈ సూక్ష్మ శరీరంనుంచి విడుదల లభిస్తుంది. పుట్టుక, చావు అనేవి స్థూల శరీరాన్ని మార్చుకోవటమే కాని సూక్ష్మ శరీరాన్ని కాదు. కైవల్యం ఇచ్చే ఆత్మానుభవాన్ని గురించి సాంఖ్యం చాలావరకు మౌనంగానే ఉంటుంది. యోగం ప్రకారం మోక్షానికి వైరాగ్యం, ధ్యానం మార్గాలు. యమనియమాదులతో కూడిన అష్టాంగ మార్గం యోగ సాధనకు ముఖ్యమైంది.

## పూర్వ మీమాంస

దర్శనాలనుగాని దార్శనికులనుగాని ఏదో ఒక సంఖ్యతో బంధించటానికి వీలుకాదు. దర్శనాలు ఆరే అని చెప్పలేము. ఆ ఆరు ఏవేవి అనే విషయంలోనూ భిన్నాభిప్రాయాలున్నాయి. అయినా బౌద్ధం, జైనం, న్యాయం, వైశేషికం, సాంఖ్యం, యోగం భారతీయ దర్శనాలలో ముఖ్యమైనవి. పరిశీలించదగ్గవి. బుద్ధుడు, వర్ధమాన మహావీరుడు, గౌతముడు, కణాదుడు, కపిలుడు, పతంజలి సాధకులుగా మహామునులుగా, సూత్రకారులుగా పేరు పొందారు. ఈ దార్శనికులు ప్రవచించిన తాత్త్విక ధోరణులు వారి నిశిత పరిశీలనకు, మానవ వికాసానికి మార్గాలను అన్వేషించటానికి చేసిన ప్రయత్నాలకు నిదర్శనంగా ఉన్నాయి.

పైన పేర్కొన్న ఆరు దర్శనాలు ఒక విధంగా వైదిక మతానికి, ఉపనిషదాదులకు ప్రత్యుత్తరంలా కనిపిస్తాయి. ఎన్నో విషయాలను తమకంటె ముందున్న తాత్త్విక ధోరణుల

నుంచి గ్రహించినా స్వతంత్రంగా విషయాలను ప్రతిపాదించే విధంగా ఈ దర్శనాలు ఉండడం వల్ల వాటిని ప్రత్యేకంగా పరిశీలించవలసి ఉంది.

వేద ప్రాముఖ్యాన్ని పూర్తిగా నిరాకరించే దర్శనాలు ఒక వైపు ఉండగా మరోవైపు వేద ప్రామాణ్యాన్ని పూర్తిగా అంగీకరించే దర్శనాలు కొన్ని ఉన్నాయి. పూర్వ మీమాంస అలాంటి దర్శనం. ఈ దర్శనం వేదాలకు విశిష్ట స్థానాన్నిచ్చింది. వేదాలలో ఉన్న సత్యాన్ని ఏ తాత్త్విక దృక్పథంతో విశ్లేషించాలో తెలిపేది మీమాంస. అంటే ఇదీ ఒక రకమైన తర్కమే. జైమిని, ఇతర మహర్షులు సూత్రీకరించిన నియమాలు వేదాలకు, ఇంకా అనేక తాత్త్విక గ్రంథాలకు అన్వయమవుతాయి. ధర్మశాస్త్రాల అర్థ నిర్ణయానికి మీమాంస ఉపయోగపడుతుంది.

మీమాంస వేద సూత్రాలకంటె ఎక్కువగా బ్రాహ్మణాలకు ప్రాధాన్యం ఇస్తుంది. వేద మంత్రాలకు ఉపనిషత్తులకు కాని కర్మ ప్రధానమైన బ్రాహ్మణులకు ప్రాధాన్యం ఇవ్వటం గమనించదగింది. ఉత్తర మీమాంస ఉపనిషత్తులను గురించి చెప్తే పూర్వమీమాంస యజ్ఞయాగాదులకు సంబంధించిన బ్రాహ్మణాలను గురించి చెప్తుంది. మోక్ష సాధనకు కర్మమార్గాన్ని సూచించటం పూర్వ మీమాంసలో కనిపిస్తుంది.

జైమిని ప్రవచించిన మీమాంసా సూత్రం క్రీ.శ. 2వ శతాబ్దిలో వెలువడిందని అంటారు. అయితే అంతకు ముందునుంచే ఇలాంటి ఆలోచనలు ఉన్నాయి. 2500 కంటె ఎక్కువ సూత్రాలున్న మీమాంసా సూత్రం పన్నెండు అధ్యాయాలు అరవై విభాగాలతో సూత్ర గ్రంథాలలోనే చాలా పెద్దది అని చెప్పవచ్చు. 5వ శతాబ్దిలో మీమాంసా సూత్రానికి శబర భాష్యం వెలువడింది. ప్రభాకరుడు (క్రీ.శ. 7వ శతాబ్ది) కుమారిలభట్టు (క్రీ.శ. 8వ శతాబ్ది) శబర భాష్యానికి వివరణ ఇచ్చారు. ఈ ఇద్దరి వివరణ ప్రకారం మీమాంస వాస్తవ వాదం. ఈ దర్శనంలో జ్ఞానమంతా సత్యమే. దాని ప్రామాణ్యం విషయంలో సందేహముంటేనే దానిని పరీక్షించాల్సిన అవసరం ఉంటుంది.

మీమాంసకులు అనేకత్వవాదులు. ఈ భౌతిక విశ్వమూలంలో వైవిధ్యముందని వారి వాదం. ఇవన్నీ ఎలా ఉన్నా సుఖ సంపాదన కోసం దుఃఖ నివారణకోసం ఏ మార్గాన్ని అనుసరించాలో స్పష్టంగా మీమాంస వివరించదు. వేద విధులను భక్తితో ఆచరించటమే ధ్యేయం. ధర్మాచరణే మీమాంస ధ్యేయం కాని మోక్షం కాదు. వీరు ధర్మార్థ కామాలను అంగీకరిస్తారు. అంతేకాని మోక్షాన్ని కాదు. మోక్షసాధనకు నిత్య కర్మలను ఆచరించటం, జ్ఞానం అవసరమని మీమాంస సూచిస్తుంది.





## ఉత్తర మీమాంస

ఉత్తర మీమాంసను వేదాంతమని పిలుస్తుంటారు. వేదాంతానికి సంబంధించిన దార్శనికులందరూ ఉపనిషత్తులే తమకు ఆధారమని చెప్తుంటారు. బాదరాయణుడు వేదాంత సూత్రం ద్వారా ఉపనిషత్తులలో ఉండేది అద్వైతమని నిరూపించటానికి ప్రయత్నించాడు. అయితే ఉపనిషత్తులలో సాంఖ్యాన్ని, ద్వైతాన్ని దర్శించినవారు కూడా లేకపోలేదు. మీమాంసకులు వేదాల సారమంతా బ్రాహ్మణాలలో ఉందంటారు. వేదాంతాన్ని బోధించినవారు ఏడుమంది ఉన్నట్లు బాదరాయణ సూత్రంలో ఉంది. ఒకవైపు వేదాలను గురించిన మీమాంస జరుగుతూ ఉంటే మరోవైపు వేదాంతాన్ని గూర్చిన గంభీరచర్చకూడా జరుగుతూ ఉండిందనిపిస్తుంది. వేదాలను గురించి తెలుసుకోవాలంటే మీమాంసా సూత్రాలను, వేదాంత సూత్రాలను, రెండిటినీ పఠించాల్సిందే.

శంకరాచార్యుని కంటే ముందే అద్వైతం ఉంది. అయితే దానికొక స్పష్టమైన వివరణ ఇచ్చినవాడు శంకరుడు. ఇందులో ముఖ్యంగా నిర్గుణ బ్రహ్మమే పరతత్వమనే కల్పన కనిపిస్తుంది. జీవం బ్రహ్మంలో ఐక్యం కావటమే మోక్షమనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. కర్మసన్యాసం వల్ల లభించే జ్ఞానమే మోక్షసాధనమని అద్వైతం ప్రతిపాదిస్తుంది.

భారతీయ వేదాంతానికి శంకరాచార్యుని సేవ అపూర్వమైంది. వేదాంతసూత్రానికే కాక ఉపనిషత్తులకు, భగవద్గీతకు శంకరుడు రచించిన భాష్యాలు అమూల్యమైనవి. జ్ఞాన స్వరూపాన్ని గూర్చి శంకరుడు ఇచ్చిన వివరణ సాంఖ్య యోగాలలో వివరణలాగే ఉంటుంది. జ్ఞానం వేరు, సాధన వేరు అయితే సాధన జ్ఞానాభివ్యక్తికి సహాయ పడుతుందని సాంఖ్యం చెప్తుంది. అయితే అద్వైతం ప్రకారం జ్ఞాన సాధన ఒకే మూలానికి చెందింది. జ్ఞానం పరోక్షంగా ఉండవచ్చు అపరోక్షంగా ఉండవచ్చు. పరోక్ష జ్ఞానం వల్ల వస్తువు 'అది' అని తెలుస్తుంది. అపరోక్ష జ్ఞానం వల్ల 'అది' అనేది 'ఏది' అని తెలుస్తుంది. పరమ సత్యం స్వరూపాన్ని నిరూపించటమే వేదాంతం ధ్యేయమని చెప్పవచ్చు. ప్రపంచ జ్ఞానంలో ఒదిగి ఉండే అనంతమైన 'చిత్' సత్యమనవచ్చు. లేదా అన్నట్లు ఉన్న అనంతమైన 'సత్' అనవచ్చు. 'తత్త్వమసి', 'అహంబ్రహ్మాస్మి' లాంటి వాక్యాలతో 'తత్' లేక బ్రహ్మమనేదాన్ని చెప్పేటప్పుడు పరమతత్త్వాన్ని సూచించటం జరిగింది.

ఉపనిషత్తులు బ్రహ్మాన్ని నిర్గుణమని అందువల్ల అది అనిర్వచనీయమని, అజ్ఞేయమని చెప్పటం వల్ల అది మాటలకందనిదని అర్థమవుతుంది. అలాగని నిర్గుణబ్రహ్మం శూన్యమనరాదని వేదాంతులంటారు. నిషేధంలో కూడా 'అస్తి' అనే అర్థం ఇమిడి ఉంటుందంటారు. 'నేతి నేతి' అనే మాటల వల్ల 'ఇది కాదు, అది కాదు' అని అర్థమవుతున్నా 'తత్త్వమసి', 'అహంబ్రహ్మాస్మి' అనటం వల్ల అస్తిత్వాన్ని కూడా అంగీకరించినట్లుంది.

వేదాంతాన్ని పరిశీలిస్తే ఇది కేవలం పరతత్వ చింతన మాత్రమేనా లేక సాటి మానవుని గురించి కాని, సుఖ సంతోషాలను గురించి కాని ఇదేమీ చెప్పదా అనే సందేహం కలుగుతుంది. అయితే అక్కడక్కడా సకల జీవులను గురించి ఎలాంటి భావన ఉండాలనే విషయం మీద వాక్యాలుండడం వల్ల అలాంటి వాటిని పరిశీలించాల్సిన అవసరం ఉంది. "సకల జీవులను తనలో, తనను సకల జీవులలో చూడగలగిన వాడు ఎవరినీ ద్వేషించడు'' లాంటి ఉపనిషద్వాక్యాలు మనిషి శీలసంపాదనను గురించినవి. "మేము మంచి మాటలనే వినాలి, మంచి విషయాలనే చూడాలి" లాంటివి కూడా ఉపనిషత్తుల ఉపదేశాల స్వరూపాన్ని తెలియజేస్తాయి. ఇలాంటి మంచి మాటలు ఎవరికైనా అనుసరణీయాలే.



# సుభాషితాలు

ఇప్పటివరకు మహాదార్శనికులు మానవుని ఆలోచనల్లో చెలరేగే కొన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పటానికి ఎలా ప్రయత్నించారో వివరించాను. దీనివల్ల ఎవరికైనా తృప్తి కలుగుతుందా అంటే అది సందేహమే. నాకైతే ఈ దర్శనాలవల్ల మనశ్శాంతి కలుగుతుందనిపించదు. ఈ దర్శనాలలోని వైవిధ్యం, సంక్లిష్టత, సంకీర్ణత మనం సుఖశాంతులతో జీవించటానికి ఉపయోగపడతాయా అన్నది సందేహమే. ఇతరుల దూషణలకు మాత్రమే గురి అయిన చార్వాకులు కేవల క్షణికానందం కోసం ప్రాకులాడే భోగ పురుషులుగా చిత్రీకరించటం కనిపిస్తుంది. వైరాగ్యానికి పరమావధిగా చెప్పుకొనే ఎంతోమంది స్వాములు నేటికీ అత్యంత భోగాన్వితమైన జీవితాన్నే గడపటం చూస్తే 'మెట్టవేదాంత' మనే దాని అర్థాన్ని వెతుక్కోవలసివస్తుంది. అలాంటి స్వాములు భోగాల మధ్య ఉంటూనే వాటికి అతీతంగా ఉంటారని కొందరు వ్యాఖ్యానిస్తూ ఉంటారు. వైరాగ్యం ఇలా కూడా ఉంటుందేమో అని ఆశ్చర్యం కలుగుతుంది.

ఇప్పటివరకు తొలిభాగంలో వస్త్వాశ్రయంగా కొన్ని విషయాలను వివరించాను. ఈ మలిభాగంలో నేనే నేరుగా ప్రవేశించి నా అనుభవాలను, అనుభావాలను పంచుకోదలచాను. నిజానికి నాకు ఏ గ్రంథం నుంచి కాని, మహనీయులనబడే వారి మాటలనుంచి కాని వాక్యాలను ఉద్ధరించి చెప్పటం ఇష్టముండదు. ప్రతి మనిషి తనకు తానుగా ఆలోచించగలగాలి. తన దారిని తానే అన్వేషించుకోగలగాలి. ఐతే ఒక్కొక్కసారి ఏదైనా విషయాన్ని విశదపరచాలనుకున్నప్పుడు కొన్ని మంచి వాక్యాలను మననం చేసుకోవటం సహజమే. అయితే ప్రతి ఆలోచనకూ ఇతరుల అభిప్రాయాల మీదనే ఆధారపడటం వల్ల మనలో ఆలోచనాశక్తి నశిస్తుంది. అయినా ఈ అధ్యాయంలో నా జీవితంలో అప్పుడప్పుడూ అనివార్యంగా నెమరు వేసుకొనే సుభాషితాలు జీవన విధానం మీద ఎలాంటి ప్రభావం చూపుతాయో తెలపటానికి ప్రయత్నిస్తాను.

నా జీవితంలో అడుగడుగునా ప్రభావం చూపిన రెండు పద్యాలున్నాయి. అందులో ఒకటి సుమతి శతకంలోది:

ఎప్పటి కెయ్యది ప్రస్తుత
మప్పటి కా మాటలాడి యన్యుల మనముల్
నొప్పింపక తానొవ్వక
తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ!

జీవితంలో లెక్కలేని సందర్భాలలో ఈ పద్యం నాకు ఉపయోగపడింది. ఎవరైనా ఇద్దరు కలిసి నప్పుడు, ఏదైనా సంస్థకు వెళ్ళినప్పుడు మూడో వ్యక్తిని గురించి మాట్లాడటం ఆ మాటలు దూషణ తిరస్కారాలవరకు వెళ్ళటం మామూలే. అలాంటి సందర్భాలలో సుమతి శతకంలోని పద్యం జ్ఞాపకం వస్తుంది. మన అలవాట్లను మలచుకోవటానికి, మంచి పద్ధతులను అలవరచుకోవటానికి సుభాషితాలు సహకరిస్తాయి.

అప్పుడప్పుడూ నేను తలచుకొనే మరో పద్యం వేమనది:

అనగననగ రాగమతిశయిల్లుచునుండు
తినగ తినగ వేము తియ్యనగును
సాధనమున పనులు సమకూరు ధరలోన
విశ్వదాభిరామ వినుర వేమ.

సాధన లేకుండా సంగీతం పట్టుపడదు. ఒక రాగాన్ని సాధన చెయ్యాలంటే ఒక్క గంటలోనో ఒక్క రోజులోనో సాధ్యం కాదు. సాధన చెయ్యగా చెయ్యగా రాగం అతిశయిస్తుంది. గుణాత్మకమైన రాగం అతిశయమవుతుందేమో కాని దానికి విరుద్ధమైనది ఏమవుతుందో అని సంశయం కలుగుతుంది. కాని వేమన తినగా తినగా వేముకూడా తీపిగా మారుతుందని చెప్తాడు. అంటే సాధనవల్ల మంచిని అతిశయింపజేయటమే కాదు, చెడ్డను కూడా మంచిగా మార్చవచ్చని చెప్తున్నాడు కవి. దీని సారమేమిటంటే సాధన వల్ల ఎలాంటి పనినైనా సాధించవచ్చని. దీనివల్ల ఎవరిలోనైనా ఆత్మ విశ్వాసం బలపడుతుంది.

"ఏ విధంగా రాసినా కూడా సమకాలం వారు మెచ్చరు" అని చేమకూర వేంకటకవి వాపోయాడు. ఇలాంటి పరిస్థితి చాలామంది కవులకు, రచయితలకు ఏర్పడుతుంది. కాళిదాసంతటి మహాకవి కూడా "పురాతనమైనదంతా సాధువని చెప్పటానికి వీలుకాదు. నవీనమైనదంతా అసాధువనీ చెప్పటానికి లేదు" అని తన్ను తాను సమర్థించుకున్నాడు.





అయితే భవభూతి మాత్రం ఇలాంటి మాటలకు సమాధానంగా మాలతీ మాధవంలో ఒక మాట అన్నాడు:

"కాలోహ్యయం నిరవధిః విపులాచ పృథ్వీ"

కాలం అవధిలేనిది, పృథ్వి విపులమైనది. గుర్తింపు రానంత మాత్రాన బాధ పడవలసిన అవసరం లేదు. ఏదో ఒక కాలంలో మన రచనల్ని ఆదరించే వారు దొరకక పోరు. ఈ భూమి విశాలమైనది. ఎక్కడో ఒక చోట మంచిని మెచ్చుకునే వారు ఉండనే ఉంటారు. మోసాలతో ఈర్ష్యాద్వేషాలతో నిండి ఉండే నేటి ప్రపంచంలో ఇలాంటి మాటలు ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తాయి.

మహాభారతం సూక్తులకు నిధి. నన్నయ భట్టు తనను గురించి చెప్పుకునేటప్పుడు 'నానారుచిరార్థ సూక్తినిధి' నన్నాడు. మనం అనుసరించాల్సిన జీవన విధానాన్ని గూర్చి మహాభారతంలో ఎన్నో చోట్ల హితోక్తులు కనిపిస్తాయి.

ఎఱుకగలవారి చరితలు
గఱచుచు సజ్జనుల గోష్ఠిఁ గదలక ధర్మం
బెఱుఁగుచు నెఱిఁగిన దానిని
మఱవ కనుష్ఠించునది సమంజస బుద్ధిన్.

జ్ఞానుల చరిత్రల్ని చదవటం చదివించటం మన సంప్రదాయంలో భాగం. అలా జ్ఞానులను గురించి తెలుసుకోవటంతోబాటు సజ్జనుల గోష్ఠివల్ల ప్రయోజనం పొందటం కూడా లాభదాయకమే. మంచి విషయాలను తెలుసుకోవటం, తెలుసుకున్న వాటిని మరువకుండా అనుసరించటం మంచిదని సమంజస బుద్ధిగలవారి మార్గాన్ని మహాభారతం తెలియజేస్తుంది. అలాగే మనం సభలలో మెలగవలసిన తీరు మాట్లాడే విధానం ఎలా ఉండాలో ఈ మహాకావ్యం బోధిస్తుంది.

మనమునకుఁ బ్రియంబును హిత
మును బథ్యముఁ దథ్యమును నమోఘము మధురం
బును బరిమితమునునగు పలు
కొన రంగ బలుకునది ధర్మయుతముగ సభలన్.

సభలో మాట్లాడేటప్పుడు అది మనస్సుకు ప్రియంగా ఉండాలి. హితంగా ఉండాలి, సరిగ్గా ఉండాలి, సత్యమై ఉండాలి, అమోఘంగా ఉండాలి, మధురంగా

ఉండాలి, పరిమితంగానూ ఉండాలి. మనం సభల్లో ఎలా మాట్లాడాలో ఇంతకంటె చక్కగా చెప్పటానికి వీలుకాదు.

ఇదే విషయాన్ని మనుస్మృతి మరోవిధంగా చెప్తుంది.

సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్
న బ్రూయాత్ సత్య మప్రియమ్
ప్రియంచ నానృతం బ్రూయాత్
ఏష ధర్మః సనాతనః

సత్యం చెప్పాలి. అయితే అది ప్రియంగా ఉండాలి. అప్రియమైన సత్యాన్ని చెప్పకూడదు. ప్రియంగా ఉన్నా కూడా అసత్యం పలకకూడదు. ఇదే ధర్మమని సనాతనులు చెప్తారు.

ఇతరులు మనకు హాని తలపెట్టినా మనం వారికి అపకారం తలపెట్టకూడదనేది నీతి. సుమతి శతకంలో పద్యం ఈ విషయాన్నే తేట తెలుగులో స్పష్టం చేస్తుంది.

ఉపకారికి నుపకారము
విపరీతము కాదు సేయ వివరింపంగా
నపకారికి నుపకారము
నెపమెన్నక సేయువాడె నేర్పరి సుమతీ

ఉపకారికి ఉపకారం చెయ్యటంలో గొప్ప ఏమీ లేదు. అపకారికి ఏమీ నెపం చెప్పకుండా ఉపకారం చేసేవాడే నిజమైన నేర్పరి.

మహా భారతంలోనే ఇలాంటి పద్యం ఉంది. ఇతరులు ఏదైనా అప్రియం చేసినా మనం అలాగే చెయ్యకుండా ఉండటమే ధర్మమంటుంది భారతం.

ఒరులేయవి యొనరించిన
నరవర! యప్రియము దన మనంబున కగుఁదా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమ ధర్మ పథముల కెల్లన్.

తెలుగులో సుమతి శతకం, వేమన పద్యాలు, భర్తృహరి సుభాషితాల అనువాదం, భాస్కర శతకం మొదలైనవి చిన్న పిల్లల దగ్గరినుంచి పెద్దల వరకు మార్గదర్శకాలయ్యాయి. సుభాషితాలు చెప్పే తీరు, మనసుకు హత్తుకొనే విధంగా మాటల పొందిక అనుసరించే విధంగా హితోక్తిని మలచే విధానం గమనించదగినవి. జీవితంలో ఎన్నో సందర్భాలలో





ఈ సుభాషితాలలోని మాటలు గుర్తుకు రావటమే కాదు మన స్వభావంలో మార్పులకు కారణమవుతాయి.

నిజమే, ఇవేవీ లేకుండా మన విజ్ఞత వల్లనే మనల్ని మనం తీర్చిదిద్దుకోగలిగితే మంచిదే. అయితే చీకటిలో ఉన్న వస్తువును చూడటానికి దీపం అవసరమయినట్లే ఒక్కోసారి మనల్ని మనం తెలుసుకోవటానికి, దిద్దుకోవటానికి మంచి మాటలు అవసరమవుతాయి.

వినదగు నెవ్వరు చెప్పిన
వినినంతనె వేగపడక వివరింపఁదగున్
గని కల్ల నిజముఁ దెలిసిన
మనుజుఁడెపో నీతిపరుడు మహిలో సుమతీ.

మంచి మాటలు వినిన వారందరూ మంచి వారై పోతారని ఆశించటానికీ వీలుకాదు. మనిషి ప్రవృత్తి ఒక్కొక్కసారి మారదు. 'పుట్టిననాడు పుట్టిన బుద్ధి పుడకలతో కాని పోదు' అని సామెత. మనం చేసే పనులను బట్టి మనల్ని మనమే తూచవలసి ఉంటుంది, కొలవవలసి ఉంటుంది. స్వార్థ రాహిత్యం, సామాజిక దృక్పథం అన్నవి అన్ని కాలాలలో అన్ని దేశాలలో ఉత్తమ గుణాలుగా కీర్తింపబడ్డాయి. సజ్జనులు తమ కార్యాన్ని కూడా త్యజించి పరుల కోసం పాటు పడతారు. మధ్యములైన వారు తమ కార్యాన్ని కొనసాగిస్తూనే పరుల హితాన్ని కూడా చూస్తారు. అధములు కేవలం తమ స్వార్థమే చూచుకుంటారు. ఏనుగు లక్ష్మణ కవి భర్తృహరి సుభాషితాన్ని ఇలా అనువదించాడు:

తమ కార్యంబు పరిత్యజించియు పరార్థ ప్రాపకుల్ సజ్జనుల్
తమ కార్యంబు ఘటించుచున్ పరహితార్థ వ్యాపృతుల్ మధ్యముల్
తమకై యన్యహితార్థ ఘాతుక జనుల్ దైత్యుల్, వృథాన్యార్థం భం
గము గావించెడువార లెవ్వరొ యెఱుంగన్ శక్యమే యేరికిన్?

భారతీయ సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, బౌద్ధిక క్షేత్రాలలో గుర్తుంచుకోవలసిన మేధావి చాణక్యుడు. రాజనీతి శాస్త్రాన్ని అర్థ శాస్త్రమనే పేరుతో రచిస్తూ అందులో సమాజానికి, మానవునికి సంబంధించిన అసంఖ్యాకమైన విషయాలను పొందుపరిచాడు చాణక్యుడు. అర్థశాస్త్రంతోబాటు నీతి సూత్రాలు, లఘుచాణక్యం, వృద్ధ చాణక్యం, చాణక్య సార సంగ్రహంలాంటివి కూడా చాణక్యుని రచనలు.

'చాణక్యనీతి దర్పణం' కూడా ఇలాంటి రచనల్లో ఒకటి. జీవితాన్ని అర్థం చేసుకోవటానికి ఈ రచనలోని అనేక శ్లోకాలు సహాయపడతాయి.

'చాణక్య నీతి దర్పణం' శ్రీ యల్లాప్రగడ ప్రభాకరరావు, శ్రీ పంగులూరి హనుమంతరావుగార్ల వల్ల తెలుగులోకి వచ్చింది (శ్రీ కౌండిన్య పబ్లికేషన్స్, 2013). "చాణక్యనీతి మాలికలు" అనే పేరుగల ఈ గ్రంథంలో మానవునికి, మానవుని జీవితానికి సందేశమిచ్చే ఎన్నో వాక్యాలున్నాయి. సామాజిక జీవనం, మానవ సంబంధాలు మొదలైన విషయాలను గురించి చాణక్యుని అమూల్యమైన అభిప్రాయుల పరిశీలించదగ్గవి.

ఈ లోకంలో నిజమైన బంధువు ఎలాంటి వాడో చెప్తూ చాణక్యుడు ఇలా అంటాడు

రోగమందు, దుఃఖమునందు, రోషమందు,
కరువు కాలాన, సభలందు, కాటియందు
వెంటనంటి వీడకయుండి వెన్నుతట్టు
వాడె నిజ బంధుడగు నిది వాస్తవమ్ము.

నిజమైన బంధువు సుఖ దుఃఖాలలో పాలు పంచుకోవాలి. శ్మశానం వరకు తోడుగా ఉన్నవాడే నిజమైన బంధువు.

ఇదే విధంగా మనిషి ఆశకు అంతంలేకుంటే ఏమవుతుంది అనే విషయాన్ని కూడా చాణక్యుడు ఇలా వివరించాడు:

ఉన్న దాని వదలుకొని కన్నదాని
పొంద నెంచిన; ఉన్నది, పొందనెంచి
నదియు రెండును వానికి అందకుండ
కనుమరుగగునను పలుకు కల్లగాదు.

నిశ్చయంగా దొరికే వాటిని వదలి దొరుకుతాయన్న నమ్మకం లేని వాటికోసం పాకులాడితే మొదటికే మోసం రావచ్చు. రెండూ అందకపోవచ్చు.

మనిషి విజయం సాధించే మార్గాలను గురించి, నిష్ఠతో పనిచేయటంవంటి విషయాలను కూడా చాణక్యుడు ప్రస్తావించాడు. "మనిషి తన ఇంద్రియాలను వశం చేసుకొని, దేశకాలాలను, తన శక్తిని దృష్టిలో ఉంచుకొని ఏకాగ్రతతో ఏ పని చేసినా విజయం తప్పదు. కొంగనుండి నేర్చుకోదగిన పాఠమిది". అతి సామాన్యమైన





ఉదాహరణల ద్వారా హితబోధ చేసే పద్ధతి చాణక్యునిలో ఉండటం విశేషం. "అలసటను లెక్కచేయకుండా బరువులు మోయటం, ఎండవానల ఊసెంచకపోవటం, ఎల్లప్పుడు తృప్తిగా ఉండటం అనే మూడు గుణాలను గాడిదనుంచి నేర్చుకోవాలి."

గాడిదను హీనంగా భావించే వారికి గాడిద నుంచి కూడా నేర్చుకోవలసింది ఉందని చాణక్యుడు సూచిస్తున్నాడు.

భారతీయుల జీవితంతో సుభాషితాలు పెనవేసుకు పోయాయి. ఎంత నాగరికులైనా ఏదో ఒక సందర్భంలో సామెతల్ని ఉదాహరించక తప్పదు. పది మాటలు మాట్లాడే బదులు ఒక్క సామెతను చెప్తే చాలు. అది మనసులో నాటుకుంటుంది. ఏదైనా విషయంలో మనం సందిగ్ధావస్థలో కొట్టు మిట్టాడుతున్నప్పుడు మన జ్ఞాపకాలలో నిలిచి ఉన్న సుభాషితాలు మార్గదర్శకాలుగా ఉంటాయి.

ఏదైనా విషయాన్ని స్పష్టం చెయ్యటానికి పోలిక అవసరమవుతుంది. ఉపనిషత్తుల కాలం నుంచి ఈ విషయాన్ని గుర్తించి చెప్పవలసిన విషయాలను ఉపమానాల ద్వారానో, రూపకాల ద్వారానో, దృష్టాంతాల ద్వారానో చెప్పటాన్ని చూస్తూనే ఉన్నాం. అమూర్త విషయాలైన బ్రహ్మ పదార్థంలాంటి వాటిని వివరించాలంటే చిరపరిచితంగా ఉండే ఉపమానాలను వాడక తప్పదు.

పరోపకారాయ ఫలన్తి వృక్షాః
పరోపకారాయ వహన్తి నద్యః
పరోపకారాయ దుహన్తి గావః
పరోపకారార్థమిదం శరీరమ్.

పరోపకారం కోసమే చెట్లు ఫలాలనిస్తున్నాయి. పరోపకారం కోసమే నదులు ప్రవహిస్తున్నాయి. పరోపకారం కోసమే గోవులు పాలిస్తున్నాయి. ఈ శరీరం పరోపకారం కోసమే ఉంది.

ప్రకృతిలో నదీనదాలు, చెట్లు చేమలు మనకు ఉపకారం చెయ్యకుంటే మానవునికి మనుగడే లేదు. అలాగే ప్రాణి పక్షుల వల్ల కూడా మనం ఎంతో లాభాన్ని పొందుతున్నాం. ఈ విషయాన్ని అర్థం చేసుకోవగలిగితే మనిషి సమాజంలో తన స్థానాన్ని అర్థం చేసుకోగలుగుతాడు. 'సొంతలాభం కొంతమానుకు పొరుగువారికి తోడుపడవోయ్' అనేది ఇలాంటి భావన వల్లనే వెలువడింది.

మనకు బాగా పరిచయం ఉండే వస్తువుల్ని పోలిక కోసం ఉపయోగించుకోవటం ఒక పద్ధతి. అలాగే భారతీయులకు సాంప్రదాయికంగా పురాణాలతో, కావ్యకథలతో, జాతక కథలలాంటి కథాసాహిత్యంతో పరిచయం ఉంది. అందువల్ల అలాంటి సాంప్రదాయిక సాహిత్యం నుంచి కూడా పోలికలను తీసి చూపించి ఏదైనా విషయాన్ని స్థాపించటం మరో పద్ధతి. 'దురాశ దుఃఖం చేటు' అన్నది సామెత. అతిగా ప్రవర్తించటం ఎప్పటికీ మంచిది కాదనే విషయాన్ని హితోక్తిగా చెప్పటం మనకు అలవాటే. దీన్ని సుభాషితంగా ఇలా చెప్పుకుంటారు:

అతి రూపాద్ధృతా సీతా అతి
గర్వాద్రావణో హతః
అతి దానాద్బలిర్బద్ధోహ్యతి
సర్వత్ర వర్జయేత్

అతి సౌందర్యం వల్ల సీత అపహరించబడింది. అతి గర్వం వల్ల రావణుడు చంపబడ్డాడు. అతి దానం వల్ల బలి బంధితుడయ్యాడు. 'అతి' ఎప్పటికీ విడువదగినది.

'అతి' అనేది ఎప్పటికీ మంచిది కాదు. అత్యాశకు పోతే ఎలాంటి వినాశం సంభవిస్తుందో చెప్పే సుభాషితాలు చాలా ఉన్నాయి. 'ఆశకు అంతం లేదు' అంటూ ఉంటాం. నిత్య జీవితంలో అత్యాశకు సంబంధించి ఎన్నో ఉదాహరణలు చూస్తున్నాం. వ్యాపారుల్లో, ఉద్యోగుల్లో రాజకీయ నాయకుల్లో రోజురోజుకూ ఆశ పెరిగిపోతూ ఉంది. ఇలా పెరిగే ఆశ ఎక్కడికి వెళ్తుందో ఎవ్వరికీ తెలియదు. దీన్నే ఈ క్రింది సుభాషితం ఇలా చెప్తుంది:

ఇచ్ఛతి శతీ సహస్రం ససహస్రః కోటిమీహతే కర్తుమ్
కోటి యుతోఽపి నృపత్వం నృపోఽపి బత చక్రవర్తిత్వమ్
చక్రధరోఽపి సురత్వం సురోఽపి సురరాజ్యమిహతే కర్తుమ్
సురరాజ్యోఽపూర్ధ్వగతిం తథాఽపి న నివర్తతే తృష్ణా.

వందరూపాయలు సంపాదించిన వాడు వేయి కోరుకుంటాడు. వేయి సంపాదించినవాడు కోటి కోరుకుంటాడు. కోటి కలవాడు రాజును కావాలనుకుంటాడు. రాజయిన తర్వాత చక్రవర్తి పదవిని కోరుకుంటాడు. చక్రవర్తి అయిన తర్వాత దేవత్వం కావాలంటాడు. దేవత్వం లభిస్తే దేవేంద్ర పదవిని కోరుకుంటాడు. దేవేంద్రుడయిన తర్వాత అంతకంటే పై పదవిని ఆశిస్తాడు. అయినా ఆశకు అంతం లేదు.





ఇలా చెప్పుకుంటూ పోతే సుభాషితాలకు కూడా అంతమే లేదు. జీవితంలో అనుసరించవలసిన అన్ని పద్ధతులను గురించి, ఆశ నిరాశలను గురించి, వినయ విధేయతలను గురంచి, సజ్జన దుర్జన పద్ధతులను గురించి వందలు వేలు సుభాషితాలు, నీతి పద్యాలు వెలువడ్డాయి. వీటిలో వందల సంఖ్యలో మన మనస్సుల్లో కదలాడుతూనే ఉంటాయి. మన జీవన విధానాన్ని రూపొందించుకోవటంలో ఈ సుభాషితాలు ప్రధాన పాత్ర వహిస్తాయనటంలో సందేహం లేదు. సంస్కృత భాషలో ఉన్న సుభాషితాలు కూడా కొంత చదువుకున్న వారిలో బాగా ప్రాచుర్యం కలిగి ఉన్నాయి. ఇక తెలుగు పద్యాలు, శతకాలు సరేసరి. అయితే వీటిలో ఉన్న వైరుధ్యాలు మనల్ని తికమక పెడుతుంటాయి. ఒకవైపు నిరాశావాదం మనల్ని పూర్తిగా క్రుంగదీస్తుంది. ఇక ఈ మానవ లోకాన్ని మార్చనే లేమేమో అనిపిస్తుంది.

ఎంత చదువు చదివి ఎన్నియో విన్నను
హీనుడవగుణంబు మానలేడు
బొగ్గు పాలగడుగ బోవునా నైల్యంబు
విశ్వదాభిరామ వినుర వేమ.

అన్నప్పుడు హీనులయిన వారిని ఎప్పటికీ మార్చలేము అనిపిస్తుంది.

ఎవ్వరి గుణములు ఏమన్న మానవు
చక్క చేయరాదు కుక్కతోక

అంటాడు వేమన. కాని అదే వేమన 'సాధనమున పనులు సమకూరు ధరలోన' అంటాడు.

మనుషుల స్వభావం ఎలా ఉంటుందంటే తమకు సంతోషం కలిగితే లోకమంతా సంతోషంగా ఉందనుకుంటాడు. తనకు దుఃఖం కలిగితే అందరికీ దుఃఖం అనుకుంటాడు.

తన కోపమె తన శత్రువు
తన శాంతమె తనకు రక్ష దయ చుట్టంబౌ
తన సంతోషమె స్వర్గము
తన దుఃఖమె నరకమండ్రు తథ్యము సుమతీ.

సుభాషితాలు కాని సామెతలు కాని జనుల అనుభవం నుంచి వెలువడతాయి. అందరికీ ఒకే రకమైన అనుభవం ఉండదు కాబట్టి ఒక్కొక్కరి అనుభవం నుంచి

పాఠాలు నేర్చుకోవలసి ఉంటుంది. మనిషి తన ఎదుగుదలకు తానే కారణం కావాలి. అయితే ఎదగటానికి ఆసరా అవసరమవుతుంది. అలాంటి ఆసరా అవసరయినంత కాలం జీవన పథంలో సాగటానికి సుభాషితాలనుంచి నేర్చుకోవలసి ఉంటుంది.



# కృష్ణుడు - కృష్ణమూర్తి

ఈ అధ్యాయంలో కృష్ణుడంటే భగవద్గీతలో కృష్ణుడు. కృష్ణమూర్తి అంటే జగద్విఖ్యాత తత్త్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి. నా జీవిత గమనంలో ఈ ఇద్దరు కృష్ణులు వహించిన పాత్ర చాలా గొప్పది. ఈ ఇద్దరు కృష్ణులను గురించి విపులంగా చెప్పేముందు నా జీవితానికి కృష్ణుడికి ఉండే సంబంధాన్ని చెప్పాలి.

నాకూ కృష్ణుడికీ చెప్పలేని అనుబంధం ఉన్నట్టుగా అనిపిస్తుంది. ఇది యాదృచ్ఛికమే. దీనికి ఎలాంటి మానవాతీత సంబంధాన్నీ కల్పించను. కాని వినోదం కోసం దీన్ని తెలుపవలసిందే. మా మేనమామ తంగిరాల కృష్ణమూర్తి, నేను చిన్నతనంలో మా మేనమామ ఇంట్లోనే ఉండి చదువుకున్నాను. మా మేనమామ అష్టమ సంతానం కాదు కాని ఆయన ఎనిమిది మంది పిల్లల్ని లోకానికి వదిలి సుమారు 47 ఏళ్ళ వయస్సులోనే చనిపోయారు. ఆయన ఉపాధ్యాయుడు. నా 19 ఏళ్ళ వయసులో మరో కృష్ణుడు ప్రవేశించాడు. ఆయన నాకు పిల్లనిచ్చిన మామ తూములూరు రాధాకృష్ణయ్య. ఆయనా ఉపాధ్యాయుడే. 19 ఏళ్ళు నిండగానే మదరాసు రాజధానీ కళాశాలలో తెలుగు ఎం.ఎ.లో చేరాను. అక్కడ మరో కృష్ణుడు నా జీవితంలోకి ప్రవేశించాడు. ఆయనే మా ప్రియ గురువర్యులు సాళ్వకృష్ణమూర్తిగారు. నాకు రచయితగా స్ఫూర్తి నిచ్చిన మహనీయులు ఈ కృష్ణమూర్తి. నా మొదటి రచన 'ఆధునిక వేమన శతకము'. దాన్ని పూర్తిగా చదివి, పుస్తకం ప్రూఫులు కూడా దిద్దిపెట్టి పుత్రవాత్సల్యంతో శిష్యుని చూచిన గొప్ప మనసు కృష్ణమూర్తిగారిది. నాకు మరో గురువర్యులు దేవళ్ళ చిన్ని కృష్ణయ్యగారు. 50 ఏళ్ళనాడు వారి దగ్గర ఎం.ఎ.లో చేరాను. ఇప్పటికీ వారి వాత్సల్యానికి కొరత లేకుండా ఉంది.

నేను ఎం.ఎ. చదివేటప్పుడు నాతో కలిసి చదువుకొని దురదృష్టవశాన ఇటీవలి కాలంలో కీర్తిశేషుడయ్యేవరకు ఆత్మీయుడిగా ఉన్నవాడు టి. గోపాలకృష్ణారావు. నా మొదటి పుస్తకానికి తన చిరునామానే ఇవ్వటమే కాకుండా నా పుస్తకాలను

అమ్మిపెట్టటంలోనూ సహాయపడిన సహృదయుడు గోపాలకృష్ణ నా స్నేహితుడు మాత్రమే కాదు గోపాలకృష్ణ నా మొదటి పిహెచ్.డి. విద్యార్థి కూడా.

నా జీవితం మీద అపారమైన ప్రభావం చూపిన మరో మహనీయుడు వావిలాల గోపాలకృష్ణయ్యగారు. వారు అధికార భాషా సంఘం అధ్యక్షులుగా ఉన్నప్పుడు మైసూరు విశ్వవిద్యాలయంలో నాగదికి వచ్చారు. అత్యంత సరళంగా, అతి సామాన్యవ్యక్తిగా కనిపిస్తూ హిమాలయమంత ఎత్తుకు ఎదిగిన మహనీయుడాయన. ఎన్నో సందర్భాలలో ఆ గోపాలకృష్ణయ్య నిజాయితీ, సరళ వ్యక్తిత్వం నాకు స్ఫూర్తిదాయకమయ్యాయి.

సౌజన్యానికి, సౌశీల్యానికి, వాత్సల్యానికి మారుపేరయిన వారు రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు. నాకు ఎన్నో విధాలుగా మార్గదర్శకులు. వారిని మొదటిసారి సర్ త్యాగరాయ కళాశాలలో 1965లో జరిగిన ఒక అవధానంలో చూచాను. ఆ తర్వాత నా 'తెలుగు సాహిత్యములో దేశికవిత'ను చదివి ఎం.ఎ. చదివే రోజుల్లోనే నాకు ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడెమీ బహుమతి వచ్చేట్లు చేసిన పరీక్షకులు అనంతకృష్ణులే. వారి రాళ్ళపల్లి మా యింటి పేరు రాళ్ళపల్లి వేరయినా 'మా రాళ్ళపల్లి మీ రాళ్ళపల్లి ఒకటేనా' అని పలకరించిన సహృదయుడు ఈ కృష్ణుడు. మైసూరు విశ్వవిద్యాలయంలో 38 ఏళ్ళపాటు పనిచేసిన రాళ్ళపల్లి వారి పీఠంలోనే మరో రాళ్ళపల్లి సుందరమైన నేను 39 ఏళ్ళు పనిచేయటం సుయోగమే. రాళ్ళపల్లి వారికి మేము సమర్పించిన 'అనంతరాగం' అనే అభినందన గ్రంథం మూడు భాషల్లో వెలువడిన అత్యుత్తమ అభినందన అనిపించుకుంది. 'రాళ్ళపల్లి పీఠికలు' అనే అమూల్యమైన పుస్తకాన్ని కూడా ప్రచురించే అదృష్టం మాకు దక్కింది.

నేను చదివిన రాజధానీ కళాశాలలోనే నా తర్వాత చదివి నన్ను సోదరునిగా భావించి, నా దగ్గరే పిహెచ్.డి. చేసిన మరో కృష్ణుడు డా. పి.ఎస్. గోపాలకృష్ణ. హైదరాబాదు ఆకాశవాణి కేంద్రం సంచాలకునిగా ఉద్యోగం చేసి విశ్రాంతి తీసుకుంటున్న తమ్ముడు ఈ గోపాలకృష్ణ.

నా జీవితంలో ప్రవేశించిన గోపాలకృష్ణమూర్తులలో అత్యంత ముఖ్యుడు, ఏడాది క్రిందటే నన్ను విడిచి వెళ్ళిన అప్పుడు రాజమహేంద్రవరంలో ఉండిన చింతల గోపాలరావు. నేను విజయుడినైతే గోపాలరావుగారు విజయసారథి. కావేరీ తీరం నుండి గోదావరీ తీరానికి వెళ్ళి తెలుగు విశ్వవిద్యాలయం, సాహిత్య పీఠంలో ఆచార్యునిగా,





డీన్‌గా నేను పనిచేసిన కాలంలో (1990–93) నాకు పరిచయమై చివరి క్షణం వరకు నన్నే పరమ ఆప్తునిగా భావించిన స్నేహితుడు చింతల గోపాలరావు.

ఇక్కడొక చిత్రమేమిటంటే నేను పుట్టిన నక్షత్రం ఉత్తర ఫల్గుని. అర్జునుడు ఫల్గునుడు. కృష్ణుడు విజయసారథి. ఇంతమంది కృష్ణులు, అందరికంటే ముఖ్యంగా నా కోసం నడిచి నడిపించిన చింతల గోపాలరావు నా జీవితంలో ప్రవేశించటం కాకతాళీయమే. అయినా విచిత్రంగా కనిపిస్తుంది. గోపాలరావుగారిని గురించి నా 'నది–నగరం'లో నేను రాసిన కొన్ని వాక్యాలు:

దర్శకత్వం ముఖ్యం కాని
వ్యక్తి ముఖ్యం కాదనే దార్శనికుడు
చితిమంటలు రేగుతున్నా
చింతను ముఖంలో చూడని స్థిత ప్రజ్ఞుడు
ప్రముఖుల్లో ప్రముఖుడు
ఆకాశానికెత్తే అవకాశవాదులకి
విముఖుడు.

ధార్తరాష్ట్రులు ఎంతమంది ఉంటే ఏం
ఫల్గునునికి ఒక్క గోపాలుడుంటే చాలదూ?....
స్నేహం గురించి చెప్పాలంటే ఎంతో ఉంది:
చెప్పాలనుకున్న భావాలు
ముందే తెలిసిపోతుంటాయి
చెప్పుకోలేని భావాలకు మాత్రం
ఏ భాషా సరిపోదు
అర్ధరాత్రి టెలిఫోను సంభాషణలో
మాటలు చిక్కబడి ఆర్ద్రమవుతుంటాయి
ఒక్కసారి 'హలో' అంటే
జీవితంలోంచి ఎంతో ఒంటరితనం పారిపోతుంది
ఇక 'చలో' అంటే ఏ తీరానికైనా సిద్ధమే కదా!

సుందర గోపాలరావుల స్నేహం వల్లే కదా
కావేరికీ గోదావరికీ మధ్య
దూరం తక్కువయింది!

## కృష్ణుడు

నా చిన్న తనంలోనే భగవద్గీత నా జీవితంలో ప్రవేశించింది. అప్పట్లో నాకు భగవద్గీత అంతా నోటికి వచ్చేది. మెల్లగా భగవద్గీతను చూచే దృష్టిలో మార్పు వచ్చింది. అనాలోచితంగా కాకుండా విమర్శన దృష్టితో ఏ విషయాన్నయినా పరిశీలించే అలవాటు బలం కాజొచ్చింది. అందువల్ల భగవద్గీతలోని ప్రతి శ్లోకానికీ కొత్త అర్థాలు స్ఫురిస్తూ వచ్చాయి.

వాల్మీకి చిత్రించిన రాముడు ఒక్కడే కావచ్చు. జైన రామాయణాలలో, బౌద్ధ రామాయణాలలో తమిళ కంబ రామాయణంలో రాముడు కొంతవరకు భిన్నంగా కనిపిస్తాడు. అయినా భారతీయుల మనస్సుల్లో ఉన్న రాముడు చాలావరకు ఒకే విధంగా ఉంటాడు. కాని కృష్ణుడు అలా కాదు. కృష్ణుని వ్యక్తిత్వంలో ఎంత వైవిధ్యముందో తెలుసుకుంటే ఆశ్చర్యం వేస్తుంది. మహాభారతంలో కృష్ణుడు పాండవ పక్షపాతి, రాజకీయ చతురుడు, పార్థసారథి. భాగవతంలో కృష్ణుడు బాలకృష్ణుడు, యశోదా కృష్ణుడు. గోపికాలోలుడు, రుక్మిణీ ప్రియుడు, సత్యావిధేయుడు, రాధాకృష్ణుడు. హరివంశంలో, పారిజాతాపహరణాది కావ్యాలలో కనిపించే కృష్ణుడు వేయి కృష్ణులలాగా కనిపిస్తాడు.

భగవద్గీతలో ఉండే కృష్ణుడే వేరు. ఈ దేశంలోని భక్తి సాహిత్యానికి మూల విరాట్టుగా ఉండే ఆధ్యాత్మిక తత్త్వవేత్తగా గీతలో దర్శనమిస్తాడు కృష్ణుడు. ఈ కృష్ణుణ్ణి ఎవరు సృష్టించారో తెలియదు. వ్యాసుడే అని చెప్పటం సంప్రదాయం. భారతీయ సాహిత్యంలో ఎంతమంది వ్యాసులున్నారో తెలియదు. వేదవ్యాసుడు, మహాభారతంలో వ్యాసుడు, మహాభారత కర్త వ్యాసుడు, పురాణాలలో వ్యాసుడు, భాగవతాదుల కర్త వ్యాసుడు, చివరికి భగవద్గీతను సృష్టించిన వ్యాసుడు ఒక్కరేనా వేరు వేరుగా ఉన్నారా అని నిశ్చయంగా చెప్పటం సాధ్యం కాదు.

భగవద్గీత మహాభారతంలో భాగంలాగా సందర్భ పరంగా కనిపించినా దాన్ని నిర్ధారించి చెప్పటానికి ఆధారాలు లేవు. వ్యాస భారతం క్రీస్తు పూర్వం 5-6 శతాబ్దుల నుంచి క్రీస్తు శకారంభం వరకు వికాసం చెంది మహాభారతమై లక్ష శ్లోకాలకు పెరిగింది.





ఈ క్రమంలో భగవద్గీత మహా భారతంలో ఎప్పుడు భాగమయిందో తెలియదు. బహుశా క్రీ.శ. ప్రారంభ శతాబ్దాలలో ఎప్పుడో భగవద్గీత మహాభారతంలో చేరి కురుక్షేత్ర యుద్ధంలో క్రియాత్మక పాత్ర వహించింది. భారతదేశంలో భక్తి సాహిత్యానికి మూలరూపమై నిలిచిన భగవద్గీత ప్రత్యేక రచనగా స్థానం సంపాదించుకుంది. తిక్కన పదిహేను పర్వాలు అనువదించి 16,500 పద్యాలతో అనన్య శక్తిని ప్రదర్శించినా భగవద్గీతను అనువదించకుండా వదలిపెట్టటంలో ఆంతర్యం బోధపడదు. బహుశా భగవద్గీతను మూల రూపంలోనే పారాయణం చేయాలనే ఉద్దేశమై ఉండవచ్చు.

భగవద్గీతను పారాయణం చేసిన కాలానికి అందులో ఏముందో నాకు తెలియదు. అలాగే వేంకటేశ్వర సుప్రభాతంలో కాని, పురుషసూక్తంలో కాని, ఇంకా ఎన్నో రచనల్లో కాని ఏముందో తెలియకుండానే వాటినన్నిటినీ బట్టీ పట్టాను. ఇప్పటికీ వాటిని విన్నప్పుడు ఒకప్పుడు మెదడులో స్థిరంగా నిలిచిన వాక్యాలు ఒక్కొక్కటే బయట పడుతూ ఉంటాయి. ప్రస్తుతం అవన్నీ వింటూ ఉంటే సాహిత్యపరంగా, సాంస్కృతిక పరంగా, సామాజిక పరంగా, వ్యక్తి వికాస పరంగా పరిశీలించటానికి అవకాశం కన్పిస్తుంది. ఏ ఆలోచనా లేకుండా అన్నిటినీ అంగీకరించే కాలం ఎప్పుడో పోయింది. భగవద్గీత విషయంలో కూడా నా ఆలోచనల్లో ఎంతో మార్పు వచ్చింది.

ఈ మధ్య కాలంలో భగవద్గీతకు సంబంధించిన అనేక గ్రంథాలను చదవటం పెరిగింది. వాటిలో కొన్ని భక్తి భావంతో సమర్పణ భావంతో వివరిస్తాయి. కాని ఒక రచనగా గీతను విశ్లేషించవు. మరికొందరు కేవలం నిరాకరించటమే ధ్యేయంగా పెట్టుకొని దానివల్ల ఏమీ ఉపయోగం లేదని నిరసిస్తారు. ఇంకా కొందరు ఘంటసాల గానం చేసిన భగవద్గీతను మెచ్చుకుంటూ తాము ఘంటసాల గానాన్ని మెచ్చుకుంటున్నారా భగవద్గీతను మెచ్చుకుంటున్నారా అనేది తెలీకుండా మాట్లాడతారు.

అమెరికాలో మొట్టమొదట స్థాపింపబడిన యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలో సంస్కృత విభాగం స్థాపన జరిగి 130 సంవత్సరాలయింది. ఇటీవలి కాలంలో నాతో బాటు ప్రఖ్యాత సంస్కృత పండితులు రామకరణ్ శర్మ గారు (వయసు 88 సంవత్సరాలు) నాతో బాటు సంస్కృతం బోధిస్తున్నారు. వారి తరగతులలో భగవద్గీత పాఠానికి అన్నిటికంటె ఎక్కువగా విద్యార్థులు హాజరవుతారు. ఈ ఆకర్షణ చెప్పే ఆచార్యునిలో ఉందా, గీత రచనా సౌందర్యంలో ఉందా, దాని లోని భక్తి భావంలో ఉందా, శ్రోతల్లోని

ఆసక్తిలో ఉందా అన్నది అర్థంకాదు.

ఫిలడెల్ఫియాలోనే ఒక విద్యార్థిని ఉంది. ఆవిడ సంస్కృతం బాగా చదువుకుంది యోగం క్షుణ్ణంగా చదువుతుంది. పతంజలి యోగ సూత్రాల వ్యాఖ్యానాలతో సహా అధ్యయనం చేసింది. ఆవిడ తల్లి అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉంటే వేళకు మందులిస్తూ, ఆహారం తినిపిస్తూ, నిష్ఠతో సేవచేస్తూ మధ్యలో కొన్ని గంటలు నర్సులకు అప్పజెప్పి సుమారు 10-15 మైళ్ళు ప్రయాణం చేసి వచ్చి నా దగ్గర భగవద్గీత పాఠం చెప్పించుకుంది. ఆవిడతోబాటు మా సహోచార్యుడు సంస్కృత పండితుడు దేవేన్ పటేల్ కూడా ఉంటాడు. భక్తిని ప్రచారం చేసే గ్రంథంగా కాక భగవద్గీతను ఒక సాహిత్య రచనగా , సరళ సుందరంగా విషయాన్ని ప్రతిపాదించే శైలీ సంబంధ సృష్టిగా వివిధ రకాల యోగాలను బోధించే ఆధ్యాత్మిక గ్రంథంగా, ప్రతి పదాన్ని వాక్యాన్ని అర్థవంతంగా చదవాల్సిన సాంప్రదాయిక రచనగా చదివాము. ఇలా మూడు నాలుగు నెలలు కేవలం మూడు అధ్యాయాలు మాత్రం చదవగలిగాము. ఆసక్తి ఉన్నవారితో భగవద్గీత పఠనం ఇలా సాగుతుంది.

ప్రపంచ సంస్కృతిలో కొన్ని సంఖ్యలు ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. అలాంటి వాటిలో మూడు సంఖ్య ఒకటి. త్రిలోకాలు, త్రిమూర్తులు, మూడు నామాలు, మూడు విభూతిరేఖలు – ఇలా ఎన్నయినా చెప్పుకోవచ్చు. మూడు, ఆరు, పన్నెండు, పద్దెనిమిది ఇలా మూడు పూవులు ఆరు కాయలుగా ఈ సంఖ్య పెరుగుతూ ఉంటుంది. రామాయణంలో ఆరు కాండలు, భాగవతంలో పన్నెండు స్కంధాలు, మహాభారతంలో పద్దెనిమిది పర్వాలు మనకు తెలిసినవే. మహాభారతంలో పద్దెనిమిది రోజులు యుద్ధం జరగటం మొత్తం పద్దెనిమిది అక్షౌహిణుల సైన్యం పాల్గొనటం కాకుండా భగవద్గీతలో కూడా పద్దెనిమిది అధ్యాయాలుండటం కూడా గమనించదగిందే.

ఇది కాక భగవద్గీతలోని అధ్యాయాలను 'యోగం' అనే పేరుతో పిలవటం కూడా కుతూహలాన్ని రేకెత్తిస్తుంది. ఈ యోగాలలో సాంఖ్య యోగం కూడా ఒకటి కావటం గమనించదగింది. భక్తియోగం అన్నది, జ్ఞానయోగం అన్నది సహజంగా కనిపిస్తున్నా అర్జున విషాదయోగం నుంచి మోక్ష సన్న్యాసయోగం వరకు ఉన్న యోగాలన్నీ అర్థవంతంగా ఉండడం విశేషం.

అర్జున విషాద యోగంతో మొదలైన భగవద్గీత మొదటి శ్లోకంనుంచే అర్థవంతమై ఆలోచింపచేస్తుంది. కురుక్షేత్రాన్ని ధర్మక్షేత్రమని చెప్పటంతో గీత ప్రారంభమవుతుంది.





దుర్యోధనాదులను మాత్రం 'నావారు' (మామకాః) అని పాండవులని వేరుగా చెప్పి ఆ 'ధర్మక్షేత్రం'లో వారిద్దరు ఏంచేస్తున్నారని ధృతరాష్ట్రుడు అడగటం వింతగా ఉంది. ఇది ఆ రాజు స్వభావాన్ని తెలియజేస్తుంది.

భగవద్గీతను మళ్ళీ చదువుతుంటే అందులో పదప్రయోగం, ఒక్కొక్క పాత్ర తమ స్వభావాన్ని వ్యక్తంచేసే తీరు, నాటకీయ సంభాషణలు ఆకర్షిస్తాయి. అన్నిటికంటె ముఖ్యంగా జీవితం అన్నది ఒక సమరమని భావిస్తే ఆ సమరంలో పాల్గొని తీరాలని విజయం సాధించాలని గీత ఎంత వరకు ఉద్బోధిస్తుంది అన్నది పరిశీలించాల్సిన విషయం. ఒకవైపు యుద్ధం చేయాల్సిందే అంటూ మరో వైపు కర్మ సన్న్యాసాన్ని, మోక్ష సన్న్యాసాన్ని బోధించటం ఆలోచనకు గురిచేస్తుంది.

ధర్మక్షేత్రే కురుక్షేత్రే
సమవేతాయుయుత్సవః
మామకాః పాండవాశ్చైవ
కి మకుర్వత సంజయ?

ఇక్కడి నుంచే నాటకీయత ప్రారంభమవుతుంది. ధృతరాష్ట్రుడు కళ్ళులేనివాడు. వినగలడు కాని కనలేడు. విషయాలు తెలియాలంటే సంజయుని లాంటి నిజాయితీ పరుడు కావాలి. ధృతరాష్ట్రునికి సంజయుని కంటె మంచి నివేదకుడు లేడు. కురుక్షేత్రంలో యుద్ధోత్సాహంతో కలిసిన తనవారు, పాండవులు ఏం చేశారో తెలుసుకోవాలన్న కుతూహలం ధృతరాష్ట్రునిది.

దుర్యోధనుడు ఆచార్య ద్రోణునితో మాట్లాడుతున్నట్లు నివేదించిన సంజయుని మాటలవల్ల కురుక్షేత్రంలో యుద్ధానికి నిలిచిన వారందరి పరిచయం లభించేట్లు చేశాడు రచయిత. దుర్యోధనుని అభిప్రాయంలో అతని బలం అపరిమితం, పాండవులది పరిమితం.

అపర్యాప్తం తదశ్మాకం
బలం భీష్మాభిరక్షితమ్
పర్యాప్తం త్విద మేతేషాం
బలం భీమాభి రక్షితమ్

(భీష్ముడు రక్షిస్తున్న మన బలం అపరిమితం. భీముడు రక్షిస్తున్న వారి బలం పరిమితం)

కౌరవుల సేన 11 అక్షౌహిణులైతే పాండవులది 7 అక్షౌహిణులు. పాండవులపై ఉన్న అతిరథ మహారథులకంటె కౌరవులవైపు భీష్మ, ద్రోణ, కర్ణ, శల్య, దుశ్శాసనాదులున్నారు. అంతే కాక పాండవుల సేనకు రక్షకుడు ధర్మరాజుతో, అర్జునుడనో చెప్పక భీముడని చెప్పటంలో దుర్యోధనుడి దృష్టి అంతా తన ప్రత్యర్థి అయిన భీముని మీదే ఉందని స్పష్టమవుతుంది.

యుద్ధం ప్రారంభమయినట్లుగా శంఖనాదాలు వినిపించటం, శ్రీకృష్ణార్జునుల ప్రవేశం, శ్రీకృష్ణుడు పాంచజన్యాన్ని, అర్జునుడు దేవదత్తాన్ని పూరించటం, ఇతరులు వారి వారి శంఖాలను ఊదటం ఇవన్నీ ఒక దృశ్య కావ్యంలాగా మన మనోఫలకం మీద దర్శనమిస్తాయి. అర్జునుడు కృష్ణునితో రథాన్ని రెండు సైన్యాల మధ్య నిలపవలసిందని చెప్పటం, అక్కడి బంధుజనాన్ని, గురువులను, స్నేహితులను చూడగానే మనసు కలవరపాటు చెందటం – వీటిలోని నాటకీయతను గమనించాలి. మనిషి జీవితంలో ఎదురయ్యే సంఘటనలు కలవరపెట్టటం, ఆ సమయంలో మన అభివ్యక్తి స్వరూపం తెలియజెయ్యటం ఇక్కడి విశేషం. అర్జునుడి మాటలివి

న కాంక్షే విజయం కృష్ణ
న చ రాజ్యం సుఖాని చ
కిం నో రాజ్యేన గోవింద
కం భోగైర్జీ వితేన వా

(కృష్ణా! నాకు విజయ కాంక్ష లేదు. నాకు రాజ్యమక్కర లేదు. సుఖమక్కర లేదు. గోవిందా! (ఇట్టి బంధువులంతా చనిపోయిన తర్వాత) రాజ్యమెందుకు, భోగాలెందుకు? చివరికి జీవితం మాత్రం ఎందుకు?)

భీష్మ ద్రోణాదులను చూచిన తర్వాత అర్జునుడికి విషాదం కలగటంలో ఏ మాత్రం ఆశ్చర్యం లేదు. అక్కడ ఉన్నవారు ఆచార్యులు, తండ్రులు, కొడుకులు, తాతలు, మేనమామలు, మామలు, మనుమలు, బావమరదులు, ఇతర బంధువులు. అర్జునుడు ఇంతగా బాధపడుతుంటే కృష్ణుడు నవ్వుతున్నట్లున్నాడు (ప్రహసన్నివ). అర్జునుని మీద ఆధ్యాత్మికంగా మనోవైజ్ఞానికంగా అన్ని ప్రయోగాలు చేశాడు. ఈ యుద్ధం, ఈ విజయం, ఈ సుఖాలు – ఇవన్నీ శాశ్వతం అనుకొంటున్న అర్జునుడికి ఇది కేవలం అశాశ్వతమని జీర్ణించిన వస్త్రాన్ని తీసేసి మనం ఎలా కొత్త వస్త్రాన్ని ధరింస్తామో ఈ దేహాన్ని కూడా అలాగే వదిలేస్తామని బోధించాడు.





వాసాంసి జీర్ణాని యథావిహాయ
నవాని గృహ్ణాతి నరోఽ పరాణి
తథా శరీరాణి విహాయ జీర్ణా
న్యన్యాని సంయతి నవాని దేహీ.

(మనిషి చినిగిన వస్త్రాలను వదలి కొత్త వస్త్రాలను కట్టుకొనేట్లు ఆత్మ జీర్ణమైన శరీరాలను వదలి కొత్త శరీరాలను పొందుతూ ఉంటుంది)

ఈ జీవితం అశాశ్వతమని, పుట్టిన వారికి మరణం తప్పదని చెప్తున్నప్పుడు ఈ క్షణికమైన జీవితం కోసం బంధువులనందరినీ ఎందుకు పోగొట్టుకోవాలనే ప్రశ్న ఉదయిస్తుంది. ఒకవైపు జీవితం అశాశ్వతమని చెప్తూనే మరో వైపు జీవన సమరాన్ని విధిగా నిర్వర్తించాలనే బోధించటం ఎంత కష్టసాధ్యమో ఈ సందర్భం సూచిస్తుంది.

జాతస్య హి ధ్రువో మృత్యుః
ధ్రువం జన్మ మృతస్య చ
తస్మా దపరిహార్యేఽ ర్థే
న త్వం శోచితు మర్హసి

(జన్మించిన వారు మరణించక తప్పదు. మరణించిన తర్వాత మళ్ళీ పుట్టుక తప్పదు. తప్పించటానికి వీలులేని కార్యం కోసం నీవు దుఃఖించ నవసరం లేదు)

పునర్జన్మలాంటి నమ్మకాలను పక్కన పెట్టి ఈ జీవితం అశాశ్వతమనే విషయాన్ని ఒంట పట్టించుకున్నవారు కర్తవ్యోన్ముఖులైనా అవుతారు లేదా అన్నీ వదలి వైరాగ్యం పొందుతారు. అశాశ్వతమనే భావన కలిగినప్పుడు సుఖదుఃఖాలను, లాభనష్టాలను, జయాపజయాలను పక్కన పెట్టి కర్తవ్యం వైపు మాత్రమే మనసు పెట్టాలని కృష్ణుని ఉద్బోధ. ఇది ఎవరి మీదనైనా ప్రభావం చూపుతుంది.

సుఖ దుఃఖే సమే కృత్వా
లాభాలాభౌ జయా జయౌ
తతో యుద్ధాయ యుజ్యస్వ
నైవం పాపమవాప్యసి.

(సుఖ దుఃఖాలను, లాభనష్టాలను, జయాపజయాలను సమానంగా భావించి యుద్ధానికి సన్నద్ధుడవు కా. అలా చేస్తే ఏ పాపమూ నిన్నంటదు).

కర్మయోగం ప్రారంభంలో అందరికీ వచ్చే అనుమానాన్నే అర్జునుడు కూడా వ్యక్తం చేస్తాడు. "నిష్కామ కర్మం కన్న జ్ఞానమే గొప్పదనే ట్లయితే నన్ను కర్మానికి ఎందుకు ప్రేరేపిస్తున్నావు" అని అడుగుతాడు. నీవు పరస్పరం విరోధం ఉండే వాక్యాలు చెప్తున్నావు అంటాడు.

జ్యాయసీ చేత్క ర్మణస్తే
మతా బుద్ధిర్జ నార్దన
తత్కిం కర్మణి ఘోరే మాం
నియోజయసి కేశవ.

(జనార్దన! కర్మముకన్న జ్ఞానము గొప్పదని నీ మతమైతే ఘోరమైన అదే కర్మమును చెయ్యవలసిందిగా నన్నెందుకు ప్రేరేపిస్తున్నావు?)

"నీవు పరస్పరం విరోధం గల వాక్యాల చేత నా బుద్ధికి మోహం కలుగుజేస్తున్నావు" అంటాడు అర్జునుడు. ఇలాంటి సందర్భాన్ని కృష్ణుడు ఎలా నిర్వహిస్తాడా అనే సందేహం తప్పక ఉదయిస్తుంది.

భగవద్గీత అయినా మరే గ్రంథమైనా అది ఎంతవరకు మన జీవితానికి పనికి వస్తుందనేది చాలా ముఖ్యం. అయితే అందరికీ ఒకే విధంగా పనికి వస్తుందా, అందరికీ ఒకే విధంగా నచ్చుతుందా అంటే దానికి పనికిరానవసరం లేదు. నచ్చనవసరం లేదనే సమాధానం. వారి వారి జీవితానికి తగినట్లుగా వారు వీటిని అన్వయించుకోవాలి. అర్జునుడు కూడా అదే పని చేశాడు. తనకెన్నో సందేహాలు వచ్చాయి. విషాదం ఏర్పడింది. ఆ సమయంలో తనను ముందుకు నడిపించటానికి కృష్ణుడున్నాడు.

కృష్ణుడు చెప్పిన మాటలలో కొన్ని ఎవరైనా అనుసరించదగినవే. జీవన పథాన్ని నిర్ణయించుకోవటానికి ఆ మాటలకు సరైన అర్థాన్ని కల్పించుకొని అనుసరించాల్సి ఉంటుంది. కర్మమనేది ఏదో పూర్వజన్మ కర్మమని భావించరాదు. కర్మమంటే కర్తవ్యంగా భావించాలి. ఈ ప్రపంచంలో మనం చేయవలసిన పనులెన్నో ఉన్నాయి. మన కర్తవ్యాన్ని మనం సక్రమంగా నిర్వర్తించాలి. కర్మములను చేయకుండ జ్ఞానం లభించదంటాడు కృష్ణుడు. ఎవరైనా సరే, ఏ క్షణంలోనైనా సరే కర్మనిరతుడు కాని వాడెవడూ ఉండడు.

నహి కశ్చిత్ క్షణమపి
జాతు తిష్ఠత్య కర్మకృత్
కార్యతే హ్యవశః కర్మ
సర్వః ప్రకృతి జైర్గుణైః





(ఏ వ్యక్తి అయినా ఏ క్షణంలో నైనా ఏ పనీ చెయ్యకుండా ఉండడు. ప్రతి ప్రాణి ప్రకృతి వల్ల పుట్టిన సత్త్వరజస్తమోగుణాలకు పరాధీనమై కర్మను చేస్తూనే ఉంటుంది)

కృష్ణుడు చెప్పిన కర్మలు మనం చెయ్యాల్సిన విధులు కాకపోవచ్చు. అవి యజ్ఞయాగాదులకు సంబంధించినవి కావచ్చు. కాని అర్జునుని విషయంలో కర్మమంటే అతను చేయవలసిన యుద్ధమే. అతని కర్తవ్యం యుద్ధం చెయ్యటమే.

జ్ఞాన యోగంలో కృష్ణుడు తాను జ్ఞాన స్వరూపుడనని జ్ఞాన యోగాన్ని సృష్ట్యాదిలో సూర్యుడికి ఉపదేశం చేశానని చెప్తాడు. అప్పుడు సహజంగానే అర్జునుడికి సందేహం కలిగింది. "సూర్యుడు ముందు పుట్టాడు కదా? నీవు సూర్యుడికి ఎలా ఉపదేశించావు" అని ప్రశ్నిస్తాడు. తాను పరమాత్మ స్వరూపుడని, అర్జునుడు కూడ ఎన్నో జన్మాంతరాల తర్వాత ఇలా జన్మించాడని అంటాడు కృష్ణుడు. ఎప్పుడైతే అధర్మానికి వృద్ధి కలుగుతుందో అప్పుడు తాను జన్మిస్తానంటాడు.

యదా యదా హి ధర్మస్య
గ్లా నిర్భవతి భారత!
అభ్యుత్థాన మధర్మస్య
తదాऽऽ త్మానం సృజామ్యహమ్.

(అర్జునా! ఎప్పుడైతే ధర్మానికి హాని కలుగుతుందో, అధర్మం వృద్ధి అవుతుందో అప్పుడు నన్ను నేనే సృష్టి చేసుకుంటాను)

ఇవన్నీ ఎలా ఉన్నా బౌద్ధము, జైనము, ఉపనిషత్తులలో లాగే భగవద్గీతలో కూడా స్వార్థం శత్రుత్వం, ద్వేషం మొదలైన వాటిని వదలి సంయమం పాటించాలనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఇది ఎవరికైనా అనుసరణీయమే. ఆత్మసంయమ యోగంలో యోగిని గురించి చెప్తూ కృష్ణుడు ఇలా అంటాడు.

సుహృన్మిత్రా ర్యుదాసీన
మధ్యస్థ ద్వేష్యబన్ధుషు
సాధుష్వపి చ సాపేషు
సమ బుద్ధి ర్విశిష్యతే.

(సృహదయులు, మిత్రులు, శత్రువులు, ఉదాసీనులు, మధ్యస్థులు, ఇష్టం లేనివారు, బంధువులు, సాధువులు, పాపాత్ములు – ఈ అందరి పట్ల సమానమైన బుద్ధి కలిగి ఉండటం ఉత్తమ గుణం)

ఇలాగే భగవద్గీతలో ఎన్నయినా శ్లోకాలను చెప్పుకుంటూ పోవచ్చు. కాని నాకు, నాలాంటి వారికి సంశయం కల్గించే ముఖ్యమైన శ్లోకం ఇది:

కర్మణ్యేవాధికారస్తే
మా ఫలేషు కదాచన
మా కర్మ ఫలహేతు ర్భూ
ర్మా తే సజ్గోஉ_స్త్వ కర్మణి

(నీవు చేసే కర్మలపై నీకు అధికారముంది కాని కర్మ ఫలం పైన అధికారం లేదు. నీవు కర్మ ఫలానికి కారణం కావద్దు. కర్మను విడువవద్దు)

చిన్నతనంలో ఏమీ తెలియని కాలంలో దీన్ని అలాగే అంగీకరించాను. కాని ఎదిగే కొద్దీ దీన్ని అంగీకరించటానికి నా మనసు సుతరాం ఇష్టపడలేదు. మన పని మనం చెయ్యాలి కాని దాని ఫలితాన్ని ఆశించకూడదనే మాటను సామాన్య ప్రజానీకానికి విరుద్ధంగా బలవంతులు వాడుకున్నారు. అదీ కాక కష్టపడి పనిచేసి దాని ఫలితాన్ని మాత్రం ఆశించకూడదనే మాట ఎంతవరకు న్యాయమని మనసు తొలుస్తూ వచ్చింది. కాని కర్మ ఫలాన్నే ఆశిస్తూ ఉంటే నిరాశ కూడా ఎదురు కావచ్చుని, అందుచేత ఫలితం మీదనే దృష్టి పెట్టకుండా నిష్ఠతో కార్యాన్ని సాధించటానికి ప్రయత్నించాలని దీనికి అర్థం చెప్పుకుంటే మేలనిపిస్తుంది.

భగవద్గీతలో నాకు చాలా బాగా నచ్చిన శ్లోకం ఈ క్రిందిది:

యద్యదాచరతి శ్రేష్ఠః
తత్తదేవేతరో జనః
సయత్ప్రమాణం కురుతే
లోకస్తదను వర్తతే

(శ్రేష్ఠుడయిన వాడు ఏమేమి ఆచరిస్తాడో ఇతరులు దాన్నే అనుసరిస్తారు. అలాంటి ఉత్తముడు దేనిని ప్రమాణంగా తీసుకుంటాడో లోకమంతా దాన్నే ప్రమాణంగా తీసుకొని ప్రవర్తిస్తుంది.)

భగవద్గీతను కేవలం పారాయణం చేయటం నాకిప్పుడు కుదరదు. అందులో ఉన్న మంచి శ్లోకాలను తలచుకొని ఆచరించటం వల్ల జీవనం సుఖమయమవుతుందంటే పేచీ లేదు.





# కృష్ణమూర్తి



నేను నేనుగా అవతరించే ముందు నాపై, నా భావాలపై, నా జీవన విధానంపై ఎక్కువ ప్రభావం చూపించి ప్రఖ్యాత తత్త్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి. సృజనాత్మక తత్త్వశాస్త్రం వైపు నా ఆలోచనలు సాగటానికి ముఖ్యకారకుడు జిడ్డు కృష్ణమూర్తి.

సృజనకు వస్తువు అవసరం కాని
కట్టుబడి ఉంటే కవిత్వం రాదు
అవగాహనకు అనుభవ జ్ఞానం అవసరం
ఆలోచనకు ప్రజ్ఞ అవసరం

– ఈ విధమైన ఆలోచనలను నాలో ప్రేరేపించిన వాడు జిడ్డు కృష్ణమూర్తి. 'జిడ్డు' అనే తెలుగువారి ఇంటి పేరుతో పుట్టి ఏ జిడ్డుకూ అంటుకోకూడదనే స్వావలంబన సిద్ధాంతాన్ని ప్రవచించి తన సిద్ధాంతాన్ని కూడా అనుసరించవద్దని బోధించిన మహనీయుడు కృష్ణమూర్తి.

సత్యశోధనకు ప్రతి ఒక్కరూ సమాయత్తం కావాలని, తనను తాను తెలుసుకొనే ప్రయత్నం చేయాలని బోధించిన కృష్ణమూర్తి ఆకట్టుకొనే శైలిలో చేసే ప్రసంగాలు శ్రోతల్ని ముగ్ధుల్ని చేసేవి. ఆయనకు ప్రసంగాలలో వేద మంత్రాలు, ఉపనిషత్ సూక్తులు, సాంప్రదాయిక నీతులు, పౌరాణిక నిదర్శనాలు – ఇవేవీ ఉండేవి కావు.

కృష్ణమూర్తి 1895 మే నెల 11వ తేది రాత్రి 12.30 గంటలకు మదనపల్లిలో జిడ్డు నారాయణయ్య సంజీవమ్మ దంపతులకు జన్మించారు. నారాయణయ్య దంపతులకు కలిగిన 11మంది సంతానంలో ఆరుగురు మాత్రమే మిగిలారు. అష్టమ సంతానమైన కారణాన కృష్ణమూర్తి అనే పేరు లభించింది. నారాయణయ్య 1881లోనే దివ్య జ్ఞాన సమాజంలో సభ్యులయ్యారు. ఈ సమాజం అంతర్జాతీయ కేంద్ర కార్యాలయం మదరాసు

అడయారులో ఉంది. వారి అనుమతిలో నారాయణయ్య నలుగురు కొడుకులతో, మేనల్లుడితో అడయారుకు వచ్చారు. ఇది కృష్ణమూర్తి జీవితంలో పెద్ద మలుపు అయింది.

1907లో ఆనిబెసెంట్ దివ్యజ్ఞాన సమాజానికి అధ్యక్షురాలయ్యారు. శ్రీకృష్ణుడు భగవద్గీతలో చెప్పినట్లుగా విశ్వశ్రేయస్సును నెలకొల్పటానికి జగద్రక్షకులు అవతరించి లోకాన్ని ఉద్ధరిస్తారని దివ్యజ్ఞాన సమాజం వారు నమ్మేవారు. ఆనిబెసెంట్ కృష్ణమూర్తిని దత్తత తీసుకొని జగద్గురువుగా ఆయనను ప్రపంచానికి పరిచయం చేశారు. ప్రపంచమంతటా శిష్యులను తయారుచేసి కృష్ణమూర్తి బోధలను ప్రచారం చెయ్యాలని 'తారక సంస్థ' ను స్థాపించారు. ఈ సంస్థ ప్రాచుర్యం వహించటంవల్ల దివ్యజ్ఞాన సమాజంలో సభ్యుల సంఖ్య తరిగింది. ఆనిబెసెంట్ కృష్ణమూర్తిని ఇంగ్లాండుకు పంపారు. ఆ తర్వాత ఫ్రాన్సుకు పంపారు. అప్పట్లో కృష్ణమూర్తి తారక సంస్థ సమావేశాలతో బాటు దివ్యజ్ఞాన సమాజం కార్యక్రమాలలోను పాల్గొని ఉపన్యాసాలు ఇచ్చేవారు. ఆ తర్వాత కృష్ణమూర్తి అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ఒకటైన కాలిఫోర్నియాలో ఓహైలో నివాసం ఏర్పాటు చేసుకున్నారు.

1929వ సంవత్సరం ఆగస్టు నెల మూడవ తేదీ జిడ్డు కృష్ణమూర్తి గొప్ప నిర్ణయం తీసుకున్నారు. ఆనిబెసెంట్, మరి మూడు వేల మంది తారక సంస్థ సభ్యుల సమక్షంలో తారక సంస్థను రద్దుచేస్తూ ప్రసంగం చేశారు. సత్యాన్ని ఏ మతం ద్వారా కాని, ఏదో ఒక మార్గం ద్వారా కాని చేరలేమని ప్రకటించారు. ఎవరి ఆత్మోన్నతికి వారే ప్రయత్నించాలని దానికి ఏ సంస్థా అవసరం లేదని ఘోషించారు. అన్ని నమ్మకాలనుంచి విముక్తి పొంది కల్మష రహితమైన ఆత్మ వికాసానికి ప్రయత్నించాలన్నారు. ఆనిబెసెంట్, ఇతర సభ్యులు ఆశ్చర్య చకితులయ్యారు. ప్రపంచ మతగురువు స్థానాన్ని, కోట్ల కొద్దీ ఆస్తిని, గౌరవాలను తృణప్రాయంగా వదలివేసిన కృష్ణమూర్తి ఎనలేని దార్శనికుడై జీవితాంతం ఈ ప్రపంచ ప్రజలకు స్వేచ్ఛను, ప్రేమను, సత్యాన్వేషణ ప్రవృత్తిని బోధిస్తూ ఉండిపోయారు. 1986 జనవరి 4న 91 ఏళ్ళ వయసులో జిడ్డు కృష్ణమూర్తి చివరి ప్రసంగం చేశారు. మదరాసులో జరిగిన ఈ ప్రసంగానికి వెళ్ళలేక పోయిన నాకు ఒక మహనీయుడిని చూచే అవకాశం తప్పిపోయింది. జీవితానికి మూలాన్ని తెలుసుకోవటం ముఖ్యమని, హేతుబద్ధంగా ఎవరి జీవితాలను వారు సరిచేసుకోవాలని కృష్ణమూర్తి ఆ రోజు ప్రసంగించారు.





1986 ఫిబ్రవరి 17వ తేదీ కాలిఫోర్నియా రాష్ట్రంలోని ఓహైలో తమ నివాస గృహంలో జిడ్డు కృష్ణమూర్తి కీర్తి శేషులయ్యారు.

చిన్నతనం నుంచి జీవితం గురించి, ప్రపంచం గురించి, మతాలను గురించి, సంప్రదాయాలను గురించి మానవాతీత శక్తులపై విశ్వాసాలను గురించి నాలో చెలరేగిన ప్రశ్నలకు సమాధానాలను అన్వేషిస్తూనే ఉన్నాను. వీటిలో చాలావాటికి సమాధానాలు కృష్ణమూర్తి ప్రసంగాలలో లభించాయి. అయితే అవి సమాధానాలని చెప్పటానికి వీలు లేదు. ఎందుకంటే కృష్ణమూర్తి ప్రకారం ఎవ్వరూ వారి వారికి కావలసిన సమాధానాలను ఇతరులలో వెతుక్కోకూడదు. వారికి వారే అన్వేషించాలి. వారికి వారే సమాధానం పొందాలి.

పుస్తకం కాని, ప్రసంగం కాని, మత బోధలు కాని, నీతి వాక్యాలు కాని – ఏవైనా సరే పరిశీలనాత్మకంగా చూడదగినవే. దేనినీ గుడ్డిగా నమ్మటం కాని, అనాలోచితంగా అనుసరించటం కాని కూడదు. తమలో రేగిన అభిప్రాయాలను కూడా వెంటనే అంగీకరించి ఒక నిర్ణయానికి రాకూడదు. తనను తానే చదువుకో గలగాలి. తన ఆలోచనల మూలాలను వెతకాలి. హృదయమంతా ప్రేమ నింపుకోవాలి, ద్వేషం అన్నది ఏ కోశానా ఉండకూడదు.

ఏదైనా విషయాన్ని గురించి కృష్ణమూర్తి ఆలోచన, అభివ్యక్తి స్పష్టంగా ఉంటుంది. అది ఎంతవరకు స్పష్టంగా ఉంటుందంటే ఆ స్పష్టతను తెలుసుకోవటం ఒక్కొక్కసారి కష్టతరమవుతుంది. మానవుని గురించి, ప్రపంచంలో మానవుని మనుగడ గురించి, సుఖ సంతోషాలతో జీవితాన్ని సాగించటం గురించి ఆయన అభిప్రాయాలు వెలిబుచ్చారు.

విద్యా విధానం గురించి జిడ్డు కృష్ణమూర్తి అభిప్రాయాలు 1978లో ఆయన రాసిన ఒక ఉత్తరంలో కనిపిస్తాయి. పాఠశాలలో నైపుణ్యంతో పాఠ్యాంశాలను బోధిస్తే చాలదు. విద్యార్థులు, ఉపాధ్యాయులు. ఇద్దరూ సహజ రీతిలో వికాసం చెందటానికి విద్యావిధానం తోడ్పడాలి. విషయాలను పోగు చేసుకోవటం విద్య, కాదు. స్వేచ్ఛ అనేదాన్ని 'ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించటం' అని అర్థం చేసుకుంటున్నాం. దీన్ని అర్థం చేసుకోవాలంటే మనసు చక్కగా వికాసం చెందటం అవసరం. వ్యక్తిగతమైన జీవితాన్ని మానవాళివైపుకు మళ్ళించకుండా, స్వార్థమే స్వేచ్ఛ అని అర్థం చేసుకోకూడదు. ప్రేమవల్ల వచ్చే మంచితనం కావాలి. మనస్సు, హృదయం, శరీరం – ఈ మూడూ సామరస్యంతో

ఉన్నప్పుడే వికాసం సహజరీతిలో జరుగుతుంది. విద్యాలయాలు ఈ విషయాన్ని గుర్తించాలి.

చదువుకు జీవితానికి ఉండే సంబంధాన్ని గురించి పలు సందర్భాలలో కృష్ణమూర్తి తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఇప్పటి చదువులు మన మేధ ఏదో ఒక పరిధిలోనే పనిచేసేట్లుగా చేస్తున్నాయి. సంపూర్ణ మానవ వికాసానికి విద్యావిధానం దోహదం చేయటం లేదు. జీవితంలో ఆశల్ని పెంచే విధంగా, సాంఘిక భద్రత, సమాజంలో గుర్తింపు లక్ష్యంగా విద్యావిధానం ఉంటోంది కాని స్వతంత్రమైన ఆలోచనల్ని పెంచే విధంగా ఉండడం లేదు.

వ్యక్తి జీవితంలో ఎన్నెన్నో సమస్యలు, సమాజంలో ఎదుర్కోవలసిన ప్రశ్నలు నిండి ఉన్నాయి. మనిషి సంపూర్ణ మానవునిగా తయారయితే కాని వీటికి పరిహారం దొరకదు. కేవలం సామర్థ్యం పెంచటం కాక సంపూర్ణ మానవునిగా తయారు చేస్తే కాని విద్యావిధానం సార్థకం కాదు. పిల్లల్ని నిర్మలమైన వాతావరణంలో ఎదగనీయక మనకు వారసులు, మన ఆశయాలకు కట్టుబడే వారుగా, మన ఆశలకు ప్రతినిధులుగా తయారుచేసే విద్యావిధానం మనకు అవసరం లేదు.

మతం విషయంలో కృష్ణమూర్తి స్పష్టమైన తమ అభిప్రాయాల్ని వ్యక్తం చేస్తూ వచ్చారు. మతాలు మానవుడిని మార్చలేదు. సరికదా మానవుల మధ్య విభేదాలను సృష్టించాయి. మతం అంటే విశ్వాసం. ఇది వ్యక్తి గతమైన విశ్వాసమైతే పరవాలేదు. ప్రేమకు పునాది అయితే పరవాలేదు. ఇతరుల అభిప్రాయాలను సమ్మతించటం సమ్మతించక పోవటం అనేది వ్యక్తిగతం. వారి వారి ఇష్టాలను బట్టి ఉంటుంది. కాని మతాల కట్టుబాట్లు ప్రతిబంధకాలుగా మారినప్పుడు ఇతర మతాల పట్ల నిరాదరణ నిష్కారణ ద్వేషం ఎక్కువవుతాయి.

మానవునికుండే కష్టాల వల్ల, జీవితంలో అనుభవించే బాధలవల్ల ఏదో ఒక ఆశ్రయాన్ని కోరుకుంటాడు. అయితే అది అంతటితో ఆగితే పరవాలేదు. హింసకు, విధ్వంసాలకు, ఈర్ష్య అసూయ, ద్వేషం మొదలైన ప్రవృత్తులకు ఇది దారితీసిన సందర్భాలు కోకొల్లలుగా కనిపిస్తున్నాయి.

మతం పేరిట ఆస్తులు సంపాదించుకోవటం, విలాసవంతమైన జీవితాన్ని గడపటం, కర్మకాండలను ప్రోత్సహించటం, జనాన్ని కూడగట్టుకొని భక్తులుగా





మార్చుకోవటం కనిపిస్తోంది. ఇది సత్యాన్వేషణకు దారితీయదు సరికదా మూఢ విశ్వాసాలను పెంపొందిస్తుంది.

ఏదో ఒక విధానానికి, పద్ధతులకు లోబడడం వల్ల బుద్ధిమాంద్యం ఏర్పడుతుంది. మనసు సచేతనంగా ఉండాలి. సదా జాగరూకులమై ఉండడంవల్లనే సత్యాన్వేషణ సాధ్యమవుతుంది. సత్యాన్వేషణ చెయ్యాలంటే విషయాన్ని అవగతం చేసుకోవటం అవసరం. దీనికి ఏ ఆచ్ఛాదనలూ ఉండకూడదు. జీవితంలో సంకుచిత దృక్పథం పనికిరాదు.

ధ్యానం అన్నదాన్ని నిర్మాణాత్మక దృష్టితో చూడాలని కృష్ణమూర్తి అభిప్రాయం. ధ్యానాన్ని మతంలో భాగంగా భావించటం సరికాదు. యోగాన్ని కూడా మతంలో భాగమని ప్రచారం చేయటం జరుగుతోంది. యోగానికి మంత్రాలకు సంబంధం లేదు. యోగాభ్యాసంవల్ల శరీరం స్వాధీనంలోకి వస్తుంది. అంతే కాని దానివల్ల మానవాతీత శక్తులు లభిస్తాయని, దైవత్వం సిద్ధిస్తుందని భావించరాదు. మంత్రోచ్చారణ ద్వారా అంతరంగంలో శబ్ద సృష్టి జరిగి అదేదో అద్భుతంగా అనిపిస్తుంది. కాని అది అలాంటిదేం కాదు.

మానవుని శక్తికి కూడా కొన్ని పరిమితులున్నాయి. ఉండే శక్తిని మంచికి ఉపయోగించుకోకుండా విద్వేష పూరితమైన కార్యాలకు, పోరాటాలకు వినియోగించటం వ్యర్థం.

భారతీయ తత్త్వశాస్త్రమంతా సత్యాన్వేషణ ధ్యేయంగా వికాసం చెందింది. జిడ్డు కృష్ణమూర్తి కూడా సత్యాన్వేషణను గురించి పదే పదే చెప్తూ వచ్చారు. అయితే ఇతర దార్శనికులకు కృష్ణమూర్తికి ముఖ్యమైన భేదం ఉంది. దార్శనికులందరూ సత్యాన్వేషణకు ఏవేవో మార్గాలను సూచిస్తుంటారు. కాని కృష్ణమూర్తి సత్యానికి మార్గాలు లేవంటారు. ఏ మతం కాని, ధోరణికాని, తాత్త్విక దృక్పథాలు కాని సత్యాన్ని చేరటానికి మనకు ఉపకరించవు. సత్యానికి అవధులున్నాయని, దాన్ని నిర్దిష్ట మార్గంలో చేరవచ్చునని ఆలోచించటమే పొరబాటు.

విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందిందని, సమాజం ఎంతో ప్రగతి సాధించిందని మురిసిపోయే మనం మానసికంగా ఎంతవరకు ఎదిగామనే విషయం ఆలోచించాల్సిందే. మానవ మేధలో ఎలాంటి మార్పూ లేదు. శతాబ్దాల నాటి సంప్రదాయాలు, మతాచారాలు,

భక్తి భావాలు మనిషిలో ఎలాంటి మార్పునూ తీసుకురాలేదు. మన ఆలోచనల ద్వారానే మనం సాధించుకున్న విజ్ఞానం మనలో మంచితనాన్ని ఎంతవరకు పెంపొందించిందో ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. ఆలోచనలు చేసే మనసు స్వేచ్ఛను కోల్పోయింది. సంప్రదాయాలు విధించిన నియమాలు, విశ్వాసాలు మనకు సుఖం కలిగిస్తున్నాయనే భ్రమలో బతుకుతున్నాం.

గతాన్ని విసర్జించినప్పుడే మనసు స్వేచ్ఛగా పనిచేస్తుందని కృష్ణమూర్తి అభిప్రాయం. మనసును ఎప్పటికప్పుడు శూన్యంగా, శుభ్రంగా ఉంచుకోవాలి. అయితే ఇది మన స్వామీజీలు బోధించే వైరాగ్యం వంటిది కాదు. 'అనిత్యాని శరీరాణి అందరి సొమ్ము నాకే రాని' లాంటివి ఒకరికి చెప్పటానికే పనికి వస్తాయి. ప్రాపంచిక విషయాలకు దూరంగా ఉండాలని, ఇదంతా మాయ అని బోధించే వారే సమస్త భోగాలను అనుభవిస్తూ ఉండటం మన నమ్మకాలను వమ్ముచేస్తుంది.

సమాజంలో భద్రత, సుఖ శాంతులు అవసరమే. ఆర్థిక, సాంఘిక స్థిరత మనిషికి అవసమే, కాని దానికోసం దురాలోచనలు చెయ్యటం, మన భద్రత కోసం ఇతరులకు హాని చెయ్యటం మంచిది కాదు. సత్యాన్ని తెలుసుకోవటానికి ఎవరికి వారే ప్రయత్నించాలి కాని మరేదీ మనకు సహాయపడదు. సత్యమంటే ప్రేమ, నేను, నాది, నాలోనే ఈ ప్రపంచం సాగుతుంది, నేను బాగుపడితే చాలు అనేవి సత్య దూరాలు. మనసు నిర్మలంగా ఉంటేనే ప్రేమ ఉదయిస్తుంది.

బాధలను, దుఃఖాన్ని అధిగమించాలంటే దానికి కారణం తెలుసుకోవాలి. ఇది కాలానికి సంబంధించింది. అనుభవం, జ్ఞానం కాలంతో ముడివడి ఉంటాయి. కాలమంటే కేవలం పగలు, రాత్రి, గంటలు, నిమిషాలు అని లెక్కవెయ్యటం సరికాదు. ఒక్కొక్క క్షణమూ భూతకాలంలోకి జారిపోతుంటుంది. జీవితంలో సమస్యలను భూతకాలం సహాయంతో పరిష్కరించటం కంటె తత్కాలంలో స్వచ్ఛంగా ఆలోచించటం ద్వారా పరిష్కరించుకోవాలి.

జ్ఞాపకాలనే తుడిచి పెట్టేస్తే జీవించటం ఎలాగా అనే ప్రశ్న ఉదయిస్తుంది. జ్ఞాపకాలలో రెండు విధాల జ్ఞాపకాలుంటాయి. కొన్ని వాస్తవ జ్ఞాపకాలు, మరికొన్ని మనోగత జ్ఞాపకాలు. వాస్తవ జ్ఞాపకాలు మన నిత్య జీవనానికి అవసరమవుతాయి. కాని మనోగత జ్ఞాపకాలవల్ల సమస్యలు ఉత్పన్నమవుతుంటాయి. వాస్తవ జ్ఞాపకాలు





లేకుంటే జీవన నిర్వహణ కష్టమవుతుంది. కాని మనోగత జ్ఞాపకాలు పేరుకు పోయి మన ఆలోచనలకే అవరోధంగా మారితే స్వేచ్ఛ కరువై పోతుంది.

జిడ్డు కృష్ణమూర్తి ప్రతి మానవునికీ స్వేచ్ఛ అవసరమని ఆలోచించే శక్తి ఉండాలని ఎవరికి వారే తమ అభ్యున్నతికి మార్గాన్ని వెతుక్కోవాలని చెప్తూ వచ్చారు. ఆయన ఎన్ని చెప్పినా వాటిని అనుసరించమని మాత్రం చెప్పలేదు. జిడ్డు కృష్ణమూర్తి విశ్వమానవుడు. ఏ మతానికీ వర్గానికీ చెందినవాడు కాదు. ఆయనలో బుద్ధుణ్ణి, వర్ధమాన మహావీరుణ్ణి, క్రీస్తుని, శంకరాచార్యుని చూచిన వారికి నిరాశే మిగిలింది. ఇలాంటి అన్ని అభిప్రాయాలనూ ఆయన సారాసగటుగా నిరాకరించారు. ఎవరికి వారు తమ జీవన పథాన్ని నిర్ణయించుకోవటానికి జిడ్డు కృష్ణమూర్తి తత్త్వదర్శనం సహాయపడుతుందనటంలో సందేహం లేదు.

# మనుషులుగా జీవిద్దాం

'జీవిద్దాం' అన్నది 'జీవిస్తాను' అన్నదానికి బహువచనం. 'జీవిస్తాను' అనటంలో స్వార్థం ఉంది, అహంకారముంది. ఏ మార్గాన్నయినా అనుసరించి మనుగడ సాగించాలనే అవకాశవాదముంది. 'జీవిద్దాం' అనటంలో సామాజిక బాధ్యత ఉంది మనుషులతో కలిసి జీవించాలనే తపన ఉంది. ఇతరులను కలుపుకొని చెప్పే వ్యాకరణ క్రియ ఉంది. 'జీవిస్తాను', 'జీవిస్తాము' అనే పదాలకు భిన్నమైంది 'జీవిద్దాం'. మనిషిగా పుట్టినందుకు, మనుషుల్ని కలుపుకొని ప్రస్తుత ప్రపంచంలో జీవిద్దామనే ఆశయం ఇందులో ప్రతిఫలిస్తుంది.

ఇప్పటివరకు చెప్పిన వాటిలో సృజనాత్మక తాత్త్విక చింతన ఒక్కటే పునశ్చరణ చెయ్యదగింది. ఎందుకంటే జీవించటానికి సృజనాత్మక తాత్త్విక చింతన అవసరం. సృజనాత్మకమైనదనటంలోనే అది ఒక నిర్దిష్ట మార్గం కాదనే విషయం స్పష్టమవుతుంది. ఆలోచనలకు ఆనకట్ట కట్టినట్లవుతుంది.

అయితే జీవితానికి ఒక మార్గమంటూ అక్కరలేదా? బుద్ధుడు, వర్ధమాన మహావీరుడు, గౌతమ, కపిల, కణాద బాదరాయణాదులు, కృష్ణుడు, శంకరుడు, రామానుజుడు, కృష్ణమూర్తి – వీరు చెప్పిన విషయాలన్నీ మరిచిపోవలసినవేనా? జ్ఞాపకాలే లేకుంటే మనుగడ సాగించటమెలా? గతకాలాన్ని పూర్తిగా నెట్టివేసి శూన్యంగా మార్చేస్తే జీవితంలో ఒక్క అడుగైనా ముందుకు వెయ్యగలమా? ఇలాంటి వందల ప్రశ్నలు మనల్ని వేధిస్తాయి. వీటికి జవాబులు పుస్తకాలలో లేవు. ఇందులో పేర్కొన్న దార్శనికుల మాటల్లో లేవు, కవితల్లో లేవు. సుభాషితాలలో లేవు. మనిషిగా పుట్టినందుకు, మేధాసంపద కలిగి ఉన్నందుకు, ఆలోచనా శక్తితో జన్మించినందుకు ఎవరికి వారు పరిష్కారాన్ని ఆలోచించుకోవలసిందే.

నా జీవితంలోనే వందలు వేల సంఖ్యలో చదివిన పుస్తకాలు, మహాకవులు, మహాపురుషులు, బంధుమిత్రులు వారి పరిచయాలు, వారితో పంచుకున్న అభిప్రాయాలు





ఇవన్నీ వ్యర్థమేనా? వీటిని ఉపయోగించుకోవలసిన అవసరం లేదా? జీవితగమనంలో ఇవన్నీ మనకు ఉపయోగపడవా? ఈ జ్ఞాపకాలనన్నిటినీ ఏం చెయ్యాలి? ఇలాంటి ప్రశ్నలు నా జీవితంలోనే కాదు ఆలోచించగలిగిన ప్రతి వ్యక్తి జీవితంలోనూ ప్రతి నిత్యం ఎదురవుతాయి.

అనంతంగా మనముందు భాసించే మహాసముద్రాన్నీ దానిలో ఎగిసిపడే అలల్ని చూచినప్పుడు, గలగల శబ్దం చేస్తూ ఎప్పటికప్పుడు కొత్త నీటిని మోసుకొస్తూ ప్రవహించే నదిని చూచినప్పుడు, దూరతీరాలకు ఎగురుతూ వెళ్ళే పక్షులతో, ప్రతి క్షణమూ కదలి వెళ్తుండే మేఘాలతో శూన్యాన్నీ చలనాన్నీ ఆలోచనల్లో నింపే ఆకాశాన్ని చూచినప్పుడు జీవించటంలోని అన్వేషణ తెలిసివస్తుంది.

అన్వేషణను గురించి ఆలోచించినప్పుడల్లా రాజమహేంద్రవరాన్ని తలచుకుంటూ ఉంటాను. ఆ నగరం సంప్రదాయం మూర్తీభవించినట్లుంటుంది. అది విచిత్ర నగరం. ఇప్పటికీ నన్నయ్య అక్కడి పురవీధుల్లో ఏదో ఒక రూపాన దర్శనమిస్తూ ఉంటాడు. మరోవైపు నవయుగ వైతాళికుడు కందుకూరి జ్ఞాపకాల్లో మెదులుతుంటాడు. శ్రీపాద, చలం, దీక్షితులు, కృష్ణశాస్త్రి, కృష్ణమూర్తి శాస్త్రి – ఇలాంటి వాళ్ళంతా ఆ ప్రాంతంలోనే ముచ్చటించుకుంటున్నట్టే ఉంటుంది.

నిజం,
రాజమహేంద్రం ఒక విచిత్ర నగరం
నవ్యతను ఆదరించటం
అక్కడి సంప్రదాయం
వెనక్కి పోతున్నట్లు కనిపిస్తూ
ముందుకు పోవటమొక చమత్కారం
గోదావరి గోదావరిగానే ఉంటూ
ప్రవహించటం ఒక సంకేతం.

మనం మనంగానే ఉంటూ మన ఆలోచనలు ముందుకు పోవటం అన్వేషణలో భాగం. ఈ కవి హృదయాలు, ఈ దార్శనికుల దృక్పథాలు, ఈ కృష్ణుడు, ఈ కృష్ణమూర్తి వీళ్ళంతా మన వాస్తవ జ్ఞాపకాలలో ఉన్నా మనం చేయవలసింది మాత్రం స్వతంత్ర అన్వేషణే.

ప్రేమ, దయ, సహనం, కార్యనిర్వహణ, నిజాయితీ, ఔదార్యం లాంటి గుణాలను మన జీవితంలో నేర్చుకోవాలని సజ్జనులుగా జీవితం గడపాలని మనకు పుస్తకాలు, సుభాషితాలు, అనుభవజ్ఞులు, తల్లిదండ్రులు, శ్రేయోభిలాషుల మూలంగా తెలుస్తుంటుంది. ఇంతమంది ఇన్ని విధాలుగా చెప్తున్నా, వందలు వేలు ఉదాహరణలు మన ఎదుట ఉన్నా మనం ఈ మంచి గుణాలను అలవరచుకోక పోవటానికి కారణమేమిటి? ఇవన్నీ ఒకరు చెప్తే వచ్చేవి కావు. మనిషి తనకు తానుగా అన్వేషించి తెలుసుకోవలసి ఉంటుంది. ఈ విషయంలో కొన్ని విషయాలను గురించి నాలో ఎన్నో సంవత్సరాలుగా మథనం జరుగుతూ ఉంది. ఎన్ని ఉపదేశాలు విన్నా, ఎన్ని పుస్తకాలు చదివినా, ఎన్ని దర్శనాల సారాన్ని అర్థం చేసుకున్నా వీటికి సమాధానం మాత్రం కానరాదు. మనిషి మనిషిగా జీవించటాన్ని, సుఖ సంతోషాలతో మనుగడ సాగించటానికి మార్గమేమైనా ఉందా? అది ఎవరికైనా పనికివస్తుందా? లేక కొందరికే ఆ మార్గం అందుబాటులో ఉంటుందా? ఇవన్నీ ప్రశ్నలే. ఎవరి ప్రశ్నలకు వారే సమాధానం వెతుక్కోవలసి ఉంటుంది.

నాకు సంబంధించినంత వరకు శరీరారోగ్యం మానసిక ఆరోగ్యం చక్కగా ఉండాలంటే మనస్సును నిర్మలంగా ఉంచుకోవటం ఒక్కటే మార్గం, మనస్సును నిర్మలంగా ఉంచుకోవటమంటే శూన్యంగా ఉంచటమే. మనస్సును ఆకాశమంత స్వచ్ఛంగా, శూన్యంగా ఉంచటానికి సాధన అవసరం. గతకాలపు జ్ఞాపకాలను, అనుభవాలను తొలగించుకోవటం తేలిక కాదు. మనస్సును ఎప్పటికప్పుడు తాజాగా ఆహ్లాదకరంగా స్వచ్ఛంగా ఉంచుకోవటానికి ఎవరికి వారే ప్రయత్నాలు చేసుకోవాలి. మతం ఆచారాలు, సంప్రదాయాలు, నమ్మకాలు, అన్నిటికంటె ముఖ్యంగా దైవం మన ఆలోచనలకు అడ్డుతగలటం, ఆలోచనలు స్వేచ్ఛగా సాగటానికి వీలు పడకపోవటం మనకు తెలిసిన విషయమే. కులం, మతం, ప్రాంతం, వర్గం, స్థాయి లాంటి వన్నీ 'జీవిద్దాం' అనే ఆశయానికి అడ్డుతగులుతుంటాయి.

సత్యాన్వేషణ అనేది ఎలా ఉండాలి అనే ఆలోచన అందరికీ ఉంటుంది. అసలు సత్యమనేది ఉండాలంటే అది ఎలా ఉంటుంది? దాన్ని తెలుసుకోవటం ఎలా? మనం సత్యమని భావించే వాటిలో సత్యం ఎంతవరకు ఉంది? మల్లెపూవు ఉంది. దానికి తెలుగులో మల్లెపూవు అని పేరు. కాని ఒక్కొక్క భాషలో ఒక్కొక్క పేరు ఉంటుంది కదా. మరి ఆ వస్తువును మల్లెపూవు అని చెప్పటం ఆ భాషకు సంబంధించిందయినా





అది సత్యం కాదుకదా? వస్తువు సత్యమే కాని ఈ వస్తువుకున్న పేరు సత్యం కాదు కదా? కాని మనం పేరే సత్యమనే భ్రమలో ఉంటాం. మనిషికి పేరు ఉంటుంది. కాని ఆ పేరే ఆ మనిషి కాదు కదా? సుబ్బారావు అనే పేరు కొన్ని వందలమందికి వేల మందికి ఉంటుంది. మనం 'సుబ్బారావు తెలుసా' అని అడగగానే 'ఏ సుబ్బారావు' అనే ప్రశ్న ఎదురవుతుంది. ఏ సుబ్బారావును గురించి చెప్పినా ఆ పేరే ఆ వ్యక్తి కాదు కదా? వ్యక్తి వాస్తవం పదార్థం వాస్తవం. కాని దాని పేరు వాస్తవం కాదు.

పూవు, పుస్తకం, కందిపప్పు, జింక, నెమలి, ఇలాంటి పేర్లు ఆ పదార్థం కాకపోయినా ఆ పదార్థం వాస్తవమే, కాని దేవుని విషయంలో ఏ పదార్థం వాస్తవం? శిలా రూపంలో ఉండే ఏ దేవుడైనా, ఆ శిల వాస్తవం కాని దానికుండే పేరు ఎలా వాస్తవమవుతుంది? అందులోనూ ఒకే శిలారూపంలో ఉండే దైవాన్ని వేంకటేశ్వరుడని, శ్రీనివాసుడని, బాలాజీ అని ఏడు కొండలవాడని పిలుస్తుంటే ఏది వాస్తవం? ఇలాంటి ప్రశ్నలకు జవాబులంటూ ఉండవు.

దీనివల్ల తేలేదేమిటంటే ఈ విశ్వంలో పదార్థం సత్యం మనిషి సత్యం, ప్రాణి సత్యం, వాటికుండే పేర్లు సత్యం కాదు. మనిషికుండే పేర్లని బట్టి కాక మనిషి కులం, మతం, ప్రాంతం మొదలైన వాటిని బట్టి కాక వాస్తవమైన మనిషి అస్తిత్వాన్ని బట్టి విలువ ఇచ్చేట్లయితే మనిషికి మనిషికి మధ్య గొడవలుండవు.

జ్ఞాపకాలు అవసరమే. అవసరం అనుకున్నా లేకున్నా మనిషి మెదడులో జ్ఞాపకాలు ఉండనే ఉంటాయి. వీటిలో వాస్తవ జ్ఞాపకాలు మనిషి మనుగడకు అవసరమవుతాయి. ఏదైనా ఒక పదార్థాన్ని గూర్చిన జ్ఞాపకం, ఒక మనిషిని గూర్చిన జ్ఞాపకం ఒక జంతువును గూర్చిన జ్ఞాపకం లేకుంటే మనుగడే సాధ్యం కాదు. అడవిలో క్రూర జంతువులను గురించిన జ్ఞాపకాలే లేకుంటే అడవిలో వెళ్ళేటప్పుడు జాగ్రత్త పడటానికే వీలుండదు.

మరో రకమైన జ్ఞాపకాలుంటాయి. అవి సముద్రంలో అలల లాంటివి. నదిలో తరంగాల లాంటివి. ఆకాశంలో మేఘాల లాంటివి. వాటిని ఎప్పటికప్పుడు తొలగించుకుంటే కాని మనస్సు నిర్మలం కాదు. మనుషులపై ద్వేషం మనిషితో లోగడ కలిగిన చేదు అనుభవాలు, ఇంతకుముందు ఎదుర్కొన్న ఒత్తిడులు మొదలైనవి ఎప్పటికప్పుడు ఖాళీ కాకుంటే జీవితం దుఃఖమయమవుతుంది. అందువల్ల మనసును ఎప్పటికప్పుడు ఆకాశంలా శూన్యం చేసుకుంటూ ఉండాలి. భూతం మనల్ని పట్టి పీడించేలా ఉండకూడదు. భవిష్యత్తు మనల్ని భయభ్రాంతుల్ని చేసేలా తయారు

కాకూడదు. అందువల్ల ఎప్పటికప్పుడు జీవితగమనాన్ని రూపొందించుకుంటూ ఉండాలి.

జీవితం అశాశ్వతం అనే విషయాన్ని దార్శనికులందరూ చెప్తూనే వచ్చారు. కాని మనిషిలో అత్యాశ మాత్రం ఎప్పటికీ తగ్గలేదు. జీవితంలో ఒక్క క్షణం కూడ శాశ్వతం కాదనే సత్యాన్ని తెలుసుకునేంత వరకు మనిషిలో ఆశ చావదు. ద్వేషాలు, రోషాలు తగ్గవు. ప్రపంచంలో ఏదీ మార్పులేకుండా ఉండదు. మన శరీరంలోని ప్రతి కణంలో మార్పులు సంభవిస్తూ ఉంటాయి. స్థూలంగా మనం మనమే అనుకుంటున్నా ప్రతిక్షణమూ మనం వేరే అవుతున్నాం, రాయిరప్పలతో సహా ఏవీ శాశ్వతం కాదు. ప్రతి అణువులోనూ మన కంటికి కనపడని కదలికలుంటాయి.

బౌద్ధంలో భాగమైన క్షణికవాదాన్ని, శూన్యవాదాన్ని చదువుకోక పోయినా మన అన్వేషణతోనే క్షణికమైన వస్తు స్వరూపాన్ని తెలుసుకోగలం. దీన్ని జీవితానికి అన్వయించుకుంటే శత్రుత్వం కాని, ద్వేషం కాని అసూయ కాని, దుఃఖం కాని ఉండవని నాకు అనిపిస్తుంది. ఇదేదో విచిత్రంగా అనిపిస్తుంది. దీన్ని సాధన చేస్తే తప్పకుండా ఎవరికైనా ఇది అనుభవంలోకి వస్తుంది.

ఒక వస్తువును ఒక చోటినుంచి మరో చోటికి మార్చినప్పుడు మొదటి వస్తువు రెండవ వస్తువు వేరు వేరనే భావన వచ్చినప్పుడు అది జీవితంలోను ఎంతగానో ఉపయోగపడుతుంది. చెట్టులోనో మొక్కలోనో తీగెలోనో అందంగా పూచిన పూవును కోసినప్పుడు లేదా అది రాలిపోయినప్పుడు ఆ రెండూ ఒకటే అని భావిస్తాం కాని అవి రెండూ వేరు వేరు. మొదటి పూవు అందం వేరు జీవం వేరు, ఉపయోగం వేరు. ఆ పూవునే కోస్తే దాని అందం వేరు, జీవం వేరు, ఉపయోగం వేరు.

నిన్న ఒక మనిషి మనకు గిట్టకపోతే ఈ రోజు ఆ మనిషి గిట్టకపోవటానికి కారణం లేదు. ఒక్క రోజులో ఎన్నయినా మార్పులు సంభవించవచ్చు. వెనకటి మనిషి ఇప్పటి మనిషి వేరని మనసారా భావించే వారికి గిట్టక పోవటం కాని శత్రుత్వం కాని ద్వేషం కాని ఉండటానికి అవకాశం లేదు.

ఇలా మనసును ఎప్పటికప్పుడు నిర్మలంగా ఉంచుకుంటూ ప్రపంచంలో జీవితాన్ని ప్రతి క్షణం కొత్తగా మలచుకుంటూ వెళ్ళేట్లయితే దుఃఖం మన దరిచేరదు.

ఇవన్నీ చెప్పినందువల్ల ఏ పుస్తకాలూ చదవకూడదని, ఎవరినీ నమ్మకూడదని, ఏదీ శాశ్వతం కాదని అన్నీ వదలివెయ్యాలని అర్థంకాదు. మనిషి మనిషిగా జీవించాల్సిందే. మనిషిగా జీవించటమంటే మానవత్వంతో జీవించటం. సాటి మనిషి





కూడా తనలాంటి వాడే అని భావించటం. ఇతరులకు వచ్చే కష్టమూ తనకు వచ్చే కష్టంలాంటిదే అని భావించటం. ఎవరో ఏదో చెప్పారని కాకుండా తన బుద్ధిని ఉపయోగించగలగటం.

పుస్తకాలు చదవాల్సిందే, అనుభవం గడించాల్సిందే దార్శనికుల దృక్పథాలను పరిశీలించాల్సిందే అయితే దేనికీ కట్టుబడక పోవటం ముఖ్యం, మనస్సులో అవి అంటుకొని మన ఆలోచనలకు అడ్డురాకుండా ఉండేట్లు చూచుకోవాలి.

మంచితనం అన్నది ఒకరు చెప్తే రానక్కరలేదు. మంచితనాన్ని గురించి సోదాహరణంగా ఎవరో చెప్తేనే తెలుసుకోవలసిన అవసరం లేదు. మనిషి ఎలా ఉండాలో ఆలోచించుకొనే శక్తి మనకు ఉంది. దాన్ని ఉపయోగించుకోవటంలోనే మన విజ్ఞత ఇమిడి ఉంది.

మాట్లాడని మానవతీత శక్తుల్ని వదలి
మనిషి భాష మాట్లాడుకుందాం
మనసు లోతుల్లో ఇరుక్కుపోయిన
విషాద స్మృతులు చేసిన గాయాలకు
మానవత్వపు మందు పూసుకుందాం.
ఎవరికి కావాలి మానవత్వం మరిచిన దుర్దినాలు?
మనిషి మీద నెత్తురు కురిసే మేఘాలు?
ఎవరికి కావాలి
మరణానంతర విషాద గీతాలు?
ఎవరికి కావాలి
ఆనందస్మృతులపై బరువుగా లేచే
అందమైన భవనాలు?

మళ్ళీ మొదటికే వస్తే జీవించటానికి సృజనాత్మక తాత్త్విక చింతన ఒక్కటే మార్గమనిపిస్తుంది. అయితే సత్యాన్వేషణకు మార్గమంటూ ఏదీ లేదంటూనే సృజనాత్మక తాత్త్విక చింతనని మార్గమని సూచించటమేమిటనే ప్రశ్న ఉదయిస్తుంది. జిడ్డు కృష్ణమూర్తి లాంటి గొప్ప తత్త్వవేత్తలకే ఇలాంటి ప్రశ్న ఎదురయింది. శ్రీలంకలోని బౌద్ధ పాలీ అధ్యయనాల విశ్వవిద్యాలయానికి కులపతి గొప్ప మేధావి వాల్పొల రాహుల థేరవాదం, మహాయాన బౌద్ధం విషయంలో పేరుగాంచిన పండితుడు. ఆయన కృష్ణమూర్తి రచనల్ని

చదివి ఆయనతో సంభాషణ జరపాలనుకున్నారు. 1978, 1979లలో ఆ ఇద్దరు ఇంగ్లాండులో కలుసుకున్నారు (2005).

కృష్ణమూర్తి చెప్పిన వాటిలో ముఖ్యమైన విషయం దేని ఆధిపత్యాన్నీ అంగీకరించకూడదని, లోబడకూడదనీ, బౌద్ధంలో కూడా ఇదే విషయం ఉంది. బుద్ధుడు కూడా ఏదో విషయం మతగ్రంథాల్లో ఉందనో శాస్త్రాలలో ఉందనో ఒప్పుకో కూడదన్నాడు. అది నిజంగా సరైనదని నీకనిపిస్తే మాత్రం అంగీకరించు లేదంటే త్రోసిపుచ్చు అన్నాడు.

కృష్ణమూర్తి తాను చెప్పిన దాన్ని కూడా అంగీకరించవద్దని తన శ్రోతలకు చెప్పేవాడు. అంగీకరించ వద్దని చెప్పటం కూడా ఆధిపత్యం చలాయించటమే కదా అని రాహుల ప్రశ్నించాడు. కాని అంగీకరించవద్దని చెప్పటం ఎదుటి వాని స్వేచ్ఛకు భంగం కాకూడదనే ఉద్దేశంతోనే. అందువల్ల సృజనాత్మక తాత్త్విక చింతన అన్నది ఒక మార్గం అనటం కంటె ఒక సూచన అనటం మేలేమో!

మనుషులుగా పుట్టినందుకు మనిషికి సహజంగా వచ్చిన జ్ఞాన సముపార్జన శక్తిని వాస్తవ పరిజ్ఞానానికి మాత్రమే ఉపయోగించుకొని జ్ఞాపకాల భారం మనుషుల మధ్య దూరాన్ని పెంచకుండా చూసుకుందాం. మనుషులమైనందుకు మనుషులుగా జీవిద్దాం. మానవత్వమే మతమని నమ్ముదాం. శాంతి సౌఖ్యాలతో అందరితోబాటు మనమూ జీవిద్దాం.



# ఆర్వీయస్. సుందరం రచనలు

**కవిత**

1. ఆధునిక వేమన శతకము – 1969
2. దిగంబర కవిగళు (కన్నడం) – 1972
3. పిటీలు రాగగళ డజన్ (కన్నడం) – 1976
4. గొరిల్లా (కన్నడం) – 1980
5. నిద్రాపుష్పం – 1985
6. సుందర ప్రభవ – 1987
7. నది – నగరం – 1996
8. అక్షరదల్లి అంతరిక్ష (కన్నడం) – 2000, 2009
9. అనీల ఆరాధనా (కన్నడం) – 2012
10. All Alone in the Sky - 2002
11. చండాల స్వర్గారోహణం – 2002

**నవల – కథ**

1. సంస్కారం
2. ఆకాశగంగ – 1975
3. సంగవిజయ (కన్నడ) – 1986
4. భావన (యాత్రానవల) – 1993
5. విద్యార్థి – 1995
6. చిదంబర రహస్యం – 1996
7. సావిర హెడెగళు (కన్నడం) – 2000
8. బిరుగాళి (కన్నడం) – 2000

**విమర్శ – పరిశోధన**

1. తెలుగు సాహిత్యములో దేశికవిత – 1970
2. కన్నడ సాహిత్య చరిత్ర – 1977
3. తెలుగు భాషె మత్తు సాహిత్య (కన్నడం) – 1981
4. పాల్కురికె సోమనాథ (కన్నడం) – 1983
5. పరిశోధన పద్ధతులు – 1990, 2009
6. దిగంబర కవిగళు (కన్నడం) – 2002
7. దక్షిణ భారతీయ సాహిత్య (కన్నడ) – 2005
8. విశ్వవిద్యాలయగళల్లి కన్నడ సంశోధనె (కన్నడం) – 2006, 2009
9. కన్నడ – తెలుగు సంబంధ (కన్నడం) – 2010
10. గ్రంథ పరిష్కరణ శాస్త్రం – 2011
11. శాస్త్ర సాహిత్య (కన్నడం) – 2012
12. సంశోధనెయ తత్త్వ మత్తు విధాన (కన్నడం) – 2013

**ప్రాచీన విశిష్ట సాహిత్యం**

1. నన్నయ భారతం, వచనం (ఆది సభాపర్వాలు) – 1993
2. క్రీడాభిరామం (కన్నడం) – 2000
3. కాటమరాజన కథె (కన్నడం) – 2000
4. పోతన భాగవతం (తెలుగు – కన్నడం), 8 సంపుటాలు – 2014
5. కవిరాజమార్గం (కన్నడం) – 2014
6. ఉదయాదిత్యాలంకారం (కన్నడం – ఇంగ్లీషు) – 2015
7. ఆంధ్రశబ్దచింతామణి (సంస్కృతం, తెలుగు, ఇంగ్లీషు) – 2016

**జానపద విజ్ఞానం**

1. అలిచిప్పలు – ఆణిముత్యాలు – 1972
2. జానపద సాహిత్య స్వరూపం – 1976, 1993
3. జానపద సాహిత్యద మూలతత్వగళు (కన్నడం) – 1976
4. తెలుగు – కన్నడ జానపద గేయాలు – 1979
5. జానపద విజ్ఞాన స్వరూపం – 1980
6. జానపద సాహిత్యం – 1982
7. ఆంధ్రుల జానపద విజ్ఞానం – 1983, 1993, 2003, 2016
8. కర్నాటకాంధ్ర యక్షగాన సమీక్షె (కన్నడం) – 1985
9. Studies in Folkloristics - 1986
10. ఆంధ్ర ప్రదేశ్ జానపద (కన్నడం) – 1987
11. జానపద తత్వగళు (కన్నడం) – 1987
12. జానపద సాహిత్య సౌరభం – 2002
13. Folk Intelligence and other essays - 2008
14. దక్షిణ భారతీయ జానపద కోశ (కన్నడం) – 2011
15. దక్షిణ భారతీయ జానపద విజ్ఞాన కోశం – 2011
16. దక్షిణ భారతీయ దేశీకృషి విజ్ఞాన కోశ (కన్నడం) – 2015
17. దేశీ ఆహార పద్ధతి (కన్నడం) – 2015

**భాష – భాషా విజ్ఞానం**

1. కన్నడ స్వయం బోధిని – 1977
2. భాషె మత్తు భాషా విజ్ఞాన (కన్నడం) – 1978
3. ధ్వని విజ్ఞాన (కన్నడం) – 1979
4. తేనె లొలుగు తెలుగు పలుకు – 2006
5. చెన్న కన్నడ (కన్నడం) – 1979
6. ప్రాచీన భాషగా తెలుగు – 2008
7. శాస్త్రీయ కన్నడ భాషె (కన్నడం) – 2009
8. వజ్రకోశం – 2011
9. తెలుగు కరదీపిక – 2011

**జీవిత చరిత్రలు**

1. పుట్టప్ప కథ – 1975
2. పట్టాభి సీతారామయ్య (కన్నడం) – 1980
3. కోలవెన్ను రామకోటీశ్వరరావు (కన్నడం) – 1080
4. పంజె మంగేశరావ్ – 1981
5. డాక్టర్ సి.ఆర్. రెడ్డి (కన్నడం) – 1986

6. రచనాస్వాదనం – 1994
7. బరెహద బదుకు (కన్నడం) – 2008

**సంపాదకత్వం**

1. అనంతరాగం – 1977
2. రాళ్ళపల్లి పీఠికలు – 1979
3. పఠాభి పన్‌చాంగం – 1980
4. భాష – జానపదం – 1981
5. తెలుగు పాఠ్యగ్రంథం – 1978
6. తెలుగు సాహిత్య స్రవంతి – 1980
7. శేషేంద్ర చమత్కారికలు – 1987
8. చీని సాహిత్య (కన్నడం) – 1989
9. జాపనీస్ సాహిత్య (కన్నడం) – 1990
10. యహూది సాహిత్య (కన్నడం) – 1991
11. అమృత సంపుట (కన్నడం) – 1994
12. సంశోధన పథ (కన్నడం) – 2006
13. పాల్కురికి సోమనాథన లఘుకృతిగళు (కన్నడం) – 1010
14. శ్రీరామాయణ మహాన్వేషణం – 2012

**పిల్లల సాహిత్యం, నవాక్షరాస్య సాహిత్యం**

1. బాలధ్రువుడు – 1970
2. కుట్టొకుట్టొ మళెరాయ (కన్నడం) – 1984
3. మాట, మంత్ర, మోడి ఎష్టు సత్య? (కన్నడం) – 1989
4. మహాభారతద నీతి కథెగళు (కన్నడం) – 1995
5. మోడ – మించు – గుడుగు – సిడిలు (కన్నడం) – 1995
6. అవతారగళు (కన్నడం) – 2001
7. అవతారగళు మానవసృష్టి (కన్నడం) – 2004
8. సైకల్ (కన్నడం) – 2006
9. గ్రహణ (కన్నడం) – 2006





**ఇతర రచనలు**

1. దాక్షాయణి – 1980
2. కన్నడ సంస్కృతి వైభవం – 1990
3. ఆయిల్ పుల్లింగ్ (కన్నడం) – 1998
4. దేశి – దేశీయతె – దేశీవాద (కన్నడం) – 2003
5. సుందర కృతి సంపుట: పుస్తకగళు (కన్నడం) – 2009
6. సుందర కృతి సంపుట: లేఖనగళు (కన్నడం) – 2009
7. సుందరం రచనలు: సృజన – 2013